Postel No. MBN/08/2016-2018


పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :22 | సంచిక :11 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శనివారం 26 ఏప్రిల్ 2025 | పేజీలు :12 | వేల రూ5 /-

## మంత్రి వర్గం
# వాయిదాల పర్వంతోనే సరి...

**హైదరాబాద్, ఏప్రిల్ 25:**ఇదిగో.. అదిగో.. అన్నారు. కొందరైతే డేట్ కూడా ఫిక్స్ చేశారు. తీరా చూస్తే ఏదీ లేదు. వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ఎప్పుడనేది.. అసలు అంతుచిక్కని ప్రశ్నగా మారిపోయింది. అయితే ఇప్పుడు మీనాక్షి నటరాజన్ కామెంట్స్‌తో మరోసారి కేబినెట్ అంశం తెరపైకొచ్చింది. మంత్రివర్గ విస్తరణ ఎవరి పరిధిలో ఉంటుందన్న టాపిక్‌పై తెలంగాణలో హాట్‌హాట్ డిబేట్స్ నడుస్తున్నాయిమంత్రివర్గ విస్తరణ కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూపులు.. అంతకంతకూ పెరిగిపోయిన ఆశావహులు.. కాలం గడిచిపోతున్నా పదవీ కాంక్ష నెరవేరని నాయకుల ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పట్లో కేబినెట్ విస్తరణ కష్టమేనన్న సంకేతాలతో కొన్నాళ్లుగా నేతలంతా సైలెంట్ అయిపోయారు. అయితే లేటెస్ట్‌గా మంత్రివర్గ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త చర్చకు తెరలేపాయి. కేబినెట్ విస్తరణ అంశం ముఖ్యమంత్రి పరిధిలో ఉందంటూ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.ఈ కామెంట్సే ఇప్పుడు



హాట్‌టాపిక్‌గా మారాయి. మొన్నటిదాకా కేబినెట్ విస్తరణ అంశం కాంగ్రెస్ హైకమాండ్ చేతిలో ఉంటుందని చెబుతూ వచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులనే మంత్రిపదవి వరిస్తుందని.. ఆ నేతలు ఎవరనేది మాత్రం నిర్ణయించేది అధిష్టానమే పదేపదే చెప్పారు రేవంత్‌రెడ్డి. దీంతో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల కోసం ఎంతోమంది సీనియర్లు అధిష్టానం పెద్దలను కలవడం, లేఖలు రాయడం జరిగింది.సీనియర్ నేత జానారెడ్డి కూడా హైకమాండ్‌కు లెటర్ రాశారు. రంగారెడ్డి జిల్లాకు ఛాన్సివ్వాలని ఖర్గేకు, కేసీ వేణుగోపాల్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అయితే ఓ అడుగు ముందుకేసి.. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే రాజీనామా చేస్తానంటూ పార్టీ పెద్దలకే అల్టిమేటం ఇచ్చారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టారన్న ప్రచారం జరిగింది. ఇటు నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్ జరిపినట్లు జోరుగా ప్రచారం నడిచింది. ఇలా ఒక్కరేంటి%% మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలన్న తపనతో ఎందరో నేతలు హస్తినబాట పట్టారు.మరికొందరు విజ్ఞప్తి లేఖలు ఢిల్లీకి పంపారు.మొత్తంగా%% కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ ఒకలా.. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మరోలా మాట్లాడటంతో నేతలంతా కన్‌ఫ్యూజన్‌లో పడ్డట్లు తెలుస్తోంది. మరీ ఈ కేబినెట్ విస్తరణ కన్‌ఫ్యూజన్‌పై క్లారిటీ రావాలంటే కాస్త ఆగాల్సిందే..!

## ఎన్‌డీఎస్‌ఏ నివేదిక చూసి
# సిగ్గుపడండి..

**బీఆర్ఎస్‌పై ఉత్తమ్ ఆగ్రహం**



**హైదరాబాద్, ఏప్రిల్ 25:** బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఎన్‌డీసీఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ) ఇచ్చిన నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలంటూ మండిపడ్డారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారని.. ఎన్‌డీఎస్ఏ నివేదిక చూసి బీఆర్ఎస్ సిగ్గుపడాలన్నారు. 'మీరే డిజైన్ చేశారు.. మీరే కట్టారు.. మీరుండగానే కూలిపోయింది' అని తెలిపారు. మేడిగడ్డ సుందిళ్ళ నిరుపయోగంగా ఉన్న రికార్డు స్థాయిలో పంటలు పండాయని తెలిపారు. అబద్ధాలు తప్పులపై బతకాలని బీఆర్ఎస్ అనుకుంటోందని.. అది కుదరదని స్పష్టం చేశారు. నిర్మాణం చేసిన వాళ్ళు.. చేయించిన వాళ్ళు రైతులకు ద్రోహం చేశారని ఆరోపించారు. 'ఎన్‌డీఎస్ఏను రేవంత్ రెడ్డినో.. నేనో వేసింది కాదు. దేశంలో బెస్ట్ ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డీఎస్‌ఏలో ఉన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌డీఎస్ఏ వచ్చింది ' అని చెప్పుకొచ్చారు. రైతులకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్టుపై అధ్యయం చేస్తామన్నారు. వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్‌ఏపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవడి అయ్య జాగీరు అని కట్టారని ప్రశ్నిస్తూ.. కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారు అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## వాహనాలకు హారన్లు గా భారతీయ
# సంగీత శబ్దాలు మాత్రమే వచ్చేలా పరికరాలు

**కేంద్ర రోడ్డు, రవాణా శాఖల మంత్రి నితిన్ గడ్కరీ ఓ సరికొత్త ప్రతిపాదన త్వరలో చట్టం తేవాలని యోచన**



**న్యూ ఢిల్లీ ఏప్రిల్ 25:**కేంద్ర రోడ్డు, రవాణా శాఖల మంత్రి నితిన్ గడ్కరీ ఓ సరికొత్త ప్రతిపాదన చేశారు. వాహనాలకు హారన్లు గా భారతీయ సంగీత పరికరాల శబ్దాలు మాత్రమే వచ్చేలా త్వరలో చట్టం తేవాలని యోచిస్తున్నట్లు చెప్పారు.నవభారత్ టైమ్స్ 78వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గడ్కరీ ప్రసంగించారు. అన్ని వాహనాలకు హారన్లుగా భారతీయ సంగీత పరికరాలు ఉత్పత్తి చేసే శబ్దాలనే వినియోగించేలా చట్టం తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఫ్లూట్, తబలా, వయెలిన్, హార్మోనియం వంటి వాయిద్య పరికరాల ద్వారా వచ్చే శబ్దాలు ఇందులో ఉంటాయని చెప్పారు. ఆయా ధ్వనులు వినడానికి ఎంతో హాయిగా ఉంటుందని తెలిపారు.ఇదే కార్యక్రమంలో వాయుకాలుష్యంపై కూడా నితిన్ గడ్కరీ మాట్లాడారు. దేశంలో మొత్తం వాయు కాలుష్యం రవాణా రంగం వాటా 40 శాతం వరకు ఉంటుందని చెప్పారు. దీన్ని ఎదుర్కొనేందుకు మోదీ ప్రభుత్వం మిథనాల్, ఇథనాల్‌తో నడిచే వాహనాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఇక భారత్‌లో ఆటోమొబైల్ పరిశ్రమ బలాన్ని కూడా గడ్కరీ హైలెట్ చేశారు. కార్లు, ద్విచక్ర వాహనాల ఎగుమతి ద్వారా దేశం గణనీయమైన ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్లు చెప్పారు. 2014లో భారత ఆటోమొబైల్ రంగం విలువ రూ.14 లక్షల కోట్లు కాగా, ఇప్పుడు అది రూ.22 లక్షల కోట్లకు పెరిగినట్లు చెప్పారు. మన ఆటోమొబైల్ మార్కెట్ జపాన్‌ను అధిగమించి అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో నిలిచిందన్నారు

# ఉగ్రదాడిపై ప్రతీకారం..

## భారత్ ముందు నాలుగు మిలిటరీ ఆప్షన్‌లు

**న్యూ ఢిల్లీ ఏప్రిల్ 25:**మూడు రోజుల క్రితం పహల్గాం లో జరిగిన ఉగ్రదాడి తో భారత్ ఉలిక్కిపడింది. ఈ దాడిలో 26 మంది అమాయాక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ప్రతీకారంతో రగిలిపోతోంది. ఈ క్రూరమైన దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది. భవిష్యత్తులో ఆర్థికంగా కోలుకోకుండా చేసేందుకు సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపేసింది.ఇక పహల్గాంలో నరమేథం సృష్టించిన ఉగ్రవాదులను వదిలిపెట్టకూడదని, వాళ్లకు ధీటైన జవాబు ఇవ్వాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎలా ప్రతీకారం తీర్చుకొంటారన్నది చర్చనీయాంశంగా మారింది. భారత ప్రభుత్వం మాత్రం సైనిక చర్య అంశంపై గుంభనంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి అడుగు వేయబోతుందనే విషయంలో నిపుణులు తమతమ అంచనాలను వెల్లడిస్తున్నారు. మొత్తానికి భారత్ ఎదుట నాలుగు మిలిటరీ ఆప్షన్లు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ నాలుగు ఆప్షన్‌లు ఏమిటో ఇప్పుడు చూద్దాం..

**రఫేల్, మిరాజ్‌లను రంగంలోకి దింపడం..**

ప్రస్తుతం వాయుసేనలో అత్యాధునిక ఫైటర్ జెట్లు అయిన రఫేల్, మిరాజ్ విమానాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించి పాకిస్థాన్‌లోని కీలక స్థావరాలపై దాడులు చేయడం



ఇండియన్ మిలిటరీ ముందున్న మొదటి ఆప్షన్. అదే సమయంలో బాలాకోట్‌పై దాడి అనంతర అనుభవాలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యర్థుల రక్షణ వలయాన్ని ఛేదించే సామర్థ్యాలు రఫేల్, మిరాజ్‌లకు ఉన్నాయి. అయితే ఈ ఆప్షన్‌ను ఎంచుకుంటే అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి.లైన్ ఆఫ్ కంట్రోల్‌ను దాటి..సిమ్లా ఒప్పందాన్ని పక్కన పెడతామని తాజాగా పాకిస్థాన్ బెదిరించింది. ఆ ప్రకారం చూస్తే ఆ దేశం నియంత్రణ రేఖను గుర్తించనట్లు అవుతుంది. దాంతో భారత్‌కు దూకుడుగా ఆపరేషన్లు చేపట్టే అవకాశం లభిస్తుంది. ఇటీవల ఎల్‌వోసీ వద్ద పాకిస్థాన్ జరిపిన ఉల్లంఘనలను భారత్ కారణంగా చూపవచ్చు. ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఆపరేషన్లు చేపట్టవచ్చు. ఇది భారత్ ముందున్న మరో ఆప్షన్‌గా చెప్పవచ్చు. కాకపోతే అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితులు భారత దళాలకు సవాల్‌గా మారుతాయి. ఆపరేషన్లకు సుదీర్ఘ సమయం పట్టడం, ఇప్పటికే పలు బలమైన పొజిషన్లలో పాకిస్థాన్ దళాలు ఉండటం ప్రతికూలంగా మారవచ్చు.


**భారీ టార్గెట్స్‌పై సర్జికల్ స్ట్రైక్స్..**

భారీ టార్గెట్లను గుర్తించి సర్జికల్ స్ట్రైక్స్ చేయడం భారత్ ముందున్న మూడో ఆప్షన్. కాకపోతే ఇప్పుడు పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండటంతో సర్జికల్ స్ట్రైక్స్ అంత సులువు కాకపోవచ్చు. సక్సెస్‌ఫుల్‌గా సర్జికల్ స్ట్రైక్స్ చేయాలంటే రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్, శక్తిమంతమైన దళాలు, కచ్చితమైన ప్లానింగ్ అవసరం.

**శతఘ్నులు, స్నైపర్లతో కాల్పులు..**

ఇక లక్ష్యాలపై గురిపెట్టి భారీ శతఘ్నులు, స్నైపర్ గన్స్‌తో కాల్పులు జరపడం భారత్ ముందున్న నాలుగో ఆప్షన్‌గా చెప్పవచ్చు. వీటితోపాటు భారీ మోర్టార్లను కూడా వాడవచ్చు. దాంతో ఉద్రిక్తతలకు అవకాశం తక్కువగా ఉంటుంది. నియంత్రణ రేఖ సమీపంలోని శత్రుస్థావరాలు, సరఫరాల మార్గాలు, ఔట్‌పోస్టులను తుడిచిపెట్టవచ్చు. కాకపోతే ఈ దాడులతో ఫలితం పెద్దగా ఉండదు. భారీ దాడులతోనే భారీ ఫలితం దక్కుతుంది.


# కేటీ రామారావుకు ఫుల్ పవర్స్



**హైదరాబాద్, ఏప్రిల్ 25:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఎన్నికల్లో ఆయనే అంతా డిసైడ్ చేసేటట్లున్నారు. కేసీఆర్ పార్టీ అధినేతగా ఉన్నప్పటికీ ఆయన గౌరవం ఆయనకు ఉంటుంది. ఆయన సలహాలు, సూచనలు మాత్రమే తీసుకుంటారు. కేసీఆర్ చెప్పే వ్యూహాలను రాజకీయంగా అమలు చేయనున్నారు. అంతే తప్ప నియోజకవర్గాల్లో కేసీఆర్ జోక్యం మాత్రం ఇక ఉండకపోవచ్చని అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. కేసీఆర్ రాజకీయంగా యాక్టివ్ గా ఉండకపోవచ్చున్న ఊహాగానాలు గులాబీపార్టీలో జోరుగా ఊపందుకుంటున్నాయి. అదే సమయంలో కేటీఆర్ ను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు కూడా క్యూ కడుతున్నారు. వచ్చే ఎన్నికలకు ముందు అంటే రానున్న ఏడాది తాను తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ వచ్చే ఏడాది పాదయాత్ర చేసిన తర్వాత కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఇప్పటికే అక్టోబరు నెలలో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని కూడా కేటీఆర్ ప్రకటించారు. ఇక తాజాగా కేటీఆర్ రాజేంద్ర నగర్ ఉప ఎన్నికల్లో పటోళ్ల కార్తీక్ రెడ్డి పేరును ప్రకటించడం కూడా ఈ చర్చకు కారణమయింది. ఏ మాత్రం కేసీఆర్ తో సంబంధం లేకుండా ముందుగానే, ఉప ఎన్నికల ఊసే లేకముందే అభ్యర్థిని ప్రకటించడంతో ఇంకా కారు స్టీరింగ్ కేటీఆర్ చేతుల్లోనే ఉన్నట్లు స్పష్టమయింది. కేసీఆర్ కూడా తొలి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక పెద్దగా ఆయన రాష్ట్రం కోసం పనిచేయాలన్న ఆకాంక్ష కూడా లేదు. దీంతో పాటు ఎక్కువ కాలం ఫామ్ హౌస్ లోనే పరిమితమవుతున్నారు. వ్యవసాయంలోనే ఆయన ఎక్కువ గడుపుతూ చాలా వరకూ సేద తీరుతున్నారు. వ్యవసాయ క్షేత్రం అంటే ఆయనకు మక్కువ. రాజకీయంలో అంచులన్నీచూశారు. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ కు మిగిలిన రాజకీయ నేతలకు మాదిరిగా పెద్ద లక్ష్యాలు ఏవీ ఉండవు. కానీ తాను స్థాపించిన పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకు వస్తే చాలునన్న భావనలో ఉన్నారు. అందుకే ఈసారి ఎన్నికలలో కేటీఆర్ క్రియాశీలకంగా మారనున్నారు. టిక్కెట్లను కూడా ఆయనే కేటాయించనున్నారు. ఇది ఫైనల్ అంటూ గులాబీ పార్టీలే అభిప్రాయపడుతున్నాయి.

## హైదరాబాద్లో 200 మందికి పైగా పాకిస్థానీయులు వాళ్ళను వెనక్కి పంపాలి

**రేవంత్ ప్రభుత్వానికి అమిత్ షా ఆదేశాలు**



**హైదరాబాద్:**పాకిస్థానీయులను వెనక్కి పంపాలపి రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసారు. ఈ విషయమై ఆయా రాష్ట్రాల సీఎం లకు అమిత్ షా ఫోన్ చేసారు. కాగా హైదరాబాద్లో 200 మందికి పైగా పాకిస్థానీయులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో హైఅలర్ట్ ప్రకటించి, వారిని వెనక్కి పంపేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# సంపాదకీయం


## వ్యవసాయాన్ని ముంచనున్న సోలార్ ప్రాజెక్టులు!

విద్యుత్ లేని ఆధునిక సమాజాన్ని ఊహించలేము. నిత్య జీవితంలో విద్యుత్ వాడకం పెరుగుతున్నది. దానికి తగ్గట్టుగా ఉత్పత్తి పెరగాలి. శాస్త్ర విజ్ఞాన పరిశోధనల ఫలితంగా గాలి, సూర్యరశ్మి, అణుశక్తితో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో 72 శాతం బొగ్గుతో తయారయ్యేది. ఇది చాలా ఖర్చుతో కూడుకోవడమే కాక, పర్యావరణాన్ని కూడా దెబ్బతీస్తుంది. అందుకే గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. అందుకు ఎవరికీ అభ్యంతరం లేదు. అయితే ఈ గ్రీన్ ఎనర్జీ పేరుతో వ్యవసాయాన్ని బలి పెట్టడాన్ని ప్రశ్నించాలి. గ్రామీణ వ్యవస్థను తీవ్రంగా ఛిద్రం చేసే ఈ సోలార్ ఉత్పత్తి రాష్ట్రాభివృద్ధికా? కార్పొరేట్ల కోసమా? తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అయ్యే గాలి, సూర్యరశ్మి విద్యుత్‌ను ప్రభుత్వం ఉత్పత్తి చేయకుండా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం మోడీ పాలనా కాలంలో భారీగా పెరిగింది. అదానీ, అంబానీ, టాటా, బిర్లా లాంటి అతి పెద్ద కార్పొరేట్ కంపెనీలు సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోకి వచ్చి, కేంద్ర ప్రభుత్వ అండదండలతో రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి తమకు అనుకూలంగా విధానాలను అమలు చేయించుకునే స్థితికి చేరాయి. ఆంధ్ర రాష్ట్రాన్ని తమ ప్రయోగశాలగా మార్చుకున్నాయి. రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చాటున లక్షల ఎకరాల భూములను ఈ కంపెనీలు కొనడం లేదా లీజు పద్ధతుల్లో స్వాధీనం చేసుకుంటున్నాయి. వ్యవసాయాన్ని ముంచేందుకు ఈ సోలార్ కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ప్రజల జీవితాలను ఛిద్రం చేసే కరువును కూడా 'కొందరు' ప్రేమిస్తారని చాలా సంవత్సరాల క్రితం ప్రముఖ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. కరువును అవకాశంగా తీసుకుని పెద్ద ఎత్తున అవినీతికి, అక్రమాలకు పాల్పడే అధికారులు, పేదలకు ఇచ్చే బియ్యం అమ్ముకుని కార్లు, బంగ్లాలు కొనే రాజకీయ నాయకులు, కరువు పనుల పేరుతో చేయని పనులకు బిల్లులు పెట్టుకుని కొల్లగొట్టే కాంట్రాక్టర్లు కరువును ప్రేమిస్తారని ఆయన పరిశోధనాత్మకంగా విశ్లేషించారు. ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వాలు కరువును ప్రేమిస్తున్నాయి. కరువు నుండి ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వాలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా కార్పొరేట్ కంపెనీలను పెంచి పోషిస్తున్నాయి. భూముల నుండి రైతులను ఖాళీ చేయిస్తున్నాయి. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో సగటు వర్షపాతం తక్కువగా వుంటుంది. అందువల్ల వేడి ఎక్కువగా వుంటుంది. సంవత్సరంలో సుమారు 324 రోజులు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఈ ప్రాంతంలో వుంది. ఇక్కడి పగటి వేడి, రాత్రి, పగలు వీచే గాలులు విండ్ మిల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అత్యంత అనుకూలంగా వున్నాయి. అందువల్ల సోలార్, గాలిమరల విద్యుత్ ఉత్పత్తి గత పది సంవత్సరాల్లో ఈ జిల్లాల్లో భారీగా పెరిగింది. అనంతపురం జిల్లాలో 2022-23 నాటికి డిస్కమ్ (డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్) పరిధిలో 3,755.26 మెగావాట్ల సోలార్ విద్యుత్, 3,693.55 మెగావాట్ల గాలిమరల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న సోలార్ విద్యుత్‌లో 89 శాతం అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోనే తయారవుతుంది. అనంతపురం జిల్లాలో 43 శాతం, కర్నూలు 28, కడప 18 శాతం సోలార్ ఉత్పత్తి అవుతుంది. నీటి పంపింగ్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఐదు హైడ్రో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను కూడా ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోనే ఏర్పాటు చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం జరిపిన అన్ని మంత్రివర్గ సమావేశాలు ఈ ప్రాంత భూములను సోలార్, విండ్ మిల్ కంపెనీలకు కేటాయించా యంటే కరువును వారు ఎంతగా ప్రేమిస్తున్నారో తెలుస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న సోలార్, గాలిమరల విద్యుత్ ప్రాజెక్టులు కాకుండా అదనంగా మరో 38 గిగావాట్ల విద్యుత్‌ను సోలార్ ద్వారా ఉత్పత్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఒక గిగావాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి కావాలంటే 5 వేల ఎకరాలు కావాలి. అంటే 38 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి 1,90,000 ఎకరాలు భూమి కావాలి. ఇందుకోసం కర్నూలు జిల్లాలో 31,450 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 29,983, కర్నూలు జిల్లాలో 29,549, ప్రకాశం జిల్లాలో 9,630 ఎకరాలు మొత్తం 1,00,612 ఎకరాల సర్వే పూర్తి చేశారు. ఇందులో అదానీ కంపెనీకి 75,000 ఎకరాలు, అంబానీ కంపెనీకి 46,555 ఎకరాల భూమిని ఇవ్వనున్నారు. ఇది కాకుండా అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో 10 వేలు, కళ్యాణదుర్గంలో 15 వేలు, పుట్టపర్తిలో 15 వేలు, రాప్తాడులో 5 వేల ఎకరాలు సేకరించనున్నారు. ఈ రకంగా భూములు సేకరించడాన్ని ప్రతిపక్షంలో వున్నప్పుడు విమర్శించిన తెలుగుదేశం ప్రస్తుతం అదే ఒప్పందాలను కొనసాగిస్తూ భూ సేకరణకు సిద్ధపడింది. సోలార్ కంపెనీలు ప్రారంభ రోజుల్లో భూములను కొనుగోలు చేసి విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేవారు. భూముల ధరలు పెరగడంతో పాటు కంపెనీలు కావాలనుకున్నంత భూమి ఒకే చోట సమీకరించుకోవడం కంపెనీలకు కష్టమైంది. దీంతో లీజు ఒప్పందాలు అని కంపెనీలు, ప్రభుత్వాలు కలిసి కొత్త అవతారం ఎత్తాయి. రెవిన్యూ శాఖ మరియు ఎన్.ఆర్.ఇ.డి.సి.ఎ.పి (న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా ప్రభుత్వం ఈ కంపెనీలకు సంపూర్ణంగా తోడ్పడుతున్నది. పంటలు పండకపోవడం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఇప్పటికే కరువు జిల్లాల రైతులు వ్యవసాయం మీద విశ్వాసాన్ని కోల్పోయారు. నిరాశ, నిస్పృహలతో ఈ సోలార్ కంపెనీలకు లీజుకు ఇవ్వడానికి పోటీలు పడుతున్నారు. రైతులకు సాగునీరు ఇచ్చే అవసరం, పంట నష్టపరిహారాలు ఇవ్వాల్సిన అవసరం, గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేకుండా పోతుంది. అందుకే పాలకులు వ్యవసాయ వినాశకరమైన ఈ విధానాన్ని పెంచిపోషిస్తున్నారు. ఎకరాకు రూ.30 వేలు లీజు, 30 సంవత్సరాల వరకు అని కంపెనీలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అధికార పార్టీల ఎం.ఎల్.ఏ లు, ఎంపీలు, స్థానిక పలుకుబడి కలిగిన నాయకులు రైతులను మభ్యపెడుతూ భూములు లీజుకు ఇచ్చేటట్లు ఒప్పిస్తున్నారు. రైతుల్లో వున్న సందేహాలు తీర్చకుండానే పెద్ద రైతులు భూములు ఇచ్చారని చెబుతూ మానసిక ఒత్తిళ్ళను పెంచి ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ లీజు ఒప్పంద పత్రాలు ఇంగ్లీషులో వుండడమే కాక, కనీసం 20-30 పేజీలు వుంటున్నాయి. ఇందులో వారు ఏం రాసుకున్నారో రైతులకు తెలిసే అవకాశం తక్కువ. కంపెనీలు రైతులతో చేసుకుంటున్న ఈ ఒప్పందాల్లో ప్రభుత్వ బాధ్యత ఏమిటో స్పష్టంగా లేకపోవడం అనేక సందేహాలను కలిగిస్తుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి లీజు మొత్తాన్ని పెంచుతామని కంపెనీలు అంటున్నాయి. ఒకవేళ లీజు మొత్తం సకాలంలో ఇవ్వకపోయినా, పెంచకపోయినా కోర్టుకు వెళ్లవచ్చు అని ఈ పత్రాల్లో రాశారు. కంపెనీ కేంద్ర కార్యాలయం ఎక్కడ వుంటే ఆ ప్రాంత కోర్టులో కేసు వేసుకోవాలని ఇందులో వుంది. ఉదాహరణకు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలో లీజు ఒప్పందం చేసుకున్న 'అక్మే (ఎ.సి.ఎం.ఇ) ఉర్జా ఒన్' అనే కంపెనీ కేంద్ర కార్యాలయం హర్యానాలోని గుర్గావ్‌లో వుంది. ఈ కంపెనీపై వివాదం వస్తే సాధారణ రైతు అక్కడికి వెళ్లి కేసు వేయాల్సి వుంటుంది. ఇది ఆచరణ సాధ్యమేనా? లీజుకు ఇచ్చిన రైతు ఆ భూమిని అమ్మినా లేదా వాటాలుగా పంచుకున్నా కొన్నవారు లేదా వాటాదారులు భూమిని స్వాధీనం చేసుకోవడానికి వీలులేదు. కొత్త భూ యజమాని కూడా పాత ఒప్పందానికే కట్టుబడి వుండాలి. వందల మంది రైతుల నుండి తీసుకున్న వేల ఎకరాల భూమిని కంపెనీలు పూర్తిగా చదును చేస్తాయి. హద్దులు చెదిరిపోతాయి. 30 సంవత్సరాల తర్వాత ఎవరి భూమి ఎక్కడుందో గుర్తు పట్టడం అసాధ్యమవుతుంది. 30 సంవత్సరాలు భూమికి దూరమైన వ్యవసాయదారులు తిరిగి వ్యవసాయం చేయడం సాధ్యం కాదు. కావున తమ భూములను కంపెనీలకు అమ్మడం అనివార్యంగా మారుతుంది. ఈ రకంగా వెనుకబడిన జిల్లాల్లోని లక్షల ఎకరాల భూమి ఇలా కొన్ని కంపెనీల చేతుల్లోకి వెళ్ళి లక్షలాది రైతులు నిరాశ్రయులుగా మారతారు. గ్రామీణ వ్యవస్థ ధ్వంసం అవుతుంది. పైనుండి నీటిని యంత్రాల మీదకు వేగంగా పడేటట్టు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం పాత పద్ధతి. కొత్త సాంకేతికతను ఉపయోగించి కింద నుండి పైకి నీటిని కొట్టేలా వేగంతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ఈ హైడ్రో విద్యుత్ ఉత్పత్తి పద్ధతి. దీని కోసం నీరు కావాలి. కరువు జిల్లాల్లో నీటి వనరులే తక్కువ. ఉన్న కొద్దిపాటి నీటి వనరుల నుండి హైడ్రో విద్యుత్ కంపెనీలకు నీటిని కేటాయిస్తున్నారు.

# నేడు శ్రీనివాస రామానుజన్ వర్ధంతి

## భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్

అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త మన శ్రీనివాస రామానుజన్. 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఉత్తర అర్కాట్ జిల్లా ఈరోడ్‌లో ఓ నిరుపేద కుటుంబంలో పుట్టాడు. ఆయన తలిదండ్రులు కోమలమ్మాళ్, శ్రీనివాస అయ్యంగార్. పన్నెండేళ్ల వయసులోనే అసాధారణ బాలునిగా గుర్తింపు పొందిన రామానుజన్ 'ఆయిలర్' సూత్రాలు, త్రికోణమితికి చెందిన అనేక సమస్యలను స్వయంగా సాధించాడు. రామానుజన్‌లోని తెలివితేటలను బయటకు తీసుకువచ్చిన గ్రంథం కార్ రాసిన 'సినాప్సిస్', అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్ద పెద్ద ప్రొఫెసర్‌లు సైతం ఎన్నో పుస్తకాలు రిఫర్ చేసినా అర్థం చేసుకోలేకపోయిన సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవాడు. అప్పటికే అందులో చాలా సమస్యలు నిరూపించబడ్డాయన్న విషయం తెలియకపోవడంతో వాటిని తన పద్ధతితో సాధించాడు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ ఎఫ్.ఎ. పరీక్ష తప్పాడు. తర్వాత మద్రాస్‌లోని వచ్చయ్యప్ప కాలేజీలో చదువుకు చేరాడు. అక్కడ గణితోపాధ్యాయునిగా ఉన్న ఎన్.రామానుజాచారి సమస్యలను కఠినంగా చెప్తుంటే, రామానుజన్ వాటిని తనదైన రీతిలో




తక్కువ సోపానాలతో సాధించే వాడు. రామానుజన్ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. తర్వాత రామానుజం 1909లో జానకి అమ్మాళ్‌ను పెళ్లి చేసుకున్నాడు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై పరిశోధనలు కొనసాగించేవాడు. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా?వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డి (1877-1947)కి పంపాడు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. అక్కడ రాత్రనకా, పగలనకా గణితం పైనే ఏకాగ్రత పెట్టి కొత్త సిద్ధాంతాలను కనిపెట్టాడు రామానుజన్. ఫిబ్రవరి 28, 1918లో 'ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ' గౌరవం పొందిన రెండవ భారతీయుడిగా, 1918 అక్టోబర్‌లో 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి' గౌరవం పొందిన మొదటి భారతీయుడిగా చరిత్రకెక్కాడు. 1919 మార్చిలో భారతదేశానికి తిరిగి వచ్చాడు. మనదేశ ఔన్నత్యాన్ని జగతికి చాటిన రామానుజన్, అనారోగ్య కారణంగా చివరకు ఏప్రిల్ 26, 1920న అస్తమించాడు. అప్పటికి ఆయన వయసు 33. చివరిదశలో 'మ్యాజిక్ స్క్వేర్', 'ప్యూర్ మాథ్స్‌కు చెందిన నంబర్ థియరీ', 'మాక్ తీటా ఫంక్షన్స్' చాలా ప్రసిద్ధి పొందాయి. వీటి ఆధారంగా ఆధునికంగా కనుగొన్న స్ట్రింగ్ థియరీ, క్యాన్సర్ పరిశోధనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని 1986-87 రామానుజన్ శతజయంతి ఉత్సవాల్లో గణిత శాస్త్రవేత్తలు ప్రకటించారు. రామానుజన్ నోటు పుస్తకాలపై, గణిత సిద్ధాంతాలపై రామానుజన్ ఇనిస్టిట్యూట్‌లో, అమెరికాలోని 'ఇలినాయిస్' యూనివర్సిటీలో నేటికీ రీసెర్చ్ జరుగుతోంది. గణితశాస్త్రంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును 'జాతీయ గణితదినోత్సవం'గా ప్రకటించింది.

# అఘోరి అరెస్ట్... విచారణ... హై డ్రామా..

**మెదక్, ఏప్రిల్ 25:** ఘోరీ.. తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా హల్‌చల్ చేస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యువకుడు శ్రీనివాస్ అఘోరీగా మారినట్లు ప్రచారం చేసుకుంటున్నాడు. శ్మశానంలో పూజలు, రోడ్లపై హల్‌చల్ చేస్తూ.. పోలీసులను, సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాడు. ఇటీవల ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. అఘోరిపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో అరెస్టు చేశారు. అతడిని జైలుకు తరలించే క్రమంలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా హల్‌చల్ చేస్తున్న అఘోరీ తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి. అతడి వయసు 27 ఏళ్లు. కేదార్‌నాథ్‌లో సాధువుగా జీవిస్తున్నాడు. అతను తన కలలో 'అర్ధనారీశ్వర' రూపాన్ని చూసినట్లు పేర్కొన్నాడు, దీని స్ఫూర్తితో లింగ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవాలని నిర్ణయించాడు. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరిగినట్లు వైద్యులు గుర్తించారు.

**చెన్నైలో మొదటి శస్త్రచికిత్స..**

మొదటి దశలో, అతని శరీరం నుంచి కొన్ని పురుష అవయవాలు (పురుష జననేంద్రియాలు) తొలగించబడ్డాయి. ఈ శస్త్రచికిత్స తర్వాత అతను ఇండోర్‌కు తిరిగి వచ్చి, తన ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి అధికారిక పత్రాలను నవీకరించాడు.జూన్ 28, 2024న, ఇండోర్‌లోని భండారీ హాస్పిటల్‌లో డాక్టర్ అశ్విన్ దాస్ (ప్లాస్టిక్, కాస్మెటిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్) నేతృత్వంలో ఐదు గంటల పాటు జరిగిన శస్త్రచికిత్సలో అతను పురుషుడి నుంచి స్త్రీగా పూర్తిగా మార్పిడి చెందాడు. ఈ శస్త్రచికిత్స విజయవంతమైనట్లు వైద్యులు ప్రకటించారు. అయితే, వైద్యులు అతను 'అర్ధనారీశ్వర' రూపాన్ని సాధించినట్లు పేర్కొన్న ఊహాగానాలను ఖండించారు, ఇది కేవలం లింగ మార్పిడి శస్త్రచికిత్స అని స్పష్టం చేశారు.అఘోరీలు శైవ సంప్రదాయంలో భాగమైన సాధువులు, వారు సాంప్రదాయిక సామాజిక నిబంధనలను తిరస్కరించి, ఆధ్యాత్మిక మోక్షం కోసం తీవ్రమైన సాధనలు చేస్తారు. అఘోరీ సంస్కృతిలో 'అర్ధనారీశ్వర' ఒక పవిత్ర భావన, ఇది పురుష, స్త్రీ శక్తుల సమన్వయాన్ని సూచిస్తుంది. ఈ సాధువు తన లింగ మార్పిడిని ఈ ఆధ్యాత్మిక ఆదర్శంతో ముడిపెట్టినప్పటికీ, ఇది




అఘోరీ సంప్రదాయంలో సాధారణ ఆచారం కాదు. అఘోరీలు సాధారణంగా శారీరక మార్పుల కంటే మానసిక, ఆధ్యాత్మిక సాధనలపై దృష్టి పెడతారు.లింగ మార్పిడి శస్త్రచికిత్స లేదా జెండర్ అఫర్మేషన్ సర్జరీ, ఒక వ్యక్తి యొక్క శారీరక లక్షణాలను వారి లింగ గుర్తింపుకు అనుగుణంగా మార్చే వైద్య ప్రక్రియ. ఈ సాధువు విషయంలో, అతను పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ ప్రక్రియలో సాధారణంగా ఈ క్రింది దశలు ఉంటాయి.వైద్య పరీక్షలు: శస్త్రచికిత్సకు ముందు, రోగి యొక్క శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి హార్మోన్ స్థాయిలు, రక్త పరీక్షలు, మానసిక సంప్రదింపులు నిర్వహించబడతాయి. జెండర్ డిస్ఫోరియా (లింగ గుర్తింపు వల్ల కలిగే మానసిక ఒత్తిడి) నిర్ధారణ కీలకం.హార్మోన్ థెరపీ: ఈస్ట్రోజన్, ప్రొజెస్టెరోన్ వంటి హార్మోన్లను నిర్వహించడం ద్వారా స్త్రీ లక్షణాలను పెంపొందించడం. ఈ సాధువు హార్మోన్ థెరపీ తీసుకున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి.

**జైలులో హైడ్రామా..**

ఇదిలా ఉంటే.. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన అఘోరీ శ్రీనివాస్, శ్రీవర్షిణీ కేసు జైలు వరకూ వివాదాస్పదంగా మారింది. మోసం కేసులో అరెస్టయిన అఘోరీ, జైలులో తన భార్య వర్షిణీని తన వద్దే ఉంచాలని రచ్చ చేయడం, ట్రాన్స్‌జెండర్ గుర్తింపు వల్ల జైలు అధికారులు ఎదుర్కొన్న సమస్యలు ఈ కేసును మరింత ఆసక్తికరంగా మార్చాయి.అఘోరీ శ్రీనివాస్, ఒక మహిళా నిర్మాతను పూజల పేరుతో రూ.10 లక్షలు తీసుకుని మోసం చేసిన ఆరోపణలతో మోకిలా పోలీసులచే అరెస్టయ్యాడు. ఫిర్యాదు ఆధారంగా, పోలీసులు అతన్ని ఉత్తరప్రదేశ్‌లో అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. రెండు గంటల పాటు విచారణ తర్వాత, అతన్ని చేవెళ్ల కోర్టులో హాజరు చేయగా, న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.సంగారెడ్డి జిల్లాలోని కంది సబ్ జైలుకు తరలించినప్పుడు అఘోరీ శ్రీనివాస్ అరుపులు, కేకలతో హైడ్రామా సృష్టించాడు. తన భార్య శ్రీవర్షిణీని తనతోనే ఉంచాలని, ఆమె లేకుండా తాను ఉండలేనని గట్టిగా అరిచాడు. అతని ప్రవర్తనతో జైలు సిబ్బంది, పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అఘోరీ తన భార్యతో ఒకే బ్యారక్‌లో ఉండాలని డిమాండ్ చేయడం వివాదానికి కారణమైంది.రిమాండ్ ప్రక్రియలో భాగంగా అఘోరీని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించగా, వైద్యులు అతన్ని ట్రాన్స్‌జెండర్‌గా గుర్తించారు. ఈ గుర్తింపు కారణంగా కంది సబ్ జైలు అధికారులు అతన్ని జైలులోకి అనుమతించడానికి నిరాకరించారు. అఘోరీని మహిళా ఖైదీల బ్యారక్‌లో ఉంచాలా, పురుష ఖైదీల బ్యారక్‌లో ఉంచాలా అనే సందిగ్ధంతో జైలు అధికారులు పోలీసులకు తిరిగి అప్పగించారు. మరోసారి లింగ నిర్ధారణ పరీక్షల తర్వాత, కోర్టు సూచనల మేరకు అఘోరీని చంచల్‌గూడ జైలుకు తరలించారు.అఘోరీతోపాటు అరెస్టయిన శ్రీవర్షిణీ, తన తల్లిదండ్రులతో వెళ్లేందుకు నిరాకరించింది. దీంతో ఆమెను హైదర్‌షాకోట్‌లోని కస్తూర్బా గాంధీ హోంకు తరలించారు. వర్షిణీని తనతో జైలులో ఉంచాలని అఘోరీ చేసిన డిమాండ్ పోలీసులకు సవాలుగా మారింది. వర్షిణీ కుటుంబం, ఆమెను అఘోరీ మాయమాటలతో బలవంతంగా పెళ్లి చేసుకున్నాడని ఆరోపిస్తోంది, ఇది ఈ కేసుకు మరో కోణాన్ని జోడించింది.అఘోరీ రచ్చ మధ్యలో, పోలీసులు సహనంతో వ్యవహరించారు. అఘోరీ తన భార్యతో కలిసి విచారణలో సహకరిస్తానని చెప్పడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, అతని ట్రాన్స్‌జెండర్ గుర్తింపు, జైలు బ్యారక్ సమస్య, వర్షిణీతో సంబంధం వంటి అంశాలు ఈ కేసును సంక్లిష్టంగా మార్చాయి.

# గూగుల్ లో ట్రెండింగ్ టాపిక్ గా పహల్గామ్

**హైదరాబాద్, ఏప్రిల్ 25:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిపై భారతదేశంలో మాత్రమే కాదు, పాకిస్తాన్‌లో కూడా వాతావరణం వేడెక్కింది. మంగళవారం అంటే ఏప్రిల్ 22న జరిగిన ఈ దాడిపై ఒకవైపు భారతదేశంలో కోపం, ఆవేదన వ్యక్తం చేస్తుంది. మరోవైపు పాకిస్తాన్ ఇంటర్నెట్ వినియోగదారులు కూడా ఈ ఘటన గురించి ఆరా తీస్తున్నారు జరుగుతున్న చర్చల్లో పాల్గొంటున్నారు. భారత్ చేపట్ట చర్యల గురించి తెలుసుకుంటున్నారు. ఈ దాడి తరువాత పాకిస్తాన్‌లోని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ %శ% (గతంలో ట్విట్టర్) గూగుల్‌లో దీనికి రిలేటెడ్‌గా ఉండే కీవర్డ్స్ వేగంగా ట్రెండ్ అవుతున్నాయి. నివేదికల ప్రకారం, పాకిస్తాన్‌లోని ప్రజలు పెద్ద సంఖ్యలో 'పహల్గాం, పహల్గాం ఎటాక్, కాశ్మీర్, పుల్వామా, జమ్ము ' వంటి పదాల గురించి వెతుకుతున్నారు.ఈ ఉగ్రవాద ఘటన తరువాత భారతీయ సోషల్ మీడియాలో చ%ఝుఖ్ఘుశ్రీస్ఘుఎవతీతీశీతీఱరాూ్ఖుఎ, చవీశీఎఱ% వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతుండగా, పాకిస్తాన్‌లో కూడా ఈ దాడిపై ప్రజల ఆసక్తి కనిపిస్తోంది. సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారులు ఈ దాడిపై వేర్వేరుగా స్పందిస్తున్నారు. ఈ దాడిపై పొరుగు దేశం పాకిస్తాన్ నుంచి ఒక అధికారిక ప్రకటన కూడా వచ్చింది. పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఈ ప్రకటన విడుదల చేశారు. ఈ దాడిలో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం లేదని




ఖండించారు. అయితే, సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారుల ప్రతిస్పందన ద్వారా ఈ ఘటన అక్కడ కూడా కలకలం రేపిందని స్పష్టమవుతోందిఅదే సమయంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. ఉగ్రవాదాన్ని భారతదేశం సహించదని ఆయన అన్నారు. అంతేకాదు దానికి తగిన ప్రతిస్పందన ఇస్తుందని అన్నారు. అలాగే ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఢిల్లీలోని ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, 'ఈ దాడి అమానుషమైనది మాత్రమే కాదు, సిగ్గుచేటు ప్రయత్నం. దీనికి స్పందన కచ్చితంగా బలంగా ఉంటుంది. చేసిన వాళ్లనే కాకుండా దీని వెనుక ఉన్న వారిని కూడా బయటకు లాగుతాం' అని అన్నారు.గూగుల్‌లో ట్రెండ్ అవుతున్న కీవర్డ్‌లు భారతదేశం మాత్రమే కాదు, పాకిస్తాన్ ప్రజలు కూడా పహల్గాం దాడికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. సెర్చ్ ట్రెండ్స్ ద్వారా పాకిస్తాన్ పౌరులు భారత్-పాక్ సంబంధాలపై దీని ప్రభావాన్ని గురించి ఆందోళన చెందుతున్నారని వెల్లడైంది.

## ఓల్డ్ సిటీలో వీసా గడువుదీరిన పాకిస్తానీలు, టూరిస్ట్ గా వచ్చిన వ్యక్తులను తరిమివేయాలి

**హైదరాబాద్, పాతబస్తీలో అక్రమంగా నివాసముంటున్న స్లీపర్ సెల్స్ ను ఏరిపారేయాలి**

**వరంగల్ ఉత్సవాల తర్వాత సేనాధిపతి తిరుగుబాటు తప్పదు**

**మిషన్ కోసం ప్రారంభిస్తున్నామని చెప్పి.. కమీషన్ల పార్టీగా మిగిలిపోయిన బీఆర్ఎస్ పార్టీ**

**నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల కోసమని చెప్పి కేవలం నలుగురికే పరిమితమైన బీఆర్ఎస్ పార్టీ**

**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్**

**హైదరాబాద్ ఏప్రిల్ 25**పహల్గామ్ ఉగ్రోన్మాద సంఘటన దేశాన్ని కుదిపివేసిందని,పర్యాటకులపై పాశవిక పైశాచిక దాడితో.. మరీ మరీ ఎంచుకుని కాల్పులు జరిపినట్లుగా ఆ దాడి స్పష్టంగా కనపడిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. బిజెపి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యావత్ భారతదేశం అంతా ఈ సంఘటనను ఖండిస్తోందని, వివిధ రకాల నిరసనలు తెలియజేస్తూ, భారత్ మరింత కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారు. హైదరాబాద్ , పాత నగరంలో ఇప్పటికే వీసా గడువులు తీరి ఇంకా నివాసం ఉంటున్న అక్రమ వలసదారులు, బంగ్లాదేశీయులు, పాకిస్తానీలు, టూరిస్ట్ గా వచ్చినటువంటి వ్యక్తులు, వీసా గడువుదీరిన పౌరులు కూడా ఉంటున్నారని సమాచారం పత్రికల్లో వచ్చింది.ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం ప్రాథమికంగా కొన్ని కఠిన నిర్ణయాలు ప్రకటించినందున ఓల్డ్ సిటీలో ఈ రకంగా ఉంటున్నటువంటి వ్యక్తులను పోలీసు యంత్రాంగం తరిమివేయాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. అందుకోసం పోలీసులకు స్వేచ్ఛ ఇవ్వవల్సిన అవసరం ఉందని బిజెపి డిమాండ్ చేస్తోందన్నారు. ఎంఐఎం బీఆర్ఎస్ పార్టీతో కొంతకాలం దోస్తానా చేసింది. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ తో కలిసి నడుస్తోంది. దీంతో నిస్సహాయ స్థితిలో పోలీసులు ఉన్నట్లుగా చాలా సందర్భాల్లో కనపడుతోంది.హైదరాబాద్ లో స్లీపర్ సెల్స్ ఉన్నారని అనేక సందర్భాల్లో ఎన్ఐఏ, ఐబీ హెచ్చరికలు జారీచేశాయి. వారికి రకరకాలుగా మద్దతిస్తూ, వారి గొంతుకగా నిలబడుతున్నటువంటి లోక్ సభ సభ్యుడి వ్యవహారాలు కూడా బయటకు వచ్చాయి.తక్షణమే ముందు జాగ్రత్త చర్యగా హైదరాబాద్, పాతబస్తీలో అక్రమంగా నివాసముంటున్న స్లీపర్ సెల్స్ ను ఏరిపారేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. వారి రాజకీయ మైత్రి, అవకాశవాద మైత్రి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టేలా ఉండొద్దని తెలియజేస్తున్నాను.మరోవైపు బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల ఉత్సవాలు జరుపుకోవాలని తహతహలాడుతోంది.సమావేశాలు, సమీక్షలు, స్థల సందర్శనలు చేస్తూ.. ఏదో సాధించామన్నామట్లుగా ఆ ఉత్సవాలు జరుపుకోవాలని ఆలోచిస్తున్నారు.అసలు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏం సాధించిందని ఉత్సవాలు జరుపుకోవాలనుకుంటున్నారు..?రాజ్యం కొరకు ప్రారంభించిన పార్టీలో యువరాజు, యువరాజు కొడుకే ఉన్నట్లుగా గత పదేళ్ల పాలనలో అందరికీ అర్థమైంది. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చి ఫెయిల్యూర్ అని చూపించుకున్నారు.బీఆర్ఎస్ జాతీయ పార్టీ అని ప్రకటించుకుని, ఆఖరుకు ఫెయిల్యూర్ అని ప్రూవ్ చేసుకున్నారు.రూలింగ్ లో ఉండి, ఆ తర్వాత ఇప్పుడు అపోజిషన్ లో ఉండి.. ప్రతిపక్ష నాయకుడు శాసనసభకు హాజరుకాకుండా ఫెయిలయ్యారు.నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల కోసమని చెప్పుకుని కేవలం పార్టీ నలుగురికే పరిమితమై ఫెయిలయ్యారు.కోటి కుటుంబాల తెలంగాణ అని ప్రారంభించిన ఉద్యమంలో ఒకే కుటుంబం కొరకు ఉన్నామని వ్యవహరించి ఫెయిలైంది ఈ బీఆర్ఎస్ పార్టీ.అసలు బీఆర్ఎస్ పార్టీ ఎవరి కోసం ఉత్సవాలు జరుపుకోవాలనుకుంటోంది? యువరాజుకు పట్టం కట్టాలనా..? లేక యువరాణికి పట్టం కట్టాలనా..?ప్రతి కుంభకోణంలో బీఆర్ఎస్ పాత్రే ఉన్నది. విచారణ ఎదుర్కొంటోంది.. ఆరోపణలు ఎదుర్కొంటోంది బీఆర్ఎస్ పార్టీయే. అన్ని కోణాల్లో అన్ని రంగాల్లో విఫలమైన బీఆర్ఎస్ పార్టీ... ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కూడా



ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణను అన్ని రంగాల్లో పునర్నిర్మిస్తామని పదేపదే మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులు.. కేవలం కుటుంబ నిర్మాణమే జరుపుకున్నారు.నీళ్లు, నిధులు, నియామకాల్లో కోటాలో ఫెయిల్.. వాటాలో ఫెయిల్.. భర్తీలో ఫెయిల్ గా మిగిలారు. అందరికోసమని చెప్పుకున్నవాళ్లు.. పార్టీని కొందరికే పరిమితం చేశారు. యువరాణి, యువరాజు అయితే.. అనేక కుంభకోణాల్లో కూరుకుపోయారు.ఖచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ జరుపుకోవాలనుకుంటున్న ఉత్సవాల తర్వాత సేనాధిపతి తిరుగుబాటు తప్పదు.మిషన్ కోసం ప్రారంభిస్తున్నామని చెప్పి.. కమీషన్ల పార్టీగా బీఆర్ఎస్ మిగిలిపోయింది. జాతీయ పార్టీ అని చెప్పుకున్న బీఆర్ఎస్ పార్టీ.. ప్రాంతీయ పార్టీగా ఫెయిలైంది. జాతీయ పార్టీగానూ ఫెయిలైంది.అన్ని నిర్ణయాలు, ఆలోచనల్లో ఘోరంగా ఫెయిలైన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఉత్సవాలు జరుపుకునే అవకాశం, అర్హత లేదు.టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చారు. ఇక బీఆర్ఎస్ కు కేసీఆరే వీఆర్ఎస్ ఇస్తే మంచిది.

## కఠిన చర్యలు తీసుకోవాలి



**హైదరాబాద్:**దేశంలో అలజడులు సృష్టించేందుకు పన్నిన కుట్ర ఇది...ఈ సంఘటనను భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు సంఘటితమయ్యాయి.కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ ప్రభుత్వం తీసుకునే చర్యలను సమర్థిస్తూ తీర్మానం చేసింది. హిందూ ముస్లింల మత సామరస్యాన్ని దెబ్బతియ్యడంతో పాటు కాశ్మీర్ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు జరిపిన ఈ దాడిని దేశ ప్రజలు ముక్త కంఠంతో ఖండిస్తున్నారని అయన అన్నారు.

## హైదరాబాద్ లో 208 మంది పాకిస్తానీయులు

**హైదరాబాద్, ఏప్రిల్ 25:**పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ పాక్ జాతీయులను దేశం విడిచి పెట్టి వెళ్లాలని ఆదేశించిన విషయం తెలిసిందే. రెండు రోజుల్లో వీసాలపై వచ్చిన వారంతా వెనుదిరిగి వెళ్లాలని సూచించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్ పోలీసులు కూడా తనిఖీలు ప్రారంభించారు. అధికారిక రికార్డుల ప్రకారం నగరంలో 208 మంది పాక్ జాతీయులు వివిధ వీసాల పేరుతో ఉన్నారు.మొత్తం 208మందిలో 156మంది దీర్ఘకాలిక వీసాలపై , 13మంది షార్ట్ వీసాలు అంటే టూరిస్ట్ వీసాల మీద, మిగిలిన 39మంది మెడికల్ వీసాలపై హైదరాబాద్‌లో ఉన్నారు. హైదరాబాదులో ఉన్న అత్యాధునిక వైద్య సదుపాయాల దృష్ట్యా పాకిస్థాన్ తోపాటు ఆఫ్రికన్ దేశాల నుంచి ఇక్కడకు వైద్య సాయం కోసం వస్తుంటారు. మిగిలిన వారందరికీ.. ఈనెల27తో గడువు ముగిసిపోతుంది. మెడికల్ వీసాల మీద ఉన్న వారికి మాత్రం మరో రెండు రోజులు గడువు ఇచ్చారు.మొదట్లో %వాూూా=జ% వీసాల మీద వచ్చిన వారిని మాత్రమే వెనక్కు పంపాలని ఉత్తర్వులు వచ్చాయి. ఆ తర్వాత అన్ని వీసాలపై ఉన్న వారిని పంపేయాలని ఉత్తర్వులను సవరించారు. మొదట్లో సార్క్ వీసాల మీద ఉన్న వారికి సంబంధించిన ఉత్తర్వులు మాత్రమే వచ్చాయి. ఆ వీసాలపై హైదరాబాద్‌లో ఎవ్వరూ లేరు. ఉత్తర్వులు సవరించిన తర్వాత తనిఖీలు చేశాం. ఇమిగ్రేషన్ లెక్కల ప్రకారం 208 మంది ఉన్నట్లు గుర్తించాం. వారిని తిరిగి పంపించడంలో ఇమిగ్రేషన్ అధికారులతో కలసి పనిచేస్తాం అని స్పెషల్ బ్రాంచ్ లో పనిచేస్తున్న ఓ పోలీసు అధికారి తెలిపినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కోట్ చేసింది.

## వడ్ల కొనుగోలులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- మాజీ మంత్రి హరీష్ రావు మండిపాటు**



**సిద్దిపేట:**సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి హరీష్ రావు సందర్శించారు. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట వంటి జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. క్వింటాకి 2,320 రూపాయలు మద్దతు ధర రావాల్సి ఉండగా దళారులకు 2 వేలు, 2,100 రూపాయలకే అమ్ముకుంటున్నారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల భయంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని దళారులకి అమ్ముకునే దుస్థితి నెలకొందని అన్నారు.గతేడాది వానాకాలంలో మొత్తం 1 లక్షా 53 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పికేవలం 52 వేల మెట్రిక్ టన్నులే సేకరించగలిగింది. మిగతా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బయటకి వదిలేసింది. అంటే మూడొంతుల్లో ఒక వంతు మాత్రమే కొనుగోలు చేయగలిగింది. రెండొంతుల ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారు యాసంగి పంటకు కూడా ప్రభుత్వంలో అదే నిర్లక్ష్యం కనబడుతోంది. ఇది రైతు కంటక ప్రభుత్వం. రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి చేయలేదు. రైతు బంధు ని వానకాలంలో ఎగగొట్టి యాసంగిలో రెండు మూడు ఎకరాలకే ఇచ్చింద్రు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, గాలి దుమారం వల్ల మూడు నాలుగు లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. అందుకు ఎకరాకి 20 వేల రూపాయలను ఇన్పుట్ సబ్సిడీగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. తక్షణమే జిల్లా కలెక్టర్ల ద్వారా నివేదిక తెప్పించుకొని రైతులను ఆదుకోవాలి. నంగునూరు మండలం పాలమాకుల వడ్ల కొనుగులు కేంద్రంలో వడ్లు కొని వారం అయినా ఇంకా రైతులకి డబ్బులు ఇవ్వలేదని అన్నారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు ఏమో 48 గంటల్లో రైతులకు డబ్బులను అకౌంట్లో వేస్తున్నామని హైదరాబాద్ లో చెప్తారు. గన్నీ బ్యాగులు నాణ్యంగా లేకపోవడం వల్ల హమాలీలకు ఇబ్బందిగా ఉంది. తూకంలో క్వింటాకి రెండు కిలోలు తరుగు తీస్తున్నారు. అటు అకాల వర్షాలు, ఇటు రైతు బంధు, మద్దతు ధర రాక ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని వెంటనే ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## భూ భారతి చట్టం ఆధారంగానే భూముల నిర్వహణ

**వరంగల్, ఏప్రిల్ 25:**తెలంగాణలో భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ఈ సేవలు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చాయి. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. మరోవైపు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ అధికారులు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. మండలాల వారీగా వీటిని చేపడుతూ... కొత్త చట్టం ప్రయోజనాలను వివరిస్తున్నారుభూముల నిర్వహణతో పాటు రిజిస్ట్రేషన్ల వంటి అంశాలన్నీ కూడా భూ భారతి పోర్టల్ ఆధారంగానే జరగనున్నాయి. గతంలో ఉన్న ఆర్వోఆర్-2020ను రద్దు కావటంతో... భూ భారతి చట్టం ఆధారంగానే భూముల నిర్వహణ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వంటి ప్రక్రియలో ప్రభుత్వం పలు మార్పులను కూడా తీసుకువచ్చింది.రైతులకు ఇబ్బందులు లేకుండా కొత్త చట్టంలో కీలక సెక్షన్లను పొందుపర్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. పట్టా భూముల యజమానుల హక్కుల సంరక్షణతోపాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు కూడా కొత్త చట్టంలో భద్రతాపరమైన సెక్షన్లను ఏర్పాటు చేశారు. పోర్టల్ లో చూస్తే లావాదేవీల నిర్వహణతో పాటు సమాచార సేవలను వేర్వురుగా పొందుపరిచారు. అయితే ఇందులో నిషేధిత భూముల జాబితాను కూడా పొందుపరిచారు.

నిషేధిత భూముల వివరాలను ఇలా చెక్ చేసుకోండి:

నిషేధిత భూమి వివరాలు తెలుసుకునేందుకు ముందుగా భూ భారతి అధికారిక పోర్టల్ లోకి వెళ్లాలి. హెూం పేజీలో



కనిపించే సమాచార సేవల్లోకి వెళ్లాలి. ఇక్కడ నిషేధిత భూములు అనే ఆప్షన్ ఉంటుంది. నిషేధిత భూముల ఆప్షన్ పై క్లిక్ మరో పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడ జిల్లా, మండలం, గ్రామ వివరాలను నమోదు చేయాలి. అక్కడ సూచించే కోడ్ ను ఎంట్రీ చేయాలి. సబ్మిట్ చేస్తే గ్రామం వారీగా నిషేధిత భూముల వివరాలు డిస్ ప్లే అవుతాయి. నిషేధిత భూములపై లావాదేవీలు నిర్వహించడానికి వీలు ఉండదు.గతంలో ధరణి పోర్టల్ ఉండగానే..ఈ భూముల వివరాలను ప్రత్యేక కాలమ్ లో ఉంచారు. అయితే కొన్ని పట్టా భూములు కూడా ఈ జాబితాలో చేరాయనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. వీటిని పరిశీలించి.. తొలగించే అధికారం కలెక్టర్లకు ఉండేది. అయితే ఈ విషయంలో చాలా ఇబ్బందులు ఉన్నాయనే విమర్శలు వచ్చాయి. అయితే ప్రస్తుతం భూమి స్వరూపానికి సంబంధించి పూర్తి వివరాలను సమర్పిస్తే... కలెక్టర్ పరిశీలించి... నిషేధిత జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతోంది.ఇక రాష్ట్రంలో భూ హక్కుల ఏ విధంగా సంక్రమించినప్పటికీ మ్యుటేషన్ చేసి రికార్డుల్లో నమోదు చేస్తారు. కొత్తగా ఇచ్చే పాసుపుస్తకాల్లో సర్వే మ్యాప్ ఉంటుంది. భూ సమస్యల పరిష్కానిరి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుంది. భూ హక్కుల రికార్డుల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చు. ధరణి వ్యవస్థలో అప్పీల్ వ్యవస్థకు చోటు కల్పించలేదు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అక్రమంగా ప్రభుత్వ భూములపై పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం ఉంటుంది.

## సాగర్‌ను సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్



**నాగార్జునసాగర్, ఏప్రిల్ :** ప్రపంచ పర్యాటక కేంద్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌ను గురువారం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్ అతుల్ జైన్ సతీసమేతంగా సందర్శించారు. ఉదయం విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు నీటిపారుదల శాఖ అధికారులు స్వాగతం పలికారు. అనతంరం హిల్‌కాలనీలోని బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించారు. అక్కడ బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు బుద్ధవనం విశేషాలను వివరించారు. పర్యాటకశాఖ లాంచీలో జలాశయంలోని నాగార్జునకొండకు చేరుకుని మ్యూజియం, సింహాళీయం, బౌద్ధమత స్తూపాలను, నమూనాలను తిలకించారు. ఆ తర్వాత సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని తిలకించారు. వారి వెంట సాగర్ ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ మల్లిఖార్జున్‌రావు ఉన్నారు.

## వక్ఫ్ చట్టాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టులో కేంద్రం కౌంటర్ అఫిడవిట్

వక్ఫ్ సవరణ చట్టం ను సమర్థిస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. వక్ఫ్ (సవరణ) చట్టం-2025 చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లకు సమాధానంగా కేంద్రం కౌంటర్ అఫిడవిట్ వేసింది. ఈ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరింది. ఈ చట్టంలో చేసిన పలు సవరణలు మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కులను హరిస్తాయనే తప్పుడు ప్రాతిపదికపై పిటిషన్లు ఉన్నాయని ఆరోపించింది. ఆర్టికల్ 32 ప్రకారం ఒక చట్టాన్ని సుప్రీంకోర్టు సమీక్షించవచ్చని తెలిపింది. కాకపోతే పార్లమెంటరీ ప్యానెల్ ద్వారా సమగ్రమైన, లోతైన, విశ్లేషణాత్మక అధ్యయనం అనంతరమే వక్ఫ్ చట్టానికి సవరణలు చేశామని తెలిపింది. గతంలో ఉన్న నిబంధనలతో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం జరిగిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. ఈ మేరకు 1332 పేజీలతో దాఖలు చేసిన ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో ఈ చట్ట సవరణలను సమర్థించుకుంది. 2013 తర్వాత ఆశ్చర్యకరంగా వక్ఫ్ భూమి



భారీగా పెరిగిందని పేర్కొంటూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ షేర్షా సీ షేక్ మొహిద్దీన్ అఫిడవిట్ దాఖలు చేశారు. వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ 72 పిటిషన్లు దాఖలు కాగా.. వాటిపై ఏప్రిల్ 17న సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే ముందు దీనిపై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం గడువు కోరగా న్యాయస్థానం అందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో తాజాగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటీఫై చేయబోమని కేంద్రం కోర్టుకు తెలిపింది. అయితే అప్పటివరకు వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మే 5కు వాయిదా వేసింది.

వార్తాతరంగాలు
శనివారం 26 ఏప్రిల్ 2025

# కశ్మీర్ కొండల్లో ఉగ్రవాదులు



**శ్రీనగర్, ఏప్రిల్ 25:**జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలోని బైసరన్ వ్యాలీలో జరిగిన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. లష్కర్%–%ఎ%–%తొయిబాతో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) బాధ్యత వహించిన ఈ దాడిలో 26 మంది, అందులో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు మరణించారు. ఉగ్రవాదులు కార్బైన్‌లు, అక్ 47 రైఫిళ్లతో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటన తర్వాత, కేంద్ర ప్రభుత్వం భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛను మంజూరు చేసింది, ఉగ్రవాదులను అంతమొందించేందుకు తీవ్ర శోధన కార్యకలాపాలను ప్రారంభించింది.పహల్గాం దాడి తర్వాత, భారత సైన్యం, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్తంగా పూంఛ్, బారాముల్లా, పహల్గాం అడవుల్లో ఉగ్రవాదుల కోసం భారీ శోధనను ప్రారంభించాయి. హెలికాప్టర్‌లు, డ్రోన్‌లతో ప్రతి అంగుళాన్ని జల్లెడ పడుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో అత్యాధునిక సాంకేతికత ఉపయోగించబడుతోంది, ఇందులో డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన నెట్రా డ్రోన్‌లు 240 డిగ్రీల కవరేజ్‌తో రియల్%–%టైమ్ డేటాను అందిస్తాయి. ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసుకున్న EL/W–%2090 రాడార్ సిస్టమ్స్ 450 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను గుర్తిస్తాయి. ఇస్రో ఉపగ్రహాల నుంచి పొందిన రియల్%–%టైమ్ ఇమేజరీ ఉగ్రవాదుల స్థానాలను ఖచ్చితంగా గుర్తించడంలో సహాయపడుతోంది.

# కూంబింగ్ ఆపండి

## మావోయిస్టుల లేఖ



**బీజాపూర్:**తెలంగాణ చత్తీస్–ఘడ్ సరిహద్దు అటవీప్రాంతంలో జరుగుతున్న భద్రత బలగాల కూంబింగ్ ను ఆపాలని మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది. శాంతి చర్చలకోసం ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని మావోయిస్టు పార్టీ లేఖ ద్వారా కోరింది. ప్రస్తుతం జరుగుతున్న భద్రత బలగాల దాడులను ఆపాలని విజ్ఞప్తి చేసింది. నార్త్,వెస్ట్ బస్తర్ బ్యూరో రూపేష్ పేరుతో ప్రెస్ నోట్ ద్వారా మావోయిస్టు పార్టీ అప్పీల్ చేసింది. .

# అంగట్లో సరుకుల్లా బర్త్ సర్టిఫికేట్లు.. రూ.15 వేలు

**హైదరాబాద్, ఏప్రిల్ 25:**దేశంలో ఉగ్రదాడి అలజడి రేపిన సమయంలో తెలంగాణలోని కొందరు ఉద్యోగుల తీరు ఆందోళన కలిగిస్తోంది. కొందరు ఉద్యోగులు డబ్బు కోసం ఎంతకైనా తెగించి అంగట్లో సరుకుల్లా ఎవరికైనా బర్త్ సర్టిఫికేట్లు జారీ చేసే స్థాయికి దిగజారడం దేశ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగంలోని కొందరు వ్యక్తులు స్వార్థపూరితంగా వ్యవహరించడం వల్ల దేశ భద్రత ప్రమాదంలో పడుతోంది. వ్యవస్థలోని అవినీతిని, బాధ్యతారాహిత్యాన్ని కూడా తెలియజేస్తున్నాయి.దేశంలో అక్రమంగా ప్రవేశించిన ఇద్దరు బంగ్లాదేశీయులకు నకిలీ బర్త్ సర్టిఫికేట్లు, ఆధార్ కార్డులు జారీ చేసి వారు పాస్‌పోర్ట్ పొందేలా చేసిన ఘటనలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నార్సింగి మున్సిపాలిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి జి.సుధీర్ కుమార్ , మహ్మద్ ముఖీబ్, టి.సాయి కిరణ్, జి.రంజనీకాంత్ , బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ హసిబుల్, రోహన్ షాలను అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన నిందితుడు హసిబుల్ ఢాకా నుంచి నాలుగేళ్ల క్రితం రూ.25 వేలు చెల్లించి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించాడు. కోల్‌కతాలో జోవన్ చౌదరి అనే నకిలీ పేరుతో ఆధార్ కార్డు పొందాడు. అక్కడ కరాటే కోచ్‌గా పనిచేస్తూ.. 2023లో మలక్‌పేట్‌కు చెందిన జయాచౌదరితో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. తాను కోల్‌కతా పౌరుడినంటూ నమ్మించి ఆమెను వివాహం చేసుకున్నాడు.మలక్‌పేట్‌లో నివాసం ఉంటున్న హసిబుల్.. నార్సింగి మున్సిపాలిటీ ఉద్యోగి సుధీర్‌కు రూ.15,000 లంచం ఇచ్చి నకిలీ జనన ధ్రువీకరణ పత్రం సేకరించాడు. తరువాత ఓటరు కార్డు కూడా పొందాడు. ఇదే మార్గంలో బంగ్లాదేశ్‌కే చెందిన రోహన్ షాకూ నకిలీ బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు ఇప్పించాడు. వీరిద్దరూ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేయగా.. అనుమానాస్పదంగా ఉండటంతో టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. మఫ్టీలో నార్సింగి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన పోలీసులు ఫేక్ బర్త్ సర్టిఫికేట్ కావాలని అడగగానే సుధీర్ అంగీకరించడంతో బండారం బయటపడింది. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి మలక్‌పేట్ పోలీసులకు అప్పగించారు.

# మే రాకుండానే మండుతున్న సూరీడు



**అదిలాబాద్, ఏప్రిల్ 25:**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత వారం రోజులుగా ఎండ తీవ్రత పెరిగిపోయింది. నిప్పుల కొలిమిలా మారిపోయింది. బుధవారం గరిష్టంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జిల్లాలో ఉదయం నుంచే భానుడు%ొ%. భగభగలా మండిపోతున్నాడు.దీంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మూడు రోజులుగా అన్ని మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో అధికారులు ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ చేశారు.ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పెళ్లిళ్లు, శుభకార్యాలకు వెళ్లేందుకు కూడా జనాలు జంకుతున్నారు. దాహం తీర్చుకునేందుకు చల్లని శీతల పానీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొంత మంది వడదెబ్బకు గురై ఆసుపత్రుల పాలవుతున్న సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ లోని పలు ప్రాంతాలో ఐదు మంది వడ దెబ్బతో మృతి చెందినట్లు తెలిసింది.ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను విపరీతంగా వాడుతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తల ను పాటిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఇంట్లోంచి బయటకు రావడం లేదు.ఏప్రిల్ నెలలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఉంది. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. రానున్న మే మాసంలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళనలో జనాలు ఉన్నారు. రోహిణి కార్తె నాటికి పరిస్థితి మరింత మారిపోయే అవకాశం ఉంది.

**ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి**

వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. తలనొప్పి, వికారం, కళ్లు తిరగడం, వాంతులు చేసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదిచాలని హెచ్చరిస్తున్నారు. ప్రతీరోజూ 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలని, శీతల పానీయాలకు బదులు మజ్జిగ, నిమ్మ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయకూడదని సూచిస్తున్నారు.

# యుద్ధం వస్తే.. ఎవరి బలం ఎంత.. సైన్యం ఎంత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:**భారత్ పాక్ మధ్య ఇప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా.. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడితో అవి తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే పాకిస్తాన్‌పై అనేక ఆంక్షలు విధించిన భారత్.. కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశమై 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో సింధూ జలాల పంపిణీ ఆపడం, పాక్ వాసులకు వీసాల రద్దు, అట్టారీ సరిహద్దు మూసివేత, భారత్‌లోని పాక్ అధికారుల తొలగింపు, ఇస్లామాబాద్‌లోని భారత అధికారులను వెనక్కి రప్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలకు ప్రతీకారంగా భారత్‌పై పాక్ కూడా అలాంటి నిర్ణయాలే తీసుకుంది. సిమ్లా ఒప్పందం రద్దు, భారత్‌తో వాణిజ్య సంబంధాలు తెంచుకోవడం, పాక్ ఎయిర్‌స్పేస్‌ను భారత్ ఉపయోగించుకోకుండా అడ్డుకోవడం, భారతీయులకు సార్క్ వీసాలు రద్దు, ఇస్లామాబాద్‌లోని భారత దౌత్య అధికారుల తగ్గింపు సహా పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది.భారత్‌తో పోల్చుకుంటే పాకిస్తాన్ జనాభా పరంగా, సైనిక పరంగా, ఆయుధాల పరంగా, ఆర్థిక పరంగా, రాజకీయ పరంగా, అంతర్జాతీయ సహకారం పరంగా అన్ని రంగాల్లో వెనకబడే ఉంది. ఇప్పటికే అడుక్కుతినే స్థాయిలో ఉన్న పాకిస్తాన్.. భారత్‌తో యుద్ధం వస్తే ఇంకా పాతాళానికి పడిపోతుందనే విషయం తెలిసినా.. ఆ దేశం కవ్వింపు చర్యలకు దిగుతూనే ఉంది. విదేశీ మారక నిల్వలు పూర్తిగా అడుగంటిపోయి.. రోజు గడవాలంటే విదేశాలు, విదేశీ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల వద్ద చేతులు చాచి అడుక్కుంటోంది. పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పతనావస్థలో ఉంది. మరోవైపు.. అంతర్గతంగా పాక్‌లో అనేక రాజకీయ, వేర్పాటువాద సవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం, సైన్యం మధ్య కూడా సఖ్యత లేదు. ఒకవైపు ప్రత్యేక దేశం కోసం




ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న బలూచిస్తాన్.. ఇటీవలి కాలంలో పాక్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇలాంటి సమయంలో భారత్‌తో యుద్ధం అంటే పాకిస్తాన్ ఇంకా నష్టపోవాల్సిన పరిస్థితే ఉంటుంది.మరోవైపు.. సైనిక పరంగా, ఆయుధాల పరంగా, రక్షణ శాఖ బడ్జెట్ పరంగా చూస్తే.. భారత్‌తో అసలు పాకిస్తాన్ పోటీపడే స్థితిలో కూడా లేదు. భారత్ వద్ద 14 లక్షల మంది సైనికులు ఉండగా.. పాకిస్తాన్ వద్ద కేవలం 6.5 లక్షల మంది సైన్యం మాత్రమే ఉంది. ఇక రిజర్వ్ ఫోర్స్‌లు భారత్ వద్ద 11 లక్షలు ఉండగా.. పాకిస్తాన్‌కు కేవలం 5 లక్షలు మాత్రమే ఉంది. 2024లో భారత రక్షణ బడ్జెట్ 81 బిలియన్ డాలర్లు కాగా.. పాకిస్తాన్ రక్షణ బడ్జెట్ 11 బిలియన్ డాలర్లు మాత్రమే కేటాయించారు. ఫైటర్ జెట్‌లు (సుఖోయ్–30 ఎంకేఐ, రఫేల్) భారత్ వద్ద 600 కంటే ఎక్కువ ఉండగా.. పాకిస్తాన్ వద్ద 350 (జేఎఫ్–17, ఎఫ్–16, మిరాజ్) ఉన్నాయి.యుద్ధ ట్యాంకులు భారత్ వద్ద 4,500కు పైగా ఉండగా.. పాక్ వద్ద కేవలం 2,400 మాత్రమే ఉన్నాయి. నౌకా శక్తిలో భారత్ వద్ద 1 ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, డిస్ట్రాయర్స్, సబ్‌మెరైన్లు ఉన్నాయి. కానీ పాకిస్తాన్ వద్ద నౌకా శక్తి పరిమిత సంఖ్యలోనే ఉంది. ఇక న్యూక్లియర్ ఆయుధాలు భారత్ వద్ద 160 నుంచి 170 ఉన్నట్లు అంచనా ఉండగా.. అదే పాకిస్తాన్ వద్ద 160 నుంచి 165 అణ్వాయుధాలు ఉన్నట్లు అంచనా ఉంది. ఈ ఒక్క అణ్వాయుధాల విషయంలో మాత్రం భారత్‌ను ఢీకొట్టే సత్తా పాకిస్తాన్‌కు కనిపిస్తోంది. మిస్సైల్ శక్తిలో భారత్ వద్ద అగ్ని, బ్రహ్మోస్ వంటి అగ్రశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ మిస్సైళ్లు ఉన్నాయి. అదే పాక్ వద్ద షాహీన్, గౌరీ, బాబుర్ మిస్సైళ్లు ఉన్నాయి.పహల్గామ్ ఉగ్రదాడిని భారత్ చాలా తీవ్రంగా పరిగణిస్తోంది. అంతేకాకుండా ఈ దాడి చేసిన ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తీసుకువచ్చి మట్టిలో కలిపేస్తామని.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హెచ్చరికలు చేశారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇలాగే తీవ్రంగా స్పందించారు. నేరుగా యుద్ధమార్గాన్నే ఎంచుకోకుండా భారత్ పలు దౌత్య, ఆర్థిక పరంగా చర్యలు తీసుకుంటోంది.యుద్ధం విషయంలో భారత్ పెట్టుకున్న రూల్ మాత్రం ఎన్నటికీ మారదు. మొదట ప్రత్యర్థి దాడి చేస్తేనే.. దానికి ప్రతిస్పందించడం తప్ప.. భారత్ ఎన్నడూ మొదట యుద్ధానికి కాలు దువ్వదు. ప్రస్తుతం ఇరు దేశాల సరిహద్దుల వద్ద పర్యవేక్షణ పెరిగినా, సైన్యం, ఆయుధాలను మోహరించినా.. యుద్ధం జరగడం అనేది చివరి పరిష్కారంగా మాత్రమే రెండు దేశాలు భావిస్తున్నాయి. ఎందుకంటే ఒకసారి యుద్ధం గనక ప్రారంభమైతే.. రెండు దేశాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. సైనిక పరంగా పాక్ కంటే అత్యంత బలంగా ఉన్న భారత్.. పాక్ కవ్విస్తే తప్ప యుద్ధభూమిలో అడుగుపెట్టదు. అయితే పాక్ వద్ద అణ్వాయుధాలు భారీగా ఉండటం.. తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకసారి అణ్వాయుధాలు ప్రయోగిస్తే.. దాని వల్ల కలిగే నష్టం ఊహించడం కూడా చాలా కష్టంగా ఉంటుంది.

# ఆపరేషన్ కర్రెగుట్ట...

**ఖమ్మం, ఏప్రిల్ 25**: కర్రెగుట్ట చుట్టూ యుద్ధవాతావరణం నెలకొంది. ఆపరేషన్ కగార్ పేరుతో 20 వేల మంది భద్రతా బలగాలు తెలంగాణ%–%ఛత్తీస్ గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టను చుట్టుముట్టాయి. అదే సమయంలో హెలిక్యాప్టర్ ద్వారా ఆపరేషన్ కూడా నడుస్తోంది. మూడు రోజులుగా ఈ ఆపరేషన్ నడుస్తోంది. కర్రె గుట్టపై దాదాపు వెయ్యి మంది మావోయిస్టులు డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సీఆర్పీఎఫ్ అనుమానిస్తోంది. కర్రెగుట్టపై ది మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత హిడ్మా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటి వరకు దండకారణ్యంలోని అబూజ్ మడ్ ప్రాంతాన్ని దాదాపుగా స్వాధీనం చేసుకున్నాయి కేంద్రబలగాలు. అబూజ్ మడ్ కు ఆనుకొని కర్రెగుట్ట మొదలవుతుంది.కర్రెగుట్టకు సంబంధించి.. బీజాపూర్ జిల్లాలోని ఊసూరు బ్లాక్, ఆవు పల్లి, పూజారి కాంకేడ్ ప్రాంతాలు ఛత్తీస్ గఢ్?లో ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలకు విస్తరించి ఉన్నాయి. కర్రె గుట్టలపై తెలంగాణలో పాముడూరు, తడపల, జెల్ల, డోలి, చెలిమల, బందారు పల్లి, ముకునూరు గ్రామాలుండేవి. ఈ గ్రామాలను గతంలోనే ఖాళీ చేయించి వారికి వేరే ప్రాంతాల్లో పునరావాసం కల్పించారు. అయితే పెనుగోలు గ్రామస్తులు మాత్రం అక్కడే ఉన్నారు.ఆబూజ్ మడ్ పై కేంద్ర బలగాలు ఆపరేషన్ మొదలు పెట్టగానే మావోయిస్టులు సమీపంలోనే ఉన్న కర్రెగుట్టకు మారినట్టు తెలెస్తోంది. ఇక్కడ డెన్ లు ఏర్పాటు చేసుకొని



ఆయుధాలను దాచినట్టు చెబుతున్నారు. ఇక్కడికి పోలీసులు, భద్రతా బలగాలు రాకుండా గుట్ట చుట్టూ ల్యాండ్ మైన్స్ పెట్టినట్టు సమాచారం. పలువురు ఆదివాసీలు వేట కోసం కర్రెగుట్టకు వెళ్లి ఇటీవల మృత్యువాత కూడా పడ్డారు.మావోయిస్టులు కర్రెగుట్టపై డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం అందుకున్న కేంద్ర బలగాలు స్పెషల్ ఆపరేషన్ కు శ్రీకారం చుట్టాయి. మూడు వైపుల నుంచి గుట్టను చుట్టుముట్టాయి. దీంతో పాటు హెలిక్యాప్టర్లు, డ్రోన్ల ద్వారా అణువనువూ తనిఖీ చేస్తున్నాయి. అబూజ్ మడ్ పరిధిలోని ఆదివాసీ గూడేలకు రోడ్లు వేసుకుంటూ ఆపరేషన్ మొదలు పెట్టిన సీఆర్పీఎఫ్ బలగాలు ప్రస్తుతం కర్రెగుట్ట వద్దకు చేరుకున్నాయి. అయితే ఈ ఆపరేషన్ రాష్ట్ర పోలీసులకు సంబంధం లేకుండా జరుగుతోంది. అదే విధంగా ఫారెస్టు అధికారులు సైతం కర్రెగుట్ట వైపు రావద్దంటూ సీఆర్పీఎఫ్ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు స్థానిక పోలీసులు ఎంటర్ అయ్యే అవకాశం లేదు.మావోయిస్టులు కర్రెగుట్టను సేఫ్టీ ప్లేస్?గా భావిస్తున్నారు. ఇదొక గుట్టల సముదాయం.. ఒక గుట్ట దిగగానే కొంత మైదాన ప్రాంతం ఉంటుంది.. ఆ వెంటనే గుట్ట స్టార్ట్ అవుతుంది. గుట్టల కింద సహజ సిద్ధంగా ఉండే బంకర్లు, సొరంగ మార్గాలున్నాయి. ఒక్కో బంకర్ చాలా విశాలంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సెలయేళ్లు కూడా ప్రవహిస్తూ ఉంటాయి. మూడు కాలాలూ నీటి వసతి ఉంటుందని అంటున్నారు. అయితే అబూజ్ మడ్?ను సీఆర్పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్న దరిమిలా.. మావోయిస్టులు కర్రెగుట్టలను సేఫ్టీ ప్లేస్ గా భావించే భారీ మొత్తంలో ఆయుధాలను తీసుకొని ఇక్కడికి వచ్చి ఉంటారని తెలుస్తోంది. ఇక్కడే డెన్ ఏర్పాటు చేసి ఉంటారనే అనుమానాలున్నాయి.ఆపరేషన్ కగార్?లో భాగంగా కర్రెగుట్టపై బేస్ క్యాంప్ ఏర్పాటు చేసుకొనేందుకు సీఆర్పీఎఫ్, భద్రతా బలగాలు రెడీ అవుతున్నాయి. ఇక్కడ ఆయుధాలను భద్రపర్చిన మావోయిస్టులు తిరిగి వస్తే వారిని పట్టుకోవడమే ఈ బేస్ క్యాంప్ లక్ష్యమని అంటున్నారు. ఈ ఆపరేషన్ మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలుస్తోంది. ఏది ఏమైనా మావోయిస్టుల ఏరివేతలో ఇది అతి పెద్ద ఆపరేషన్ గా చెబుతున్నారు.

# హైడ్రా కొత్త లోగో రెడీ

**హైదరాబాద్, ఏప్రిల్ 25:**హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ, ప్రకృతి విపత్తుల నిర్వహణకు ఏర్పాటు చేసిన హైడ్రా ఇకపై కొత్త లోగోతో కార్యకలాపాలను కొనసాగించనుంది. ఇప్పటి వరకూ ఈవీడీఎం లోగోతోనే పనిచేసిన హైడ్రా లోగో మార్చింది. హైదరాబాద్ నగరాన్ని సూచించేలా హెచ్ అక్షరంపై నీటి బొట్టు ఉన్న లోగోను రూపొందించారు. చెరవులను కాపాడుకుంటూ, జల సంరక్షణ చేపడుతూ హైదరాబాద్ ను విపత్తుల నుంచి రక్షించుకుందామనే సూచకంగా కొత్త లోగోను తీర్చిదిద్దారు.కొత్త లోగోను హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారికంగా ఆమోదించారు. హైడ్రా కార్యకలాపాలు, సిబ్బంది యూనిఫామ్, వాహనాలపై నూతన లోగోను ముద్రించనున్నారు. హైడ్రా అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కొత్త లోగోను అప్డేట్ చేశారు.

**బతుకమ్మ కుంటలోనే బతుకమ్మ ఉత్సవాలు**

వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి బతుకమ్మ కుంటను సిద్ధం చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. బతుకమ్మ కుంటకు సంబంధించిన కోర్టు వివాదం మంగళవారం పరిష్కారమయ్యిందన్నారు. బుధవారం హైడ్రా కమిషనర్ అంబర్ పేటలోని బతుకమ్మ కుంటను సందర్శించారు. స్థానికుల సమక్షంలో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేద మంత్రిచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు.యుద్ధ ప్రాతిపదికన ఈ చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ చెరువును పునరుద్ధరిస్తే పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా మారుతాయని అన్నారు.




పనులకు సహకరించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమానికి స్థానికులు పెద్దయెత్తున హాజరయ్యారు. అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని స్థానికులు కమిషనర్‌కు హామీ ఇచ్చారు.ఫిర్యాదు స్వీకరించిన 24 గంటల్లోనే మురుగు సమస్యకు హైడ్రా పరిష్కారం చూపింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం మల్లంపేటలోని రామచంద్రయ్య కాలనీకి మురుగు ముప్పును తొలగించింది. చెన్నం చెరువు నుంచి రేళ్లకుంటకు వెళ్లే కాలువకు మధ్యలో ఆటంకాలు సృష్టించడంతో రామచంద్రయ్య కాలనీలో కొంత భాగం మురుగు ముప్పును ఎదుర్కొంది.మీటరుకు పైగా ఇళ్లు మురుగులో మునిగిపోవడంతో అక్కడి నివాసితులు ఇళ్లను ఖాళీ చేయాల్సి వచ్చింది. మురుగు నీటిలో మా ఇళ్లు నీట మునిగాయని.. నెల రోజులుగా ఇళ్లు ఖాళీ చేసి బయట తలదాచుకుంటున్నామని రామచంద్రయ్య కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు.

**మురుగు నీటి సమస్య**

దుండిగల్ మున్సిపాలిటీలోని చెన్నం చెరువుకు నిజాంపేట మున్సిపాలిటీ మురుగు నీరు వచ్చి చేరుతోందని.. ఆ నీరు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని రేళ్లకుంటకు చేరాల్సి ఉండగా ఆటంకాలు ఏర్పడ్డాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. రామచంద్రయ్య కాలనీకి పక్కన లే ఔట్ వేసిన వారు కాలువను మూసేయడంతో ఈ ఇబ్బంది తలెత్తిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు.ఈ ఫిర్యాదును గూగుల్ మ్యాప్స్‌తో పాటు శాటిలైట్ ఇమేజీలలో పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైడ్రా అధికారులు అక్కడకు చేరుకుని మురుగు కాలువను పునరుద్ధరించారు.దీంతో రామచంద్రయ్య కాలనీలో నిలిచిన మురుగు నీరు బయటకు వెళ్లింది. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా 24 గంటలలోపే పరిష్కారం లభించడం పట్ల రామచంద్రయ్య కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

సినిమా



# అనుష్క దర్శనం ఎప్పుడంటే..



మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సూపర్ హిట్ తర్వాత కనిపించకుండా పోయిన అనుష్క శెట్టి అనుకున్న ప్రకారం అన్నీ జరిగి ఉంటే ఈ ఏప్రిల్ లోనే ఘాటీతో పలకరించేది. అయితే పోస్ట్ ప్రొడక్షన్ లో జరుగుతున్న అలస్యం, పెండింగ్ ఉన్న ప్యాచ్ వర్క్ వల్ల ఇంకా కొత్త డేట్ నిర్ణయించుకోలేదు. మరి ఎప్పుడు విడుదలనేది దర్శకుడు క్రిష్, నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ ఎక్కడా చెప్పడం లేదు. ఇదిలా ఉండగా ఈ సంవత్సరం అనుష్క మొత్తం రెండు సినిమాల్లో దర్శనమివ్వనుంది. ఘాటీ తర్వాత మలయాళంలో చేసిన విజువల్ గ్రాండియర్ కథనర్ పార్ట్ 1 ఇదే ఏడాది ప్యాన్ ఇండియా భాషల్లో థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఇక్కడితో అయిపోలేదు. కథనర్ రెండు భాగాలుగా తీస్తున్నారు. 2026లో సీక్వెల్ వస్తుంది. తొమ్మిదో శతాబ్దానికి చెందిన కదమత్తాత్తు కథనర్ అనే క్రైస్తవ పూజారి కథ అధారంగా భారీ బడ్జెట్ తో ఇది రూపొందుతోంది. కాళీయన్ కట్టు నీలిగా అనుష్కకు చాలా ప్రాధాన్యం ఉన్న పాత్ర దక్కింది. ఇదిలా ఉండగా భాగమతి 2 చేయాలనే ప్లానింగ్ లో యువి సంస్థ ఉంది. కాకపోతే స్వీటీ డేట్లు ఎంత వరకు అందుబాటులో ఉంటాయనే దాన్ని బట్టి నిర్ణయం తీసుకోబోతోంది. ఇవి కాకుండా తెలుగులో ఒకటి, తమిళంలో మరొక సినిమాకు అనుష్క సానుకూలంగా స్పందించినట్టు వార్తలు ఉన్న నేపథ్యంలో ఇంకా కన్ఫర్మేషన్ రావాల్సి ఉంది. ఇదంతా ఎలా ఉన్నా అనుష్క ఇంత గ్యాప్ తీసుకోవడం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్పీడ్ పెంచాలనేది వాళ్ళ డిమాండ్. అన్నట్టు ప్రభాస్ తో అమె మరోసారి జోడి కట్టొచ్చని, హెూంబాలే సంస్థతో డార్లింగ్ చేసుకున్న మూడు ప్రాజెక్టుల్లో ఒకదానికి స్వీటీనే హీరోయిననే ప్రచారం జరుగుతోంది కానీ అనౌన్స్ మెంట్ వచ్చే దాకా నమ్మే అవకాశం లేని గాసిప్ ఇది. సినిమాల సంగతి పక్కనపెడితే త్వరలో అనుష్క పెళ్లి జరగాలని కోరుకుంటున్న ఫ్యాన్స్ అభిమతం ఎప్పుడు తీరుతుందో అంతు చిక్కడం లేదు. పుకార్ల వలయంలో వార్తలు చక్కర్లు కొట్టడం మినహాయించి నిజంగా మిసెస్ అనుష్క ఎప్పుడవుతుందో వేచి చూడాలి.

## కార్తికేయ 'మెగా' కల నెరవేరబోతోందా ?



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో రూపొందబోయే భారీ ఎంటర్ టైనర్ త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కు వెళ్లనుంది. ఇటీవలే పూజా కార్యక్రమాలతో మెగా 157 లాంచ్ చేసిన సంగతి తెలిసిందే. క్యాస్టింగ్ కు సంబంధించిన పనుల్లో అనిల్ బిజీగా ఉన్నాడు. విలన్ గా ఎవరిని తీసుకోవాలనే దాని మీద తర్జన భర్జనలు జరుగుతున్నాయట. అరెక్స్ 100 హీరో కార్తికేయని మంచి అప్షన్ గా భావిస్తున్నట్టు లేటెస్ట్ లీక్. గతంలో తను అజిత్ వలిమై, నాని గ్యాంగ్ లీడర్ లో ప్రతినాయకుడిగా మెప్పించాడు. కాకపోతే అ రెండూ పెద్ద స్థాయిలో బ్లాక్ బస్టర్లు కాలేదు కానీ కంటెంట్ పరంగా పేరు తీసుకొచ్చాయి.హీరోగా బాగా స్ట్రగుల్ అవుతున్న కార్తికేయకు సక్సెస్ రేట్ తక్కువగా ఉంది. ఇన్నేళ్ల కెరీర్ లో పట్టుమని అయిదు హిట్లు లేకపోవడం కెరీర్ మీద ప్రభావం చూపిస్తోంది. బెదురులంక 2012 ఓ మోస్తరుగా బాగానే అడినప్పటికీ పెద్ద బ్రేక్ అయితే దక్కలేదు. ఈ నేపథ్యంలో తాను విపరీతంగా అభిమానించే చిరంజీవి సినిమాలో భాగం అంటే క్షణమైనా అలోచించకపోవచ్చు. పైగా అనిల్ రావిపూడి విలన్లు భీకరంగా ఉండరు. కాస్త ఫన్ టచ్ కూడా ఉంటుంది. అజిత్ తో నటించడం ద్వారా ఒక కలను నెరవేర్చుకున్న కార్తికేయ ఇప్పుడు జీవిత లక్ష్యమైన మెగా మూవీలో చిరు పక్కన కనిపించడం నెరవేరితే అంతకన్నా ఏం కావాలి. ప్రస్తుతానికి ఇది లీక్ కాబట్టి అధికారిక ముద్ర వచ్చే దాకా ఫ్యాన్స్ వెయిట్ చేయాల్సి ఉంటుంది. విశ్వంభర ప్రమోషన్లు త్వరలోనే మొదలుపెట్టబోతున్న నేపథ్యంలో చిరంజీవి వాటికి అవసరమైన డేట్లు మినహాయించి అనిల్ రావిపూడికి నాన్ స్టాప్ గా రెండు నెలలు కాల్ షీట్స్ ఇస్తారని సమాచారం. హీరోయిన్ తదితర వివరాలకు సంబంధించిన సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. 2026 సంక్రాంతి విడుదలని లాక్ చేసుకోవడంతో దానికి అనుగుణంగానే షెడ్యూల్స్ ఉండబోతున్నాయి. చిరంజీవి రా ఆఫీసర్ గా కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది కానీ అది ఉత్తిదేనని యూనిట్ మాట. చూడాలి మరి కార్తికేయ న్యూస్ నిజమవుతుందో లేదో.

## ఆ సినిమాపై నిషేధం



పాకిస్థానీ నటుడు ఫవాద్ ఖాన్ నటించిన బాలీవుడ్ చిత్రం అబిర్ గులాల్‌పై నిషేధం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలిపింది. 'ఈ నిషేధానికి ప్రధాన కారణం, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి' అని పేర్కొన్నారు. ఫవాద్ ఖాన్ గతంలో ఖూబ్సూరత్ (2014), కపూర్ అండ్ సన్స్ (2016), ఏ దిల్ హై ముష్కిల్ (2016) వంటి బాలీవుడ్ చిత్రాల్లో నటించి భారత ప్రేక్షకుల్లో ప్రజాదరణ పొందారు. 2016లో 'ఏ దిల్ హై ముష్కిల్' చిత్రం విడుదల సమయంలో కూడా ఈ వివాదం రేగింది. సినిమా ఓనర్స్ అండ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా ఈ చిత్రాన్ని మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, గోవాలోని సింగిల్-స్క్రీన్ థియేటర్లలో ప్రదర్శించకూడదని నిర్ణయించింది. అప్పుడు జరిగిన ఉరి దాడి తర్వాత భారత్-పాకిస్థాన్ సంబంధాలు దిగజారడం దానికి కారణం. 2023లో బొంబాయి హైకోర్టు పాకిస్థానీ కళాకారులపై నిషేధాన్ని అధికారికంగా విధించేందుకు దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించింది, సాంస్కృతిక సామరస్యం, శాంతిని ప్రోత్సహించడం ముఖ్యమని తీర్పులో పేర్కొంది.

# ముహూర్తానికి వచ్చి.. హీరోయిన్‌గా ఫిక్స్ చేసి..



టాలీవుడ్లో కొత్త వాళ్లను బాగా ఎంకరేజ్ చేసే వాళ్ళలో నాని ఒకడు. అతను ఎక్కువగా కొత్త, అప్‌కమింగ్ డైరెక్టర్లతోనే సినిమాలు చేస్తుంటాడు. హీరోయిన్లు, మిగతా అర్టిస్టులు, టెక్నీషియన్లను కూడా కొత్త వాళ్లనే పరిచయం చేస్తుంటాడు. అతను హీరోయిన్లను రిపీట్ చేయడం తక్కువ. నాని కొత్త చిత్రం 'హిట్-3'లో కన్నడ అమ్మాయి, కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తోంది. అమెతో నాని జత కట్టడం ఇదే తొలిసారి. శ్రీనిధిని 'హిట్-3'కి ఎంపిక చేసింది దర్శకుడు శైలేష్ కొలను కాదట. నానినే స్వయంగా అమెకు ఛాన్స్ ఇచ్చాడట. అది అనుకోకుండా జరిగిందని స్వయంగా హీరోయిన్ శ్రీనిధినే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. తాను తెలుగులో కథానాయికగా నటించిన తొలి చిత్రం 'తెలుసు కదా' ముహూర్త వేడుకకు వచ్చిన నాని.. తనకు ఛాన్స్ ఇచ్చినట్లు శ్రీనిధి తెలిపింది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న సినిమా 'తెలుసు కదా'. ఇందులో శ్రీనిధితో పాటు రాశి ఖన్నా కూడా కథానాయికగా నటిస్తోంది. నీరజకు నాని క్లోజ్ ఫ్రెండ్ కావడంతో అమె దర్శకురాలిగా పరిచయం అవుతున్న చిత్రం ముహూర్త వేడుకకు నాని ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. అ సందర్భంగా శ్రీనిధిని చూసి, మాట్లాడిన నాని.. తన పక్కన అమె మంచి పెయిర్ అవుతుందని భావించాడట. తర్వాత 'హిట్-3' మొదలు కాగానే అమెకే తన పక్కన హీరోయిన్‌గా ఛాన్స్ ఇచ్చాడట. ఇలా అనుకోకుండా తాను 'హిట్-3'లో భాగం అయ్యానని శ్రీనిధి చెప్పింది. విశేషం ఏంటంటే.. నాని ఏ సినిమా ముహూర్త వేడుకకు వెళ్లి శ్రీనిధిని తన చిత్రంలోకి తీసుకున్నాడో అ సినిమా ఇంకా విడుదలకు సిద్ధం కాలేదు. కానీ 'హిట్-3' ఈ లోపే పూర్తయి ప్రేక్షకుల ముందుకు వచ్చేస్తోంది. మరి 'హిట్-3' శ్రీనిధికి తెలుగులో ఎలాంటి అరంభాన్నిస్తుందో చూడాలి. ఈ చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే.

# పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన ప్రకాష్‌రాజ్



పహల్గాం దాడిని ఖండిస్తున్నామని, రక్తం మరిగిపోతుందని సినీనటుడు ప్రకాష్‌రాజ్ పేర్కొన్నారు. ఈ ఘటనతో ప్రతి కాశ్మీరీ గుండె ముక్కలైందని, మాటలు రావడం లేదన్నారు. కాశ్మీరీలు మౌనం వీడాల్సిన సమయమిదని, ఈ క్రూరమైన చర్యను ఖండించాల్సిందేనని ఎక్స్‌లో గురువారం పేర్కొన్నారు" ఈ అనాగరిక దాడి అమాయకులపై జరిగిన దాడి మాత్రమే కాదు, కాశ్మీర్‌పై దాడి. శతాబ్దాల సంప్రదాయాలకు జరిగిన అవమానం. మన విశ్వాసాన్ని దెబ్బతీసేలా దుష్ట ప్రయోజనాల కోసం చేసిన దారుణచర్య. ఈ దుశ్చర్యకు మా రక్తం మరిగిపోతోంది. ఇలాంటివి జరిగిన ప్రతిసారీ, చేయని పనికి అవమాన భారాన్ని మోయాల్సి వస్తోంది. ఈ విషయంలో మరోసారి నిస్సందేహంగా చెబుతున్నా. దీనిని అస్సలు క్షమించం.. ఇది నిజంగా భయంకరమైన చర్య. అంతకుమించి పిరికిపంద చర్య. మన ఇంటికి వచ్చిన అతిథులపై జరిగిన ఈ క్రూర చర్యకు నిజంగా సిగ్గుపడుతున్నాం. దయచేసి మమ్మల్ని ఈ దృష్టి నుండి మాత్రం చూడొద్దని వేడుకుంటున్నా. ఇది నిజమైన కాశ్మీరీలు చేసింది కాదు.మా తల్లిదండ్రులు హంతకులను పెంచి పోషించలేదు. ఇది సిగ్గుపడాల్సిన అంశం. మీరు ఏం అశించి ఇటువంటి దారుణ హింసకు పాల్పడ్డారో తెలియదు. మీ చర్య కొన్ని కుటుంబాలను నాశనం చేసింది. పిల్లలను అనాథలుగా మార్చింది. కాశ్మీర్ అట స్థలం కాదు. యుద్ధం క్షేత్రం అంతకన్నా కాదు. అతిథులకు స్వాగతం పలికే ప్రదేశం. మీరు కశ్మీర్‌లో ప్రశాంతంగా ఉండటానికి వచ్చారు. కానీ, మేము మిమ్మల్ని కాపాడలేకపోయాం. అందుకు క్షమించమని అడుగుతున్నాం" అని పోస్ట్‌లో పేర్కొన్నారు.

## రజినీ కోసం రాసిన స్టోరీని మార్చి

తమిళ స్టార్ హీరో సూర్యకు ఎంతో కీలకమైన సినిమా.. రెట్రో. కొన్నేళ్లుగా అతడికి విజయాలు లేవు. తన చివరి చిత్రం 'కంగువ' కెరీర్లోనే పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుందని అనుకుంటే.. అతి పెద్ద డిజాస్టర్లలో ఒకటిగా నిలిచింది. దీంతో యువ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్ట్ చేసిన 'రెట్రో' మీద తన అశలన్నీ పెట్టుకున్నాడు సూర్య. ఈ చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీని టీజర్, ట్రైలర్ చూస్తే.. సూర్యకు పర్ఫెక్ట్ సినిమా అని, అతడికి కమ్ బ్యాక్ ఫిలిం అవుతుందనే అంచనాలు కలిగాయి. ఐతే ఈ కథ నిజానికి సూర్య కోసం రాసిందే కాదట. ఇంతకుముందు సూపర్ స్టార్ రజినీకాంత్‌తో 'పేట' మూవీ చేసిన కార్తీక్.. మళ్లీ అయన కోసమే రాసిన కథనే 'రెట్రో' అట. కానీ కొన్ని కారణాలతో ఈ సినిమాను అయనతో చేయలేకపోయానని.. సూర్యతో చేశానని.. కానీ అయన వచ్చాక చాలా మార్పులు జరిగాయని ఓ ఇంటర్వ్యూలో కార్తీక్ వెల్లడించాడు. రజినీ కోసం కథ రాసినపుడు అది పూర్తిగా యాక్షన్ ప్రధానంగా ఉందట. రజినీ వయసు దృష్ట్యా అయనకు లవ్ స్టోరీ, రొమాంటిక్ ట్రాక్ పెడితే బాగుండదని.. కాబట్టే యాక్షన్ కథగా దాన్ని తీర్చిదిద్దానని కార్తీక్ తెలిపాడు. ఐతే సూర్యతో ఈ కథ చేయాలి అనుకున్నాక.. యాక్షన్ డోస్ తగ్గించి ఇందులోకి ప్రేమకథను తీసుకొచ్చానని కార్తీక్ తెలిపాడు. ఈ కథను ముందు రజినీకి చెప్పావా అని సూర్య అడిగాడని.. ఔనని బదులిచ్చానని కార్తీక్ వెల్లడించాడు. 'రెట్రో' అందరూ అనుకుంటున్నట్లు గ్యాంగ్‌స్టర్ స్టోరీ కాదని అతను స్పష్టం చేశాడు. ఇందులో ప్రేమకథే ప్రధానమని.. దాని చుట్టూ మిగతా అంశాలను చేర్చానని.. ప్రేక్షకులు ఊహించని విధంగా ఈ కథ సాగుతుందని కార్తీక్ తెలిపాడు. సూర్య సరసన పూజా హెగ్డే కథానాయికగా నటించిన ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్ అస్థాన సంగీత దర్శకుడైన సంతోష్ నారాయణన్ మ్యూజిక్ చేశాడు. తమిళ, తెలుగు భాషల్లో ఒకేసారి ఈ చిత్రం విడుదల కానుంది.



# క్రీడలు



## కోహ్లి, పడిక్కల్ అర్ధసెంచరీలు రాజస్తాన్‌పై బెంగళూరు గెలుపు



ఐపిఎల్ సీజన్-18లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) బ్యాటర్లు మరోసారి కదం తొక్కారు. చిన్నస్వామి స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్లు రాణించడంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 9 వికెట్ల నష్టపోయి 194 పరుగులే చేసింది. రాజస్తాన్ బ్యాటర్లలో ధృవ్ జురెల్(47), జైస్వాల్(49) రాణించగా.. హేజిల్‌వుడ్‌కు నాలుగు, కృనాల్ పాండ్యాకు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు బెంగళూరు బ్యాటర్లు విరాట్ కోహ్లి (70బీ 42బంతుల్లో 8ఫోర్లు, 2సిక్సర్లు), దేవ్‌దత్ పడిక్కల్ (50బీ 27 బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు) వరుసగా రెండో మ్యాచ్‌లో అర్ధ శతకాలు బాదారు. ఫిల్ సాల్ట్ (26బీ 23బంతుల్లో 4ఫోర్లు), జితేశ్ శర్మ (20నాటౌట్), టిమ్ డేవిడ్ (23) పరుగులు చేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు సాల్ట్, కోహ్లి శుభారంభం అందించారు. ఈ జోడీ నిలకడగా బౌండరీలు బాది తొలి వికెట్‌కు 40 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మొదటి రెండు ఓవర్లలో చెరో ఫోర్ బాదగా.. ఆర్చర్ వేసిన మూడో ఓవర్‌లో కోహ్లి వరుసగా రెండు బౌండరీలు రాబట్టాడు. ఫిల్ సాల్ట్ తుషార్ దేశ్‌పాండేకు వరుసగా రెండు బౌండరీలతో స్వాగతం పలికాడు. ఈ క్రమంలో పవర్ ప్లే ముగిసేసరికి బెంగళూరు జట్టు వికెట్లేమీ నష్టపోకుండా 58పరుగులు చేసింది. తర్వాత బంతి అందుకున్న హసరంగ తన తొలి ఓవర్‌లో ఫిల్ సాల్ట్‌ను వెనక్కి పంపి మూడే పరుగులు ఇచ్చాడు. అనంతరం పడిక్కల్‌తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. సందీప్ బౌలింగ్‌లో విరాట్ వరుసగా రెండు ఫోర్లు కొట్టి హాఫ్ సెంచరీ (32 బంతుల్లో) అందుకున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లికిది ఐదో అర్ధ శతకం. ఆ తర్వాత విరాట్, పడిక్కల్ జోరు పెంచారు. పరాగ్ బౌలింగ్ చెరో సిక్స్ రాబట్టారు. తుషార్ దేశ్‌పాండే వేసిన 15 ఓవర్‌లో పడిక్కల్ రెండు సిక్స్‌లు కొట్టి 26 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. ఇదే ఓవర్‌లో కోహ్లి ఒక సిక్స్ బాదాడు. దీంతో 15 ఓవర్లకు బెంగళూరు వికెట్ నష్టానికి 156 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే, స్వల్ప వ్యవధిలో బెంగళూరు మూడు వికెట్లు కోల్పోయింది. కోహ్లిని ఆర్చర్ ఔట్ చేయగా.. సందీప్ ఒకే ఓవర్‌లో పడిక్కల్, రజత్ పటీదార్ (1)ని వెనక్కి పంపాడు. చివరి మూడు ఓవర్లలో ఆర్సీబీ 38 పరుగులు రాబట్టింది. రాజస్థాన్ బౌలర్లలో సందీప్ శర్మ, జోఫ్రా ఆర్చర్, హసరంగ చెరో వికెట్ పడగొట్టారు.

## పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్ ఆడబోము


భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులోనూ పాకిస్తాన్ క్రికెట్ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోమని ప్రకటించింది. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో బిసిసిఐ గురువారం కీలక ప్రకటన విడుదల చేసింది. బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడే అంశం గురించి సమీప భవిష్యత్తులో కనీసం చర్చ కూడా ఉండదు. అయితే, ఐసిసి ఈవెంట్లలో మాత్రం నిబంధనలకు అనుగుణంగా పాకిస్తాన్‌తో భారత్ మ్యాచ్‌లు ఆడుతుంది" అని తెలిపారు. ఇక దేవజిత్ సైకియా స్పందిస్తూ.. బిసిసిఐ తరఫున ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నాం అని పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఐపిఎల్-2025లో భాగంగా బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్-ముంబయి ఇండియన్స్ మధ్య మ్యాచ్ సందర్భంగా బీసీసీఐ బాధితులకు నివాళి అర్పించింది.

## 4 క్యాచ్‌లు వదిలేశావ్..




ప్రస్తుతానికి రాజస్థాన్ రాయల్స్ జట్టు ప్లే ఆఫ్స్ నుంచి దూరంగా సాగుతోంది. ఆ జట్టుకు ఏదీ కలసి రావడం లేదు. మొదటిది, ఆ జట్టు రెగ్యులర్ కెప్టెన్ గాయం కారణంగా ఆడటం లేదు. అదే సమయంలో, జట్టును నడిపించే సారథి క్యాచ్‌లు వదులుకోవడం ద్వారా అవాంఛనీయ రికార్డులు సృష్టించడంలో బిజీగా ఉన్నాడు. ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌కు ముందు, ఆ జట్టు 8 మ్యాచ్‌ల్లో 2 మాత్రమే గెలిచింది. పాయింట్ల పట్టికలో రాజస్థాన్ జట్టు 8వ స్థానంలో ఉంది. గాయం కారణంగా రెగ్యులర్ కెప్టెన్ సంజు శాంసన్ ప్లేయింగ్ ఎలెవన్ జట్టుకు దూరంగా ఉన్నాడు. ఇటువంటి పరిస్థితిలో, రియాన్ పరాగ్ జట్టును నడిపిస్తున్నాడు. కానీ, ఈ ఆటగాడు తన ప్రదర్శనతో తన సహచరుల మనోధైర్యాన్ని తగ్గిస్తున్నాడు. ఈ సీజన్‌లో రియాన్ పరాగ్ చాలా సందర్భాల్లో క్యాచ్‌లను వదిలేశాడు. ఇది జట్టుకు చాలా హానికరమని నిరూపితమైంది. ఈ సీజన్‌లో రియాన్ పరాగ్‌ను రాజస్థాన్ రాయల్స్ రూ. 14 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ అతను ఇంకా తనను తాను నిరూపించుకోలేకపోయాడంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఫ్యాన్స్ కూడా రూ. 14 కోట్లు దక్కించుకుని జాల్సాలు చేస్తున్నావ్ భయ్యా అంటూ ట్రోల్స్ చేస్తున్నారు. ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీతో జరిగిన 42వ మ్యాచ్‌లో, రియాన్ పరాగ్ మర్చిపోలేని తప్పు చేశాడు. ఆర్‌సీబీ ఇన్నింగ్స్ సమయంలో రాజస్థాన్ రాయల్స్ ఫాస్ట్ బౌలర్ ఫజల్హాక్ ఫరూఖీ రెండవ ఓవర్ వేయడానికి వచ్చాడు. ఈ ఓవర్ రెండో బంతికి ఫరూఖీ ఫుల్ టాస్ వేశాడు. ఆర్‌సీబీ ఓపెనర్ ఫిల్ సాల్ట్ షాట్ ఆడటానికి వెళ్లాడు. కానీ, బంతి మిడ్-ఆఫ్ వైపు వెళ్లింది. అక్కడే ఉన్న రియాన్ పరాగ్ క్యాచ్ తీసుకోవడానికి ప్రయత్నించాడు. కానీ, బంతి అతని చేతిలోంచి జారిపోయింది. ఆ సమయంలో సాల్ట్ 1 పరుగుతో ఉన్నాడు. ఆ తరువాత, సాల్ట్ 23 బంతుల్లో 4 ఫోర్ల సహాయంతో 26 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. అలాగే, విరాట్ కోహ్లీతో కలిసి 40 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.

## ఆర్సీబీని గెలుపు వెనుక అసలు హీరో



ఐపీఎల్ 2025లో సొంత మైదానంలో వరుస ఓటములకు ఆర్సీబీ బ్రేక్ వేసింది. ఈ సీజన్‌లో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో వరుసగా మూడు మ్యాచ్‌లో ఓడిపోయిన ఆర్సీబీ.. గురువారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూపర్ విక్టరీ సాధించింది. చివరి రెండు ఓవర్లలో 18 పరుగుల డిఫెండ్ చేసుకొని ఔరా అనిపించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీకి సూపర్ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి అద్భుతమైన స్టార్ట్ అందించాడు. మొత్తంగా 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులతో 70 పరుగులు చేసి అదరగొట్టాడు. కోహ్లితో పాటు దేవదత్ పడిక్కల్ 27 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్సులతో 50 పరుగులు చేసి దుమ్మురేపాడు. టిమ్ డేవిడ్ 23, జితేష్ శర్మ 10 బంతుల్లో 20 రన్స్ చేసి మంచి ఫినిష్ ఇచ్చారు. దీంతో ఆర్సీబీ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ ఈ సీజన్‌లో తొలిసారి 200 ప్లస్ స్కోర్ చేసింది. ఇంత పెద్ద స్కోర్‌ను కాపాడుకోవడంలో ఆర్సీబీ బౌలర్లు ఆరంభంలో తడబడినా.. కృనాల్ పాండ్యా, జోష్ హేజల్‌వుడ్ సూపర్ బౌలింగ్‌తో రాజస్థాన్ చేతుల్లోంచి మ్యాచ్‌ను లాక్కున్నారు. ఈ మ్యాచ్ విజయంలో విరాట్ కోహ్లి, హేజల్‌వుడ్, కృనాల్ పాండ్యా పాత్ర చాలా ఉంది. కానీ, రాజస్థాన్ ఆల్‌మోస్ట్ గెలిచేసింది అనే మూమెంట్‌లో వికెట్ కీపర్ జితేష్ శర్మ తీసుకున్న ఓ రివ్యూ మ్యాచ్‌ను ఆర్సీబీ వైపు తిప్పేసింది. 34 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులతో 47 పరుగులు చేసి.. మ్యాచ్‌ను ఈజీగా ఫినిష్ చేసేలా కనిపించాడు ఆర్ఆర్ బ్యాటర్ ధృవ్ జురెల్. భువనేశ్వర్ కుమార్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో ఏకంగా 22 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్‌లో జురెల్ ఓ సిక్స్, రెండు ఫోర్లు బాదేసి.. మ్యాచ్‌ను రాజస్థాన్‌దే అని డిసైడ్ చేశాడు. అతని కొట్టుడు చూసి.. ఆర్సీబీ ఆటగాళ్ల ముఖాలు మాడిపోయాయి, భుజాలు జారిపోయాయి.. హోం గ్రౌండ్‌లో ఈ మ్యాచ్ కూడా పోయినట్టే అని అంతా అనుకున్నారు. ఆర్సీబీ అభిమానులతో నిండిపోయిన ఎర్ర సముద్రంలా మారిన చిన్నస్వామి స్టేడియంలో నిశ్శబ్ద భూతం ఆవహించింది. అలాంటి టైమ్‌లో హేజల్‌వుడ్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ మూడో బంతిని వైడ్ ఆఫ్ ది ఆఫ్ స్టంప్ యార్కర్‌గా వేశాడు. ఆ బాల్‌ను అస్సలు ఎక్స్‌పెక్ట్ చేయని జురెల్.. ఆ బాల్‌కు షాట్ ఆడలేకపోయాడు. బాల్ వెళ్లి కీపర్ జితేష్ చేతుల్లో పడింది. హమ్మయ్య డాట్ బాల్ అనుకొని.. అంతా ఊపిరి పీల్చుకున్నారు. హేజల్‌వుడ్ కూడా నెక్ట్స్ బాల్ వేసేందుకు వెనక్కి వెళ్తున్నాడు. కానీ, కీపర్ జితేష్ మాత్రం క్యాచ్ అవుట్ అంటూ అప్పీల్ చేశాడు. వీడికేమైనా పిచ్చా.. ఒక వేళ బాల్ బ్యాట్‌కు తాకినా.. గ్రౌండ్‌పై పడి ఉంటుందని ఫ్యాన్స్ అనుకున్నారు. జితేష్ అప్పీల్‌ను ఆర్సీబీ ఆటగాళ్లు కూడా సీరియస్‌గా తీసుకోలేదు. అయినా కూడా జితేష్ కెప్టెన్ రజత్ పాటిదార్‌ను ఒప్పించి రివ్యూ తీసుకునేలా చేశాడు. సరే మ్యాచ్ చివరి కి వచ్చేసింది ఎలాగో గెలిచేలా కూడా లేరు, ఉన్న రివ్యూను వేస్ట్ ఎందుకు చేయడం అంటూ తీసుకుంటున్నారులే.. అని అంతా అనుకున్నారు.కానీ, రీప్లే చూస్తే.. అందరి మైండ్ బ్లాంక్ అయిపోయింది. ఒక్కసారిగా చిన్నస్వామి స్టేడియం హోరెత్తిపోయింది. ఆ దెబ్బకు విరాట్ కోహ్లి కూడా చెవులు మూసుకున్నాడు. ఎందుకంటే.. బాల్ స్టప్ పడిన తర్వాత బ్యాట్‌కు తాకి వికెట్ కీపర్ చేతుల్లో సేఫ్‌గా పడింది. థర్డ్ అంపైర్ అవుట్ ప్రకటించాడు అంతే.. ఆర్సీబీ జట్టులో తెలియని ఎనర్జీ వచ్చేసింది. ఆ నెక్ట్స్ బాల్‌కు ఆర్చర్ అవుట్. మ్యాచ్ ఒక్కసారిగా ఆర్సీబీ చేతుల్లోకి వచ్చేసింది. జితేష్ శర్మ ఆ రివ్యూ తీసుకోవడానికి బలవంతం చేసి ఉండకపోతే.. కచ్చితంగా ఆర్సీబీ రివ్యూ తీసుకొనేది కాదు, అంపైర్, బౌలర్, కెప్టెన్, మిగిలిన ప్లేయర్లు ఎవరూ కూడా బ్యాట్ ఎడ్జ్ తీసుకుందని అనుకోలేదు. కానీ, జితేష్ ఒక్కడే బలంగా నమ్మాడు.. రిజల్ట్ సాధించాడు. మ్యాచ్ ఆల్‌మోస్ట్ వన్‌సైడ్ అయిన తర్వాత పడిన ఆ వికెట్ ఆర్సీబీకి విజయాన్ని అందించింది. సో.. జితేష్ శర్మ ఇజ్ ది రియల్ హీరో.

## అరుదైన రికార్డులో చేరనున్న చెన్నై సారథి..




ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో అత్యుత్తమ ఆటగాళ్లు ఉన్నారు. ప్రస్తుత చెన్నై కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్‌లో పాల్గొన్న అతి పెద్ద వయస్సు గల ఆటగాడిగా నిలిచాడు. ఎంఎస్ ధోని కెప్టెన్సీలో చెన్నై 5 సార్లు ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకుంది. 2024 సీజన్‌కు ముందు ఎంఎస్ ధోని చెన్నై కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. నేడు చెపాక్‌లో ఐపీఎల్ సీజన్ 18 వ సీజన్‌లో భాగంగా 43వ మ్యాచ్ జరగనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తపలడనుంది. ప్రస్తుత చెన్నై కెప్టెన్ ధోని సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే టీ20లో భారీ చరిత్రను సృష్టించనున్నాడు. ధోని నేడు తన 400వ టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. ధోని టీ20 కెరీర్ గురించి మాట్లాడితే, 399 మ్యాచ్‌ల్లో 350 ఇన్నింగ్స్‌ల్లో 7566 పరుగులు చేశాడు. ఈ పరుగులు 38.02 సగటు, 135.90 స్ట్రైక్ రేట్‌తో సాధించాడు. ఇందులో 28 హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. ధోని మొత్తం 98 3అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో అతను 126.13 స్ట్రైక్ రేట్‌తో 1617 పరుగులు చేశాడు. ఇందులో 2 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ధోని ఐపీఎల్‌లో 272 మ్యాచ్‌లు ఆడాడు. 137.87 స్ట్రైక్ రేట్‌తో 5377 పరుగులు చేశాడు. ఇక దేశీయ క్రికెట్‌లో జారండ్ తరపున మొత్తం 24 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఛాంపియన్స్ లీగ్‌లో చెన్నై తరపున 449 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో 400 మ్యాచ్‌లు ఆడిన నాలుగో భారత ఆటగాడిగా ధోనీ నిలిచాడు. దీనికి ముందు, రోహిత్ 456 మ్యాచ్‌లు ఆడి 12058 పరుగులు చేశాడు. దీంతో టీ20లో అత్యధికంగా ఆడిన భారత ఆటగాడిగా నిలిచాడు. 412 మ్యాచ్‌ల్లో 7537 పరుగులు చేసిన దినేష్ కార్తీక్ రెండవ స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లి 412 మ్యాచ్‌లతో మూడో స్థానంలో ఉన్నాడు. కోహ్లి 408 మ్యాచ్‌ల్లో 13278 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్ చెన్నై, హైదరాబాద్ జట్లకు దూ ఆర్ డై పరిస్థితిలా మారింది. ఐపీఎల్ 2025 సీజన్ రెండు జట్లకు షాక్ లాంటిదే. 8 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో చెన్నై పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. హైదరాబాద్ తొమ్మిదవ స్థానంలో ఉంది. ఇప్పుడు రెండు జట్లు సీజన్‌లోని మిగిలిన భాగంలో తిరిగి పునరాగమనం చేయాలని ఆసక్తిగా ఉన్నాయి.



# వ్యాపారం



## మరోసారి పెరిగిన బంగారం ధరలు..



దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. మంగళవారం బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకుని లక్ష రూపాయలు దాటాయి. ఆ తర్వాత బుధవారం బంగారం ధరలో పెద్ద తగ్గుదల కనిపించింది. ఇప్పుడు ధరలో తగ్గుదల ఉంటుందని అనిపించింది. కానీ అలాంటిలేమి జరగలేదు. గురువారం బంగారం ధరలో పెరుగుదల కనిపించింది. దీనికి ప్రధాన కారణం డాలర్ ఇండెక్స్ పతనమని భావిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డాలర్ ఇండెక్స్ పతనం ప్రభావం రాబోయే రోజుల్లో కనిపిస్తుంది. అలాగే బంగారం ధర కొత్త రికార్డు స్థాయికి చేరుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర ఎంత పెరిగిందో, ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు 200 రూపాయలు పెరిగి 10 గ్రాములకు 99,400 రూపాయలకు చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర బుధవారం చారిత్రాత్మకమైన రూ.1 లక్ష స్థాయి నుండి యు-టర్న్ తీసుకుని 10 గ్రాములకు రూ.2,400 తగ్గి రూ.99,200కి చేరుకుంది. అదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.200 పెరిగి రూ.98,900కి చేరుకుంది. మునుపటి ముగింపు ధర 10 గ్రాములకు రూ.98,700గా ఉంది. ఇదిలా ఉండగా, గురువారం వెండి ధరలు కిలోకు రూ.700 పెరిగి రూ.99,900కి చేరుకున్నాయి. మునుపటి ముగింపు ధరలో వెండి కిలోకు రూ.99,200 వద్ద ముగిసింది. బంగారం ధర ఎందుకు పెరిగింది?: అమెరికా, చైనా మధ్య ప్రస్తుతం నెలకొన్న వాణిజ్య ప్రతిష్టంభన కొంతకాలం కొనసాగవచ్చని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ బుధవారం అన్నారు. ఇది కాకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాబోయే రెండు, మూడు వారాల్లో చైనాకు కొత్త సుంకాల రేట్లు అందుకోవచ్చని సూచించారు. సాంకేతిక దిద్దుబాటు కారణంగా బంగారం ధర ఆల్ టైమ్ గరిష్ట స్థాయిల నుండి పడిపోయిన తర్వాత ట్రంప్, బెసెంట్ వ్యాఖ్యలు సురక్షితమైన ఆస్తిగా బులియన్ డిమాండ్‌ను పునరుద్ధరించడానికి సహాయపడ్డాయని కమోడిటీ మార్కెట్ నిపుణులు అంటున్నారు. స్వల్పకాలిక తగ్గుదల తర్వాత బంగారం ధరలు పెరిగాయని, లాభాల బుకింగ్ కారణంగా బంగారం రికార్డు స్థాయికి చేరుకుందని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సిఇఒ చింతన్ మెహతా అన్నారు. ట్రంప్ తాజా ప్రకటన అమెరికా ఆర్థిక పరిస్థితి గురించి అనిశ్చితిని సృష్టించింది. ఇది సురక్షితమైన పెట్టుబడిగా బంగారానికి డిమాండ్‌ను పెంచింది.

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు..

## లక్షల కోట్లు ఆవిరి..




కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో భారత మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి . అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు ఉండటంతో లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్ తర్వాత దాదాపు 950 పాయింట్లు నష్టపోయి ప్రస్తుతం 79,000 మార్కు కంటే దిగువన ట్రేడవుతోంది. మరోవైపు నిఫ్టీ 24,000 పాయింట్ల కంటే దిగువకు పడిపోయింది. దేశంలోని మూడవ అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన యాక్సిస్ బ్యాంక్ మార్చి త్రైమాసికంలో అంతగా ఆకట్టుకోలేకపోయింది. త్రైమాసిక లాభం గతేడాది ఇదే కాలంలో రూ.7,130 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.7,117 కోట్లకు తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. బ్యాంక్ షేర్లు 4.65% పడిపోవడం మదుపర్లను కలవరపెడుతోంది. యాక్సిస్ బ్యాంక్‌తో పాటు, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా ఇవాళ భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ లాభాల్లో ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాక్ మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలు ఏ పరిస్థితులకు దారితీస్తాయోనని పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఆసియా మార్కెట్లు సహా ప్రపంచ మార్కెట్లు సానుకూల సంకేతాలు అందిస్తున్నాయి. దక్షిణ కొరియా కోస్పి ఇండెక్స్, టోక్యో నిక్కీ 225, హాంకాంగ్ హాంగ్ సెంగ్, షాంఘై రాజు కాంపోజిట్ అన్నీ గ్రీన్‌లో ఉన్నాయి. అమెరికా ఈక్విటీలలో కూడా ఇలాంటి ధోరణులు కనిపించాయి. నిన్న సాయంత్రం నాస్‌డాక్ కాంపోజిట్ 2.74 శాతం లాభపడింది. ఎస్‌డ పి 500 2 శాతం పైగా పెరిగింది, డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 1.23 శాతం పెరిగింది.

## టెక్ మహీంద్రా లాభం జూమ్




మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 76.5 శాతం వృద్ధి చెంది రూ.1,166.7 కోట్లకు పెరిగింది. ఆదాయం 4 శాతం పెరిగి రూ.13,384 కోట్లుగా నమోదైంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)తో పోలిస్తే మాత్రం కంపెనీ లాభంలో 19 శాతం, ఆదాయంలో కేవలం 1 శాతం వృద్ధి నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి టెక్ మహీంద్రా నికర లాభం 80 శాతం వృద్ధితో రూ.4,252 కోట్లకు, ఆదాయం 2 శాతం పెరుగుదలతో రూ.52,988 కోట్లకు చేరుకుంది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండ టంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.30 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు తెలిపింది. క్యూ4లో కంపెనీ 79.8 కోట్ల డాలర్ల (సుమారు రూ.6,800 కోట్లు) విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. ఏడాది క్రితం ఇదే కాలానికి లభించిన ఆర్డర్లతో పోలిస్తే 60 శాతం అధికమిది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి లభించిన కొత్త డీల్స్ విలువ 270 కోట్ల డాలర్లు (దాదాపు రూ.23,000 కోట్లు)గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 42 శాతం ఎక్కువ. క్యూ3తో పోలిస్తే క్యూ4లో సంస్థ ఉద్యోగుల సంఖ్య 1,757 మేర తగ్గింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో 3,276 మంది తగ్గారు. దాంతో, ఈ మార్చి 31 నాటికి టెక్ మహీంద్రాలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 1,48,731కి జారుకుంది. కాగా, మార్చి త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 11.8 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలన్న లక్ష్యాన్ని మించి 6,100 నియామకాలు చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) క్యాంపస్ హైరింగ్ లక్ష్యాన్ని వెల్లడించేందుకు కంపెనీ నిరాకరించింది. ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి పెరిగిన నేపథ్యంలో ఐటీ సేవలకు డిమాండ్ మందగించడం ఇందుకు కారణంగా పేర్కొంది.

## హైదరాబాద్‌లో ఏబీసీ ఇన్నోవేషన్ సెంటర్



హైదరాబాద్, ఏప్రిల్ 24 : ఫిట్‌నెస్ బిజినెస్‌కు సంబంధించి అంతర్జాతీయంగా టెక్నాలజీ సేవలు అందిస్తున్న అమెరికాకు చెందిన ఏబీసీ ఫిట్‌నెస్.. భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్‌ను నెలకొల్పింది. సాఫ్ట్‌వేర్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌పై మరింత దృష్టి సారించడంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్టు, దీంతో తొలి ఏడాదిలో 200 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రొడక్ట్ ఇన్నోవేషన్, వరల్డ్-క్లాస్ టెక్నాలజీ సేవలు అందించడానికి ఈ సెంటర్ ఉపయోగపడనున్నదన్నారు.

## ఆత్మవిశ్వాసమే అసలైన ఆస్తి..

ఆత్మవిశ్వాసం.. పిల్లలకు తల్లిదండ్రులు అందించాల్సిన అసలైన ఆస్తి. కాన్ఫిడెంట్‌గా ఉంటేనే.. వారి భవిష్యత్తు బాగుంటుంది. ఎలాంటి సవాళ్లు ఎదురైనా.. ధైర్యంగా ఎదుర్కొనే 'శక్తి' లభిస్తుంది. అయితే.. ఇది రాత్రికి రాత్రే వచ్చేదికాదనీ, తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే వారిపై వారికి నమ్మకాన్ని కలిగించాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. వారిపై మీరు చూపించే ప్రేమ, విశ్వాసం, ఇంట్లో వారిని
ఎలా చూసుకుంటున్నారు? అనే విషయాలే.. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయనీ అంటున్నారు.

చిన్నచిన్న విషయాల్లో.. నిర్ణయాలను పిల్లలకే వదిలేయండి. బయటికి వెళ్లేటప్పుడు ఏ డ్రెస్ వేసుకోవాలో.. సాయంత్రం స్నాక్స్ కోసం ఏం సిద్ధం చేయాలో.. వారినే నిర్ణయించుకోమని చెప్పండి. వారి నిర్ణయాలను గౌరవించండి. ఈ చిన్న అలవాటే.. పిల్లల్లో సొంతంగా ఆలోచించుకొనే సామర్థ్యాన్ని పెంచుతుంది. భవిష్యత్తులో పెద్దపెద్ద నిర్ణయాలు సులువుగా తీసుకోగలిగే విశ్వాసాన్ని అందిస్తుంది.


చదువుల్లోనైనా, ఆటల్లోనైనా ఫలితం ఎలా ఉన్నా.. పిల్లల ప్రయత్నాన్ని ప్రోత్సహించండి. వారు ఎంత శ్రమిస్తున్నారనేదే ముఖ్యమని గ్రహించండి. చదువుల్లో గ్రేడ్‌లు తెచ్చుకోవడం.. ఆటల్లో కప్పులు కొట్టేయడం మాత్రమే 'విజయం సాధించినట్టు' కాదన్న విషయం వారికి బాల్యం నుంచే నేర్పించండి. ఓడిపోయినప్పుడు కూడా వారి వెన్ను తట్టండి. ఇలాంటి ప్రోత్సాహం.. పిల్లల్లో సానుకూల మనస్తత్వాన్ని పెంచుతుంది. ఎలా గెలవాలో.. సమస్యలు ఎదురైతే ఎలా పోరాడాలో వారికి నేర్పుతుంది. ఎప్పుడూ పరిపూర్ణంగా ఉండలేమనే విషయాన్ని కూడా పిల్లలకు బోధపరుస్తుంది.

పిల్లలు స్కూల్‌నుంచి వచ్చినప్పుడో.. మీరు ఆఫీస్‌నుంచి ఇంటికి వెళ్లినప్పుడో.. మీ చిన్నారులను దగ్గరికి తీసుకొని కౌగిలించుకోండి. దీనివల్ల వారు భావోద్వేగానికి లోనవుతారు. వారిలో ఆక్సిటోసిన్ హార్మోన్ స్థాయిలు పెరుగుతాయి. వారి మానసిక స్థితిని మెరుగుపర్చడంలో ఇది సాయపడుతుంది. దాంతో పిల్లలు మానసికంగా మరింత బలంగా తయారవుతారు. రోజూ ఇలా చేయడం వల్ల పిల్లల్లో జీవితం పట్ల సానుకూల దృక్పథం పెరుగుతుంది. ఏ సందర్భంలోనైనా కుటుంబం తనకు అండగా ఉంటుందనే భరోసా కలుగుతుంది. ఇంట్లో సురక్షితంగా ఉన్నామని భావించే పిల్లలు.. మరింత ఆత్మవిశ్వాసంతో పెరుగుతారు.

ఒక చిన్న అభినందన.. వారికి కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. చిన్న విజయమైనా.. మీ ప్రశంస పెద్దగా ఉండాలి. అప్పుడే.. వారిలో పదేపదే ప్రశంసలు పొందాలనే భావన కలుగుతుంది. మీ అభినందనలే.. వారిలో సృజనాత్మకతను వెలికితీస్తాయి. కాబట్టి, మీ పిల్లలు చేసిన ప్రతి మంచి పనినీ అభినందించండి. దీంతో వారు మరిన్ని మంచి పనులు చేయడానికి ఉత్సాహం చూపుతారు. ఆ ప్రయత్నంలో ఓడినా %-% గెలిచినా అభినందిస్తే.. వారిని మరో ప్రయాణానికి ప్రేరేపిస్తుంది.




# ఆరోగ్యం




## లిమిట్ దాటితే ఈ వ్యాధులు ముంచేస్తాయి



చక్కెరను సమతుల్యంగా తీసుకోవడం ఆరోగ్యకరమైన జీవనశైలికి కీలకం. రోజుకు 25-36 గ్రాముల లోపు అదనపు చక్కెర తీసుకోవడం ద్వారా ఊబకాయం, డయాబెటిస్, మరియు గుండె జబ్బుల వంటి సమస్యలను నివారించవచ్చు. ఆహార లేబుల్స్‌ను జాగ్రత్తగా చదవడం, సహజ చక్కెర వనరులను ఎంచుకోవడం, ప్రాసెస్డ్ ఆహారాలను తగ్గించడం వంటి చిన్న చిన్న మార్పులతో మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈ రోజు నుండే చక్కెర వినియోగంపై శ్రద్ధ వహించి, ఆరోగ్యకరమైన జీవనం వైపు అడుగులు వేయండి. ఆధునిక జీవనశైలిలో చక్కెర వినియోగం గణనీయంగా పెరిగింది. రుచికరమైన ఆహారాలు, పానీయాలు, స్వీట్లలో కలుపుతోన్న అదనపు చక్కెర మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధిక చక్కెర వినియోగం ఊబకాయం, డయాబెటిస్, గుండె జబ్బులు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. అయితే, రోజుకు ఎంత చక్కెర తీసుకోవడం సురక్షితం? అధిక చక్కెర, దాని మోతాదుల గురించి, ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరంగా తెలుసుకుందాం. అదనపు చక్కెర అంటే ఆహారం లేదా పానీయాల తయారీలో జోడించే చక్కెర లేదా సిరప్‌లు. ఇవి సహజంగా ఆహారంలో ఉండే చక్కెర (ఉదా., పండ్లలోని ఫ్రక్టోస్, పాలలోని లాక్టోస్) కంటే భిన్నమైనవి. సాధారణంగా కూల్ డ్రింక్స్, కేకులు, బిస్కెట్లు, చాక్లెట్లు, ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో అదనపు చక్కెర ఎక్కువగా ఉంటుంది. విశ్వ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మరియు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఏహెచ్‌ఏ) వంటి సంస్థలు అదనపు చక్కెర వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలను అందిస్తాయి. పెద్దలు: రోజుకు తీసుకునే మొత్తం కేలరీలలో అదనపు చక్కెర 10% కంటే తక్కువగా ఉండాలి. ఇది సగటున 2000 కేలరీల ఆహారంలో దాదాపు 25-50 గ్రాములు (6-12 టీస్పూన్లు) చక్కెరకు సమానం. ఆరోగ్యం కోసం, 5% (25 గ్రాములు లేదా 6 టీస్పూన్లు) కంటే తక్కువగా ఉండటం మరింత మంచిది.పురుషులు: ఏహెచ్‌ఏ ప్రకారం, పురుషులు రోజుకు 36 గ్రాములు (9 టీస్పూన్లు) కంటే ఎక్కువ అదనపు చక్కెర తీసుకోకూడదు.మహిళలు: మహిళలకు 25 గ్రాములు (6 టీస్పూన్లు) కంటే ఎక్కువ తీసుకోవడం సిఫార్సు చేయబడదు. పిల్లలు: 2-18 సంవత్సరాల పిల్లలకు రోజుకు 25 గ్రాములు (6 టీస్పూన్లు) కంటే తక్కువ చక్కెర తీసుకోవాలని సిఫార్సు చేయబడింది.

## గులాబీలతో ఆరోగ్య ప్రయోజనాలు..!



గులాబీ పువ్వుల్లో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. చర్మం మచ్చలు, బరువు తగ్గడం, మొటిమలు, ఇన్ఫెక్షన్లు, అలెర్జీ వంటి సమస్యలకు గులాబీలతో చెక్ పెట్టవచ్చునని నిపుణులు చెబుతున్నారు. విరబూసిన గులాబీలు అందానికే కాదు.. ఆరోగ్యానికి కూడా దివ్యౌషధం అంటున్నారు ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు. సొగసైన గులాబీ పూలలో పలు రకాల అనారోగ్య సమస్యలను నయం చేసే గుణాలు సమృద్ధిగా ఉన్నాయని చెబుతున్నారు. గులాబీ పూలు చర్మం, జుట్టు, జీర్ణవ్యవస్థకు మేలు చేస్తాయి. గులాబీ పువ్వుల్లో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. చర్మం మచ్చలు, బరువు తగ్గడం, మొటిమలు, ఇన్ఫెక్షన్లు, అలెర్జీ వంటి సమస్యలకు గులాబీలతో చెక్ పెట్టవచ్చునని నిపుణులు చెబుతున్నారు. గులాబీ రేకులను నమలడం వల్ల జీర్ణక్రియ సులభమవుతుంది. గులాబీ రేకులతో తయారైన కషాయాన్ని తీసుకోవటం వల్ల శరీరంలోని చెడు కొవ్వులు తగ్గుతాయి.గులాబీ రేకులలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తాయి. గులాబీ రేకులు అలెర్జీలను తగ్గించడంలో సహాయపడతాయి. గులాబీ రేకులతో తయారు చేసిన గుల్కాంద్ వల్ల శరీరంలోని వేడి తగ్గిపోతుంది. గులాబీ రేకులతో తయారు చేసిన టీ తాగితే ఒత్తిడి తగ్గిపోతుంది. గులాబీ రేకులు కంటి చూపును మెరుగుపరుస్తాయి. గులాబీ రేకులను నీటిలో మరిగించి, టీలా తాగడం వల్ల పీరియడ్స్ నొప్పి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. గులాబీల పీల్చడం వల్ల మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. ఎండిన గులాబీ రెక్కలను పొడిచేసి తేనెకు కలిపి కొద్దికొద్దిగా చప్పరిస్తుంటే గొంతు నొప్పినుంచి ఉపశమనం లభిస్తుంది. గులాబీలు వేసి నానబెట్టిన నీళ్లను సున్నపు తేటకు కలిపి, కమలాపండ్ల రసానికి చేర్చి తీసుకుంటే ఎసిడిటీవల్ల వచ్చే ఛాతినొప్పి, వికారం, అజీర్ణం, ఆమ్లపిత్తం వంటి సమస్యలు తగ్గుతాయి. రోజ్‌వాటర్‌కి కుంకుమ పువ్వు, బాదం పలుకులను కలిపి మెత్తగా నూరి ముఖంమీద ఫేస్ ప్యాక్ మాదిరిగా ప్రయోగిస్తే ముఖ చర్మం కుసుమ కోమలంగా తయారవుతుంది. మంగు మచ్చలు, మొటిమలు వంటి చర్మ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

### వేసవిలో తప్పక తినాల్సిన పండు...

ఈ పండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అయితే, వీటిని ఖాళీ కడుపుతో అస్సలు తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాగే, పచ్చిగా ఉండే లిచీ పండ్ల జోలికి అస్సలు వెళ్లకూడదని హెచ్చరిస్తున్నారు. లిచీ పండ్లు కొన్నిసార్లు కొన్ని ఇబ్బందులను కలిగిస్తాయని చెబుతున్నారు. స్ట్రాబెరీ రూపంలో అందంగా మెరిసిపోయే లిచీ పండ్లు భలే రుచిగా ఉంటాయి. కేవలం రుచిలో మాత్రమే కాదు.. లిచీ పండ్లు ఎన్నో పోషకాలతో నిండి ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్లలో విటమిన్స్, ఖనిజాలకి గొప్ప మూలం అని చెబుతున్నారు. ముఖ్యంగా వేసవిలో నీటిశాతం అధికంగా ఉండి, జ్యూసీగా ఉండే లిచీ తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ పండు ఎంత రుచికరమైనదో అంతే ఔషధ గుణాలతో నిండి ఉంటుందని చెబుతున్నారు. మరి ఈ లిచీ పండ్ల ప్రత్యేకత, దాని వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం.. వేసవిలో వచ్చే చాలా రకాల పండ్లలో లిచీ కూడా ఒకటి. అధిక నీరు, జ్యూస్ ఎక్కువగా ఉండే లిచీ పండ్లను తినడం వల్ల శరీరం చల్లబడుతుంది. ఇది జీవక్రియను బలపరుస్తుంది. ఇది త్వరగా పొట్ట నిండుగా ఉండేలా చేస్తుంది. ఫలితంగా బరువును తగ్గిస్తుంది. లిచీలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. లిచీలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. లిచీలోని విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. వృద్ధాప్య సంకేతాలను నివారిస్తుంది. లిచీ తక్కువ కేలరీలు కలిగిన పండు. దీంతో ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాదు, లిచీ పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. నరాల సంబంధిత వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. గుండెను ఆరోగ్యం ఉంచేందుకు అవసరమైన పాలిఫినాల్స్ లిచీలో అధికంగా ఉన్నాయి.

## బాస్మతి బియ్యం వారికి వరం.. ఎంత తిన్నా నో టెన్షన్..



బాస్మతి బియ్యం కేవలం రుచికరమైన ఆహారం మాత్రమే కాదు, ఇది ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందించే పోషకాహార వనరు. జీర్ణక్రియను మెరుగుపరచడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడడం, డయాబెటిస్ నియంత్రణ, బరువు నియంత్రణ, శక్తి అందించడం వంటి లాభాలతో, బాస్మతి బియ్యం ఆరోగ్యకరమైన జీవనశైలిలో ఒక ముఖ్యమైన భాగంగా నిలుస్తుంది. బ్రౌన్ బాస్మతిని ఎంచుకోవడం ద్వారా మరిన్ని పోషక ప్రయోజనాలను పొందవచ్చు. దీన్ని సమతుల్య ఆహారంలో చేర్చడం ద్వారా, రుచి ఆరోగ్యం రెండింటినీ ఆస్వాదించవచ్చు. బాస్మతి బియ్యం కేవలం రుచికరమైన ఆహారం మాత్రమే కాదు, ఇది ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందించే పోషకాహార వనరు. జీర్ణక్రియను మెరుగుపరచడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడడం, డయాబెటిస్ నియంత్రణ, బరువు నియంత్రణ, శక్తి అందించడం వంటి లాభాలతో, బాస్మతి బియ్యం ఆరోగ్యకరమైన జీవనశైలిలో ఒక ముఖ్యమైన భాగంగా నిలుస్తుంది. బ్రౌన్ బాస్మతిని ఎంచుకోవడం ద్వారా మరిన్ని పోషక ప్రయోజనాలను పొందవచ్చు. దీన్ని సమతుల్య ఆహారంలో చేర్చడం ద్వారా, రుచి మరియు ఆరోగ్యం రెండింటినీ ఆస్వాదించవచ్చు. బాస్మతి బియ్యం, దాని ప్రత్యేకమైన సువాసనతో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఒక రకమైన బియ్యం. భారతదేశం పాకిస్తాన్‌లో ఎక్కువగా పండించే ఈ బియ్యం, రుచికరమైన వంటకాలకు మాత్రమే కాకుండా, ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలను అందిస్తుంది. దీనిలో ఉండే పోషకాలు శరీరానికి శక్తిని అందించడంతో పాటు, వివిధ ఆరోగ్య సమస్యలను నివారించడంలో సహాయపడతాయి.

బాస్మతి బియ్యం కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, ఫైబర్, అవసరమైన విటమిన్లు ఖనిజాలతో సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరానికి శక్తిని అందించే ప్రధాన వనరుగా పనిచేస్తుంది, అదే సమయంలో తక్కువ కొవ్వు కంటెంట్ కలిగి ఉండటం వల్ల బరువు నియంత్రణకు సహాయపడుతుంది. బాస్మతిలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది. అదనంగా, ఇందులో విటమిన్ బి మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉండటం వల్ల గుండె ఆరోగ్యానికి నాడీ వ్యవస్థకు మేలు చేస్తుంది. బాస్మతి బియ్యం జీర్ణం కావడానికి సులభమైన ఆహారం, ఇది కడుపు సమస్యలతో బాధపడేవారికి అనువైన ఎంపిక. దీనిలో ఉండే ఫైబర్ పేగు కదలికలను సాధారణీకరిస్తుంది జీర్ణవ్యవస్థను శుభ్రపరుస్తుంది. బాస్మతి బియ్యం గ్లూటెన్-ఫ్రీ కావడం వల్ల, గ్లూటెన్ అలర్జీ ఉన్నవారు కూడా దీన్ని సురక్షితంగా తినవచ్చు. ఇది కడుపులో ఉబ్బరం లేదా అసౌకర్యాన్ని కలిగించకుండా, తేలికగా జీర్ణమవుతుంది, ఇది అన్ని వయసుల వారికి తగిన ఆహారంగా చేస్తుంది. బాస్మతి బియ్యం గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో తక్కువ సంతృప్త కొవ్వులు మరియు కొలెస్ట్రాల్ ఉండటం వల్ల, ఇది రక్తనాళాలలో కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. అదనంగా, బాస్మతిలో ఉండే మెగ్నీషియం మరియు పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. బ్రౌన్ బాస్మతి బియ్యం ఎక్కువ ఫైబర్ కలిగి ఉండటం వల్ల, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది మరియు రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యంగా ఉంచుతుంది. బాస్మతి బియ్యం, ముఖ్యంగా బ్రౌన్ బాస్మతి, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతుంది. ఈ లక్షణం డయాబెటిస్ ఉన్నవారికి బాస్మతి బియ్యాన్ని అనువైన ఆహారంగా చేస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ రక్తంలో గ్లూకోజ్ శోషణను నియంత్రిస్తుంది, ఇది డయాబెటిస్ నిర్వహణలో సహాయపడుతుంది. అయితే, బాస్మతి బియ్యాన్ని సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవడం వైట్ బాస్మతి కంటే బ్రౌన్ బాస్మతిని ఎంచుకోవడం మరింత ప్రయోజనకరం. బాస్మతి బియ్యం తక్కువ కేలరీలు మరియు కొవ్వు కలిగి ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునేవారికి ఇది ఒక గొప్ప ఎంపిక. ఇందులో ఉండే ఫైబర్ ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, ఇది అతిగా తినడాన్ని నివారిస్తుంది. బాస్మతి బియ్యం రుచికరమైనది మరియు తేలికగా జీర్ణమయ్యే లక్షణం కలిగి ఉండటం వల్ల, ఇది ఆరోగ్యకరమైన ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. బ్రౌన్ బాస్మతి బియ్యం ఎక్కువ పోషకాలను కలిగి ఉండటం వల్ల బరువు నియంత్రణకు మరింత సహాయకరంగా ఉంటుంది. బాస్మతి బియ్యం కార్బోహైడ్రేట్ల యొక్క అద్భుతమైన వనరు, ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. ఇది క్రీడాకారులు మరియు రోజూ శారీరక శ్రమ చేసేవారికి ఆదర్శవంతమైన ఆహారం. బాస్మతిలో ఉండే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు నెమ్మదిగా శక్తిని విడుదలచేస్తాయి, ఇది రోజంతా చురుకుదనాన్ని స్టామినాను కాపాడుతుంది. అదనంగా, ఇందులో ఉండే బి విటమిన్లు శరీరంలో శక్తి ఉత్పత్తిని మెరుగుపరుస్తాయి.

## బఠానీలే కదా అని లైట్ తీసుకుంటున్నారా?



బఠానీలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గుండె ఆరోగ్యానికి బఠానీలు చాలా మంచివి. పచ్చి బఠానీల్లో విటమిన్ ాా, విటమిన్ జ, విటమిన్ ఖ, ఫాస్ఫరస్, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇందులో ఫైబర్, ప్రోటీన్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. బఠానీలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. బఠానీలు రక్తంలో చక్కెర స్థాయిని అదుపు చేయడంలో సహాయపడతాయి. పచ్చి బఠానీల్లో ఉండో విటమిన్ జ, ఇతర యాంటీఆక్సిడెంట్లు వల్ల రోగనిరోధక శక్తిని మెరుగుపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. బఠానీలు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. విటమిన్ సి ఇతర యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. బఠానీలను క్రమం తప్పకుండా చేర్చుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. పచ్చి బఠానీలో ప్రోటీన్‌తో పాటు విటమిన్ కె బోలు ఎముకల వ్యాధిని నివారించడంలో సహాయపడుతుంది. పచ్చి బఠానీలను తింటుంటే ఇది జ్ఞాపకశక్తిని పెంచడంలో సహాయపడుతుంది.గర్భిణీ స్త్రీలకు పచ్చి బఠానీలు మేలు చేస్తాయి. ఇది పిండానికి తగిన పోషణను కూడా అందిస్తుంది. ఇది కాకుండా, ఇది రుతుక్రమ సమస్యలలో కూడా ఉపయోగపడుతుంది. బఠానీలలో ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి, దీని కారణంగా ఆకలి తగ్గుతుంది. ఇది జింక్, రాగి, మాంగనీస్, ఇనుము కలిగి ఉంటుంది. దానివల్ల రోగాల బారిన పడకుండా ఉంటారు. రెగ్యులర్‌గా తినడం వల్ల క్యాన్సర్ రిస్క్ తగ్గుతుంది. ముఖ్యంగా కడుపు క్యాన్సర్ నిరోధిస్తాయి. పచ్చి బఠానీలను తినడం వల్ల యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ప్రభావాన్ని దూరం చేస్తుంది. పచ్చి బఠానీలు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. పచ్చి బఠానీలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. పచ్చి బఠానీ తీసుకోవడం వల్ల షుగర్ లెవల్ కంట్రోల్‌లో ఉంటుంది. పచ్చి బఠానీలు క్యాన్సర్ రిస్క్‌ను తగ్గిస్తుంది.పచ్చి బఠానీలు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగవుతుంది. కడుపులో మంచి చేసే బ్యాక్టీరియాను పెంచుతుంది.. జీర్ణక్రియను మెరుగుపరిచి బరువు తగ్గేందుకు కూడా బఠానీలు ఉపకరిస్తాయి. క్యాలరీలు తక్కువగా ఉండడం వల్ల బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారికి బఠానీలు బెస్ట్ చాయిస్ అంటున్నారు నిపుణులు. శరీరంలో బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉండేందుకు కూడా పచ్చి బఠానీలు సహకరిస్తాయి. వీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఫైబర్, ప్రోటీన్ పుష్కలంగా ఉంటాయి.

# మలేరియా నిర్మూలనకు నిబద్ధతతో పని చేయాలి

**వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక**




**బిచినేపల్లి ఏప్రిల్ 25( స్కైన్యూస్)** మలేరియా నిర్మూలనకు వైద్య సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక కోరారు శు క్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు ప్రతి సంవత్సరం అవగాహన ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని దోమల ద్వారా మలేరియా ఫైలేరియా డెంగ్యూ చికెన్ గున్యా మెదడు వ్యాప్తి చెందుతాయని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ పరిసరాలలో ఎలాంటి చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. ప్రతి వారంలో ఒకరోజు స్వచ్ఛందంగా డ్రై డ్రై ను పాటించాలని నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో నీటిని తొలగించి శుభ్రం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యలక్ష్మి డాక్టర్ సాయిరాం గౌడ్ సిహెచ్ఓ లీలావతి ఎం పి హెచ్ ఓ బాదం రాజేశ్వర్ హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ ఏఎన్ఎం గజవర్ధనమ్మ ఆరోగ్యం మిత్ర మౌలాలి ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్ స్టాఫ్ నర్స్ శాంతి ఆశా వర్కర్ జయమ్మ పార్వతీ షమీం విజయ లీల తదితరులు పాల్గొన్నారు

## - మృతి చెందిన చెన్నమ్మ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీరం బుచ్చిరెడ్డి



**తెల్కపల్లి ఏప్రిల్25(స్కై న్యూస్):**తెలకపల్లి మండలం పెద్దూరు గ్రామం లో ఈరోజు ఇరగ జీవి చెన్నమ్మ/సత్యం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడం జరిగింది మృతదేహాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకుడు బీరం గీత బుచ్చిరెడ్డి ఈరోజు పరామర్శించి నివాళు లర్పించారు అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.5000/ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. వీరితోపాటు గ్రామ కాంగ్రెస్ నాయకులు టెంపుల్ చైర్మన్ జక్క గోవర్ధన్ రెడ్డి జనం పల్లి సుధాకర్ రెడ్డి ఈదుల సుధాకర్ రెడ్డి వంగూరు తిరుపతిరెడ్డి పందెం జంగిరెడ్డి బీరం శ్రీనివాస్ రెడ్డి డైరెక్టర్ ఇరగ జీవి సైదులు ఇరగ జీవి తిరుపతయ్య మేస్త్రి రాములు సీతారాములు నారాయణ వెంకటస్వామి చంద్రయ్య ఇంకా చాలామంది కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు కుటుంబానికి భరోసా కల్పించారు

# తాగునీటి ట్యాంకుల వద్ద బురదమయం ... పట్టించుకోని అధికారులు



**దేవరకద్ర అమరచింత ఏప్రిల్ 25 ( స్కై న్యూస్):**అమరచింత మండల పరిధిలోని కొంకన్వానిపల్లి గ్రామంలోతాగునీటి ట్యాంక్ వద్ద లీకేజీ నీరుతో బురదమయమైన సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని కొంకనివానిపల్లి సిపిఐ మాజీ ఉపసర్పంచ్ అంక్య మహేశ్వరి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ ఆరోపించారు. శుక్రవారం గ్రామంలోని ఎనిమిదో వార్డులో ఉన్న మంచినీటి ట్యాంకుల పరిసర ప్రాంతాలన్నీ బురదమయం అయ్యాయని దీనివల్ల కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు. ట్యాంకు నుండి లీకేజీ అయిన నీరు ఈ వార్డులో బురదగా మారి రాత్రివేళ దుర్వాసనతో పాటు దోమల బెడదతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గ్రామంలో ఇంత పెద్ద సమస్యను సంబంధిత పంచాయతీ కార్యదర్శికి ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ పరిసర ప్రాంతాలను శుభ్రపరచి తాగునీటి లీకేజీని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ, ఏఐవైఎఫ్ ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాధవి, సత్యమ్మ, మన్నెమ్మ, చంద్రి, మంగమ్మ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

# భరోసా నిధులను ఖాతాలలో జమ చేయాలి



**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 25 (స్కైన్యూస్)** ప్రభుత్వం రైతు భరోసా నిధులను ఖాతాలను వెంటనే జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు శుక్రవారం మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా నిధులను నాలుగు ఎకరాలలోపు రైతులకు మాత్రమే వేశారని వారిలో కూడా కొందరి ఖాతాలలో డబ్బులు జమ కాలేదని వెంటనే వాటిని జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని జిల్లాలో రుణమాఫీ కానీ అనేకమంది రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారని అర్హత ఉన్న సాంకేతిక కారణాలతో రుణమాఫీ అందని రైతులు జిల్లాలో దాదాపుగా 6000 మందికి పైగా ఉన్నారని ఆయన వివరించారు. జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలు నత్తనడకగా ప్రారంభిస్తున్నారని జిల్లా వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతు పండించిన ప్రతి గింజలు కొనుగోలు చేయాలని కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు కూడా లేవని లారీల కొరత హమాలీల కొరత లేకుండా చూడాలని కోరారు ఈ కార్యక్రమంలో రమణారెడ్డి బంగారయ్య కాశీ0 సుధాకర్ రెడ్డి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు

# కళాశాల నిర్మాణంతో అద్భుతాన్ని ఆవిష్కరిస్తాం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**
**కళాశాల ముఖద్వారానికి తొలిపూజలు..**
**మూడవ అంతస్థకు లాంఛనంగా శంకుస్థాపన**
**ముఖ్య నాయకులు, మీడియా ప్రతినిధులతో శంకుస్థాపన కార్యక్రమం**



**షాద్నగర్ 25(స్కైన్యూస్):**కళాశాల నిర్మాణంలో అద్భుతాన్ని ఆవిష్కరించబోతున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలో దాతల సహకారంతో నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ముఖద్వారం పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా కళాశాల మూడవ అంతస్తు నిర్మాణం పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను సాధారణంగా కాకుండా అత్యాధునిక సదుపాయాలతో, ఎక్కడా లేనివిధంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ కళాశాలల స్థాయి సదుపాయాన్ని విద్యార్థులకు కల్పించబోతున్నామని ఆయన వెల్లడించారు. ఒక్క గంట కూడా విశ్రమించకుండా కళాశాల నిర్మాణం కోసం కూలీలు పని చేస్తున్నారని, వీలైనంత వేగంగా కళాశాల నిర్మాణాన్ని వారు పూర్తి చేస్తారని ఈ సందర్భంగా వెల్లడించారు. కళాశాల నిర్మాణానికి దాతలు ముందుకు రావడం సంతోషకరమని, వారి సహకారం వల్లనే ఎలాంటి ఆటంకం లేకుండా పనులు ముందుకు సాగుతున్నాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఒక పట్టుదలతో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరి సహకారం ఉందని, మీడియా కూడా ఇందులో కీలక భాగస్వామిగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మూడో అంతస్తు పూజలు సీనియర్ జర్నలిస్ట్ కస్తూరి రంగనాథ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, శ్రీశైలం తదితరులు కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణ రెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నేతలు చెంది తిరుపతి రెడ్డి, రఘు నాయక్, ఆగ్గనూర్ బస్వాం అప్ప, కొత్తూరు సుదర్శన్ గౌడ్, చలివెంద్రం పల్లి రాజు, జంగా నర్సింహులు, కొమ్ము కృష్ణ,ఇబ్రహీం, కేకే కృష్ణ, సోలి పూర్ శ్రీశైలం గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మోహన్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ మధన్ మోహన్ రెడ్డి,యువజన కాంగ్రెస్ నేత పులి మామిడి రాజేష్ గౌడ్ , జాంగారి రవి ,ఖదీర్, ఎలికట్ల మాజీ ఎంపీటీసీ శ్రీశైలం,ఖాబిర్, లింగారెడ్డి గూడ అశోక్, ముబరాక్, గోపాల్ నాయక్, నడీకూడ యాదగిరి యాదవ్, రాయ్ కల్ శ్రీనివాస్, వెంకట్ నర్సింహ రెడ్డి,టీజీ శ్రీనివాస్,మాణిక్యం, మంగ అశోక్,కుమార్ స్వామి,అన్వర్, నర్సింహులు, సీతారాం, సింగారం దర్శన్, సాజిద్ ,బండిశ్రీనివాస్, దిలీప్ కుమార్,అర్జున్ లక్ష్మ న్, పద్మరం వెంకటేష్ యాదవ్, శ్రీనాథ్, మార్గం రాజేష్ కుమార్, ఆర్ గంగనమొని సత్యయ్య, సాయి, కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికపై వార్డుల వారిగా సభలు నిర్వహించాలి

**సిపిఎం డీమాండ్**



**దేవరకద్ర అమరచింత ఏప్రిల్ 25 (స్కై న్యూస్):** అమరచింతలో జిఎస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి ఎస్ గోపి. జిల్లానాయకులు బి, వెంకటేష్ ఎస్ ,రాజు, ఎస్,అజయ్ లు మాట్లాడుతూ అమరచింత మున్సిపాలిటీలోని 10 వార్డులలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసినప్పటికీ ఆ కమిటీల సమావేశాలు నిర్వహించకుండానే తూతూ మంత్రంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడం సరైన కాదని విమర్శించారు. గత పదేండ్ల టిఆర్ఎస్ పాలనలో ఇండ్లు రాకపోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ ఇందిరమ్మ పాలనలోనైనా అర్హులైన పేదలకు ఇండ్లు వస్తాయనే కోటి ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని, కాంగ్రెస్ ఇచ్చినటువంటి హామీల అమలులో భాగంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికికేవలం 3500 ఇండ్లు అంటే, వార్డులకు గ్రామాలకు చాలా తక్కువ సంఖ్యలో ఇల్లు రావడం వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్నదని మన ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి సొంత జిల్లాకు నియోజకవర్గానికి పదివేల ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీల సమావేశాలు నిర్వహించడంతోపాటు వార్డులలో సభలను ఏర్పాటు చేసి హరత కలిగినపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ వార్డు ఆఫీసర్లు క్షేత్రస్థాయిల లో పర్యటనలు వార్డులలో చేసి నిజమైన లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని మంత్రులు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి సొంత జిల్లా పట్ల ఎక్కువ శ్రద్ధ తీసుకుని ఎక్కువ ఇందిర ఇండ్లు మంజూరు చేసేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు . ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పారదర్శకంగా లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తునఆందోళన లు చేస్తామని హెచరించారు.

# భూ భారతితో భూములకు రక్షణ

**: దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ. జి.మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయిన్**



**దేవరకద్ర ఏప్రిల్ 25 (స్కై న్యూస్):** దేవరకద్ర మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అవగాహన సదస్సు లో జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి , ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూభారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం భూభారతి చట్టమని అన్నారు. ఇకపై గ్రామాల్లో భూ పంచాయితీలు, వివాదాలు ఉండవని అన్నారు.భూములకు సంబంధించి శాశ్వత పరిష్కారం చూపించాలన్న ఉద్దేశంతో భూ భారతి చట్టం, పోర్టల్ తెచ్చామని, భూ భారతిపై ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.రైతులను మోసం చేయడానికే గత బీఆర్ఎస్ సర్కార్ ధరణి పోర్టల్ తెచ్చిందని, పేదలకు ఇచ్చిన భూములను సైతం ధరణి పేరుతో కొల్లగొట్టిందని ఆరోపించారు. ధరణి పేరుతో రైతులను, సామాన్యులను కోర్టుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేదాకా తిప్పిందని, 20 లక్షల ఎకరాలను ప్రొహిబిటెడ్ లిస్టులో పెట్టడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారని అన్నారు.సాదా బైనామాలతో పాటు ఇతర ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తామని తెలిపారు. పేర్లు, సర్వే నంబర్లు, ఎకరాలు తప్పు పడినా గతంలో కార్యాలయాలు చుట్టూ తిరిగిన పనులు కాలేదని, ఆ సమస్యలు ప్రస్తుత చట్టం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. ఒక్క రూపాయి చెల్లించకుండా రైతులు నేరుగా తాసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు.మే 1 నుంచి ప్రతి రెవెన్యూ గ్రామాలకు అధికారులు వచ్చి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు.భూభారతి కింద భూముల వివరాలను డిజిటలైజేషన్ చేస్తామని, దీంతో భవిష్యత్‌లో రైతులకు భూ సమస్యలు, వివాదాలు రావన్నారు. ఈ పోర్టల్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని కోరారు.రెవెన్యూ చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిందని అన్నారు.ప్రభుత్వం ఏదైనా కొత్త చట్టం తీసుకొస్తే ప్రజలకు ఉపయోగపడాలి కాని భారంగా మారకూడదన్నారు, బిఆర్ఎస్ పాలనలో దొరగారి స్వార్థంకోసం నాలుగు గోడల మధ్య కూర్చొని ధరణి చట్టాన్ని రూపొందించారని గత ప్రభుత్వంలో కబ్జా చేసిన ప్రభుత్వ భూములను అక్రమ పట్టాలను రద్దు చేస్తామన్నారు.ధరణి కష్టాలను తొలగించేందుకే గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణిని బంగాళాఖాతంలో కలిపి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి, మేధావులతో చర్చించి భూ భారతి చట్టాన్ని తెచ్చామని పేర్కొన్నారు.జూన్ మొదటివారం నుంచి త్వరలో రెవిన్యూ వ్యవస్థలో ప్రతీ గ్రామంలో మునుపటిలాగా గ్రామ పాలన అధికారి (జీపీఓ) ఉండే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.భూ సమస్యలపై గతంలో లాగా గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి విచారణ జరిపి అక్కడే అధికారులు భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి



**దేవరకద్ర ఏప్రిల్ 25 (స్కై న్యూస్):**పహాల్గం ఉగ్ర దాడికి నిరసనగా దేవరకద్ర మండల కేంద్రంలోని జమియా మజీద్ లో ముస్లిం సోదరులు నల్ల బ్యాడ్జీలో ధరించి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ పర్యటకులపై దాడిని తీవ్రంగా ఖండించారు. అమాయకులైన ప్రయాణికులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల ఆత్మ శాంతి కలగాలని మౌనం పాటించారు. యావత్ భారత వాణి ఇలాంటి ఘటనలను ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెంటనే సైనిక చర్యలను చేపట్టి ఇలాంటి చర్యలు పునరుద్ధం కాకుండా కేంద్రం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మైనార్టీ సోదరు లు పాల్గొన్నారు.

## అరెకటిక కుల దేవత ఈరనాగమ్మ దేవత కళ్యాణ మహోత్సవానికి విష్ణువర్ధన్ రెడ్డి కి ఆహ్వానం



**షాద్నగర్ 25(స్కైన్యూస్):**కేశంపేట్ మండల కేంద్రంలో అరెకటికల కుల దేవతయిన ఈర నాగమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం వచ్చే నెల 15,16 వ తేదీలలో జరుగనున్న కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి కి ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అరెకటిక కమిటీ సభ్యులు ముత్తుంకార్ శివాజీ, నాగేశ్వర్, మహేష్, నరేష్, చిన్న నరేష్ తదితరులు పాల్గొన్నారు..

## ఆరెకటిక కుల దేవత ఈరనాగమ్మ దేవత కళ్యాణ మహోత్సవానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపలి శంకర్ కు ఆహ్వానం



**షాద్నగర్ 25(స్కై న్యూస్ )**కేశంపేట మండల కేంద్రంలో అరెకటికల కుల దేవతయిన ఈర నాగమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం వచ్చే నెల 15, 16 తేదీలలో జరగనున్న కార్యక్రమనికి షాద్ నగర్ ఎమ్మెల్యే విర్లపలి శంకర్ ని శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందింజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్తూంకర్ శివాజి, నాగేశ్వర్, మహేష్, నరేష్, చిన్న నరేష్ తదితరులు పాల్గొన్నారు..

## భూ భారతి చట్టంతో పెండింగ్
# భూ సమస్యలకు పరిష్కారం

**- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట ఏప్రిల్ 25 (స్కైన్యూస్)** ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. రైతులు ఈ కొత్త చట్టం లోని సెక్షన్ల పై అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా శుక్రవారం కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ లో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధరణిలో ఉన్న సమస్యలను గుర్తించి ధరణి స్థానంలో రైతులకు మేలైన చట్టం తేవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణిని రద్దుచేసి రైతు సంఘాలు, రెవెన్యూ అధికారులు, మేధావులతో చర్చలు జరిపి ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు సంబంధించిన అన్ని భూ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వారికి భూధార్ కార్డును ఇవ్వడం జరుగుతుందన్నారు. ధరణిలో అధికారులకు అధికారాలను తొలగించడం వల్ల భూ సమస్యల పరిష్కారం నిమిత్తం రైతులు సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, భూ భారతిలో అలాంటి



అవసరం లేదని తెలిపారు. కింది స్థాయి అధికారుల వద్ద పొరపాట్లు జరిగితే లేదా పని కాకపోయినా పై స్థాయి అధికారులు న్యాయం చేసే అవకాశం భూ భారతిలో ఉందన్నారు. ధరణిలో రూల్స్ లేవని, కానీ భూ భారతిలో నిర్దిష్టమైన రూల్స్ ఉన్నాయని ఆమె తెలిపారు. అధికారులు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అలాగే రైతులు సైతం భూ భారతి చట్టం అమలులో అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూముల సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లను నియమించనుందని చెప్పారు. ధరణిలో లేని అనేక వెసులుబాట్లు భూ భారతి చట్టంలో ఉన్నాయన్నారు .చట్టంలో మోకపై ఉన్న రైతులకు హక్కు ఉండాలన్నదే భూ భారతి చట్టం ముఖ్య ఉద్దేశం అని



తెలిపారు. 99 శాతం కేసులు భూ భారతిలో తహసిల్దార్ వద్దనే ఉచితంగానే పరిష్కారం అవుతాయన్నారు. మ్యుటేషన్లు 30 రోజుల్లో అవుతాయని, ఒకవేళ కాకపోతే పోర్టల్ లో ఆటోమేటిక్ గా 31 రోజు అవుతుందని తెలిపారు.కింది స్థాయి నిర్ణయాన్ని పై స్థాయిలో అప్పీల్ అవకాశం భూ భారతిలో ఉందన్నారు. పాత చట్టంలోని లోటు పాట్లు, కొత్త చట్టం లోని వెసులుబాట్ల గురించి కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. ఈ సదస్సులో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు భీమ్ రెడ్డి, తహసిల్దార్లు బక్క శ్రీనివాస్, భాస్కర స్వామి, ఎంపీడీవో శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కోస్గి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు వర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్న దేశాలపై కఠినంగా వ్యవహరించాలి






**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 25 (స్కై న్యూస్)** దేశంలో ఉగ్రవాద చర్యలను ఉసిగొల్పుతున్న పాకిస్థాన్ లాంటి దేశాలపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఉగ్రవాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని ముస్లిం మైనార్టీ నాయకులు హబీబ్ మరియు నిజాం, ఖాజా బాబాలు కోరారు శుక్రవారం జిల్లా కేంద్రంలో ముస్లిం మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాశ్మీర్లో పాల మిలిటరీ బలగాలను పెంచాలని ఉగ్రవాద చర్యలకు పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. 27 మంది అమాయకుల ప్రాణాలను ఉగ్రవాదులు తీయడం బాధాకరమని భూమిపై జీవించే హక్కు ప్రతి ఒక్కరిపై ఉందని హక్కులను హరించడం తీవ్రవాదులకు సరికాదని హెచ్చరించారు. కాశ్మీర్లో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పోరాడడానికి ముస్లిం యువత ముందుకు వస్తారని మిలటరీలో ముస్లింలకు స్థానం కల్పించి పాకిస్తాన్తో పోరాడడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు వందలాది మంది మైనార్టీలు పాల్గొన్నారు

## కొత్తగూడెంలో ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీ

**ముఖ్యఅతిథిగా డాక్టర్ జయ లక్ష్మి,ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి**





**కొత్తగూడెం ఏప్రిల్ 25 (స్కై న్యూస్ ):**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 న ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ముర్రెడువాగు నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ జయ లక్ష్మి,ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008 నుండి ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని. భారత దేశం లో 2030 సం వరకు మలేరియా ను నిర్మూలించాలానే లక్ష్యం తో పనిచేస్తున్నామని తెలిపారు. ప్లాస్మోడియం పరాన్నజీవి ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా వ్యాధిగ్రస్తుని నుంచి ఆరోగ్యవంతునికి వ్యాధి చేరి మలేరియా జేఅరం కలిగిస్తుంది అని అన్నారు. చలి వణుకు తో కూడిన విపరీతమైన జ్వరంతో వ్యాధి గ్రస్తుడు బాధపడతారు అని అన్నారు.ఇంటిలో కాని ఇంటి ఆవరణలో కాని దోమలు గుడ్లు పెట్టకుండా చూసుకోవాలని, కనీసం వారానికి ఒకసారి నీరు నిల్వ చేసే పాత్రలు ఖాళీ చేయాలనీ ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించాలన్నారు.ఈ కార్యక్రమం లో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ .సుకృత , డాక్టర్. బాలాజీ నాయక్ డాక్టర్ మధువరన్ యూపీహెచ్సీ వైద్యాధికారులు, డిప్యూటీ డెమో ఫయాజ్ మొహియుద్దీన్, సబ్ యూనిట్ ఆఫీసర్స్ . జేతు, హరి కిషన్ ఎంపీహెచ్ఈఓ రామ్ ప్రసాద్, టెక్నికల్ సూపర్ వైజర్ చైతన్య కుమార్, వైద్య సిబ్బంది నర్సింగ్ విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ దేశ సమగ్రతకు, రక్షణకు
# ఎటువంటి త్యాగానికైనా ముస్లింలు సిద్ధం

ఉగ్రవాదాన్ని ముస్లింలు సమర్థించరు
షాద్ నగర్ లో ఉగ్రవాదంపై కదం తొక్కిన ముస్లింలు
పటేల్ రోడ్ జామియా మస్జిద్ నుండి ఎమ్మార్వో కార్యాలయానికి భారీ ర్యాలీ
భారత్ వెంటనే ముస్లింలు అంటూ సందేశం
పహిల్గాం ఉగ్రదాడిపై కన్నెర్ర౦ మృతుల కుటుంబాలకు సానుభూతి
ఇక్కడే పుట్టాం ఇక్కడే చస్తాం.. భారత్ మా తల్లి



**షాద్నగర్ 25(స్కైన్యూస్):**ఉగ్రవాదాన్ని ఇస్లాం ఎంత మాత్రం సమర్థించదని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ముస్లిం మైనార్టీ సోదరులు స్పష్టం చేశారు. పహిల్గాం ఉగ్రవాద దుశ్చర్యపై కదం తొక్కుతూ భారత ప్రభుత్వానికి సంఘీభావం తెలియజేశారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెగిలించాలని దేశానికి ప్రతి ముస్లిం పౌరుడు అండగా నిలుస్తాడని సంఘీభావం తెలియజేస్తూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని పటేల్ రోడ్డులో గల జామియా మస్జిద్ నుండి పట్టణానికి చెందిన వేలాదిమంది ముస్లిం మైనార్టీలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఒక మనిషిని హత్య చేస్తే సర్వ మానవాళిని హత్య చేసినట్లేనని ఖురాన్ చెబుతుందని, నిజమైన ముస్లిం ఎప్పుడూ పహల్గావ్ వంటి ఘాతుకానికి పాల్పడరని ఆయన అన్నారు. ఉగ్రవాదం అనేది డబ్బు కోసమో, పరపతి కోసమో సాగించే రాక్షస క్రీడగా పేర్కొన్నారు. జరిగిన ఘటనను ఇస్లాం ముక్త కంఠంతో ఖండిస్తుందన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారికి దేశ రక్షణ వ్యవస్థ తగిన బుద్ధి చెబుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. భారతదేశంలో ముస్లింలు అంతా హిందూ ముస్లిం భాయ్ భాయ్ నినాదంతో ఉన్నారన్నారు. ఉగ్రవాదులను ఈ దేశ ముస్లింలకు ముడి పెట్టి చూడవద్దన్నారు. ఈ దేశ సమగ్రతకు, రక్షణకు ఎటువంటి త్యాగానికైనా ముస్లింలు సిద్ధంగా ఉంటారన్నారు. పహల్గావ్




ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మరోసారి గుర్తు చేశారు.

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి - మహమ్మద్ అలీ ఖాన్ బాబర్**

పహిల్గాం ఘటనలో అమాయకులైన పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపిన సంఘటన అత్యంత దారుణమని పట్టణ మైనార్టీ నేత మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మహమ్మద్ ఇబ్రహీం, అసలు ముక్తార్ అలీ, అబ్దుల్ జామీ తదితరులు పేర్కొన్నారు. ఈ సంఘటనను ముస్లిం సమాజం తీవ్రంగా ఖండిస్తుందని మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ఈరోజు సాయంత్రం 7:30 గంటల సమయంలో పట్టణంలో క్యాండిల్ ర్యాలీ ముస్లిం సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంఘటనను ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వానికి తమ మద్దతు తెలియజేస్తున్నామని ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని వారు డిమాండ్ చేశారు.

**మా మనోభావాలను కించపరచవద్దు**

పహిల్గాం ఘటనను అడ్డంగా పెట్టుకుని రాజకీయంగా ముస్లింలను టార్గెట్ చేయొద్దని షాద్ నగర్ పట్టణ మైనార్టీ నేత జమ్రుద్ ఖాన్ పేర్కొన్నారు. టెర్రరిస్టులు ఎంతోమంది ఎన్నో వర్గాల వారు ఉండవచ్చని, నక్సలైట్లు ఇంకా ఇతర వర్గాల వారు ఎందరో అసాంఘిక శక్తులు ఉన్నారని కాకపోతే ముస్లిం మతస్తులనే టార్గెట్ చేసి దేశం నుండి వారిని వేరుగా చేసే ప్రయత్నం చేయవద్దని అప్పీల్ చేశారు. ముస్లింలు ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నారని దేశం కోసం తాము ముందు వరసలో ఉంటామని పేర్కొన్నారు.దేశ ద్రోహులు అన్నీ మతాల్లో ఉన్నారని కేవలం ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని కొందరు మాట్లాడడం సబబు కాదని పేర్కొన్నారు. ఈ దేశం కోసం ఏ త్యాగానికైనా తమ సిద్ధంగా ఉన్నామని అనవసరంగా హిందూ ముస్లింల సఖ్యతను దెబ్బతీయకూడదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో కార్యాలయంలో ప్రభుత్వానికి ఉగ్రవాదుల చర్యను ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు..

## ప్రముఖ న్యాయవాది కంచి రాజగోపాల్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

**రంగారెడ్డి జిల్లా షాద్నగర్25(స్కైన్యూస్)** పట్టణంలో ప్రముఖ న్యాయవాది కంచి రాజగోపాల్ జన్మదినంగా సందర్భంగా ఆయన కార్యాలయంలో శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్,పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, అగ్గనూర్ నందు, అగ్గనూర్ కిట్టు తదితరులు పాల్గొన్నారు..



## సింగరేణి ఆధ్వర్యం లో సమ్మర్ కోచింగ్ క్యాంప్

**జీఎం(పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్ పిఎం కవిత నాయుడు**



**కొత్తగూడెం ఏప్రిల్ 25 (స్కై న్యూస్ ):**సింగరేణి వ్యాప్తముగా 11 ఏరియాలలో ప్రతీ ఏడాది నిర్వహించే సమ్మర్ క్యాంప్ లలో భాగముగా ఈ ఏడాది కూడా సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యం లో 2025-26 సంవత్సరం కు గాను 18 సంవత్సరాల లోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు బాలురు బాలికలకు కొత్తగూడెం పరిసర ప్రాంతాల పిల్లలకు ఈ నెల 26 వ తారీఖు నుండి 20 మే వరకు అనుబవజ్ఞులైన శిక్షకులచే సమ్మర్ కోచింగ్ నిర్వహించబడునని, ఆసక్తి కలిగిన పిల్లలు (బాలురు బాలికలు) 26 ఏప్రిల్ , శనివారం సాయంత్రం 4.30 గంటలకు ప్రకాశం స్టేడియం నందు ప్రారంభం అయ్యే సమ్మర్ కోచింగ్ క్యాంప్ కి హాజరు అయి తమ పేర్లను నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జిఎం(పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్ %ఊ% పిఎం శ్రీమతి కవిత నాయుడు పత్రికా ప్రకటన లో భాగముగా తెలిపారు. ఈ క్రింద తెలిపిన సమయాలలో 26 ఏప్రిల్. 2025 నుండి 20 మే 2025 వరకు ఆయా వేదికలలో జరుగునని తెలియజేయడమయినది. క్రమ సంఖ్య క్రీడ్థలం ఉదయం సమయం సాయంత్రం సమయం అథ్లెటిక్స్ ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం బాస్కెట్ బాల్ సిఈఆర్ క్లబ్, కొత్తగూడెం 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం.బాక్సింగ్ ప్రకాశం స్టడియం, కొత్తగూడె 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం ఫుట్ బాల్ పకాశం స్టేడియం, కొత్తగూడెం 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం వాలీబాల్ ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం వుషు/కరాటే ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం డ్రాయింగ్ ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం 7.00 గం - 8.30గం ( ఉదయం మాత్రమే) పైన తెలిపిన ఆటలలో ఆసక్తి గల ఉద్యోగుల పిల్లలు ఆయా వేదికలలో, పైన తెలిపిన తేదీలు సమయాలలో పాల్గొని, క్రీడలలో నైపుణ్యం సంపాధించి ఈ వేసవి సెలవులను సద్వినియోగ పరచుకోవలసినది గా కొరడమైనది.

# దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను వేగిరం చేయాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట ఏప్రిల్ 25 (స్కైన్యూస్)** రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. భూభారతి చట్టం అమలుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మద్దూరు మండలంలోని అన్ని గ్రామాలలో భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ మద్దూరు మండలంలోని దమ్ ఘన్ పూర్, నాగిరెడ్డి పల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్ తో కలిసి సందర్శించారు. దమ్ ఘన్ పూర్ సదస్సులో 42 మందికి గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినా నేటికి స్థలాల ను మాత్రం కేటాయించలేదని బాధితులు సదస్సులో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ బాధితులను నుంచి దరఖాస్తులు తీసుకుని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తహసిల్దార్ మహేష్ గౌడ్ కు సూచించారు. గ్రామాలలో



ఎక్కువగా రైతులు ఎలాంటి భూ సమస్యలపై దరఖాస్తులు ఇస్తున్నారని అక్కడి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల చిన్న చిన్న సమస్యలను అధికారులు మోకా లోనే పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ మద్దూరు తహసిల్దార్ కార్యాలయానికి చేరుకుని భూ భారతి పైలెట్ ప్రాజెక్టు లో భాగంగా ఇంతవరకు మండలంలో



నిర్వహించిన రెవిన్యూ సదస్సులలో గ్రామాల వారీగా రైతులు ఇచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి అధికారులు తీసుకోవాల్సిన చర్యల పై గంట పాటు అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, ఆర్డీఓ రామచంద్ర నాయక్, పైలెట్ ప్రాజెక్టు ప్రత్యేక అధికారి యాదగిరి, రెవెన్యూ అధికారుల బృందం తో సుదీర్ఘంగా చర్చించి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు.

# వివిధ శుభకార్యాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

**నారాయణపేట ఏప్రిల్ 25 (స్కై న్యూస్):**నారాయణపేట జిల్లా కేంద్రములో ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన 15వ వార్డు అధ్యక్షులు కడెంపల్లి రఘు సోదరుని కూతురు వివాహములో నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ ఆర్ రెడ్డి పాల్గొని వధువరులను ఆశీర్వదించారు. అనంతరం నారాయణపేట మండలం పేరపళ్ళ గ్రామములోని శ్రీ మల్లయ్య స్వామి - శ్రీ గణపతి నూతన విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రములో పాల్గొని, దామరగిద్ద మండలం మల్రెడ్డి పల్లి గ్రామములోని మాజీ సర్పంచ్ చంద్రం సోదరుడు కుమారుని వివాహములో పాల్గొని వధువరులను



ఆశీర్వదించారు. నారాయణపేట మండలం అభంగాపూర్ గ్రామములోని దామరగిద్ద మండల పార్టీ ప్రధాన కార్యదర్శి



చందు బావ మరిది రిసెప్షన్ కార్యక్రమములో పాల్గొని వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమములో పట్టణ మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం

చాలా పార్టీలు పుడుతుంటాయి పోతుంటాయి కానీ బిఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని ముద్దాడింది.

కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసింది.

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలింది.

**సిద్దిపేట:**సిద్దిపేట నియోజకవర్గం కేంద్రం రంగదాం పల్లి అమర వీరుల స్థూపం నుండి వరంగల్ సభ వద్దకు వెయ్యి మంది విద్యార్థి, యువత పాదయాత్ర చేపట్టారు. అమర వీరుల కు నివాళ్లు అర్పించి.. జెండా ఊపి పాదయాత్ర ను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు.మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ కాశ్మీర్ పెహల్గంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి 2 నిమిషాలు శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఈరోజు మన సిద్దిపేట నుండి పాదయాత్రలో బయలుదేరినటువంటి విద్యార్థి యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నాను. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది 27వ తేదీన వరంగల్ లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు అవినావాభావ సంబంధం ఉంది. ఆనాటి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష కైనా, 2001లో బీఆర్ఎస్ పార్టీ ప్రారంభమైన సందర్భమైన సిద్దిపేటకు పేగు బంధం ఉందని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ పుట్టిన నాడు చాలామంది చాలా రకాలుగా మాట్లాడారు. గాలి బుడగ లాంటిది పాలపొంగు లాంటిదని అమాసకు పుట్టింది పున్నానికి పోతది అని కూడా అన్నారు. మనల్ని అన్న వాళ్లు ఆగమయ్యారు తప్ప టిఆర్ఎస్ పార్టీ ఆగం కాలేదు. చాలా పార్టీలు పుడుతుంటాయి పోతుంటాయి కానీ బిఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని ముద్దాడింది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా చరిత్రలో నిలిచింది. కేసీఆర్ గారి నాయకత్వంలో అంబేద్కర్, గాంధీల మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం. డాక్టర్ బాబాసాహెబ్



అంబేద్కర్ గారు బోధించు, సమీకరించు, పోరాడు అని అన్నారు. అదే పద్ధతిలో కెసిఆర్ గారు, ప్రొఫెసర్ జయశంకర్ గారు ప్రజలందరికీ తెలంగాణ ఎందుకు అవసరమో బోధించారు. సమైక్యవాదులపై, ఢిల్లీ పెద్దలపై పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారు. 1969లో చాలామంది అమరులయ్యారు. ఎంతోమంది విద్యార్థులు మరణించారు. పోలీస్ కాల్పుల్లో 369 మంది చనిపోయారు. ఆనాటి హింసను దృష్టిలో పెట్టుకొని మలిదశ ఉద్యమంలో కేసీఆర్, గాంధీ చూపిన బాటలో తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపారు.14 ఏళ్ల ఉద్యమం, 10 ఏళ్ల ప్రభుత్వం ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం. ఏ పాత్ర అయినా బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షం. రాష్ట్ర సాధన కోసం, మన ఆత్మగౌరవం కోసం 14 ఏళ్లు పోరాటం చేసాం. పదేండ్ల టిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి సంక్షేమాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపాము. ధాన్యం ఉత్పత్తిలో, తలసరి ఆదాయంలో, జిఎస్డిపిలో తెలంగాణను నెంబర్ వన్ గా నిలిపాము. అంతేకాదు డాక్టర్ల ఉత్పత్తిలో కూడా తెలంగాణ నెంబర్ వన్. తెలంగాణ రాష్ట్రం ప్రారంభించిన పథకాలు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చింది, కాంగ్రెస్ చెప్పిన మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలు ప్రజలకు అర్థమయ్యాయి. ఓడినా, గెలిచినా ప్రజల పక్షాన, ప్రజల మధ్యలో ఉండి కొట్లాడే పార్టీ బిఆర్ఎస్ మాత్రమే.ఈరోజు ఈ పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు కావాలి. ఆరోజు లంకలో రావణుడు చేసే అరాచకాలను ఎదిరించడానికి రామదండు కదిలింది. అలాగే ఈరోజు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలింది. మూడు రోజులపాటు 70 కిలోమీటర్లు పాదయాత్ర చేసి గులాబీ దండు రజితోత్సవ సభను విజయవంతం చేయడానికి కదిలిందని అన్నారు.ఈ పాదయాత్ర విజయవంతం చేయడానికి అందరూ క్రమశిక్షణతో ట్రాఫిక్ ఇబ్బందులు జరగకుండా నడవాలి. ఎవరికి చిన్న ప్రమాదం కానీ గాయం కానీ జరిగితే నా గుండె బాధపడుతుంది కాబట్టి అందరూ జాగ్రత్తగా వ్యవహరించాలని కోరుతున్నాను. పాదయాత్రలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను వివరించండి. ప్రతిరోజు మధ్యాహ్నం, రాత్రి భోజన సమయంలో మిమ్మల్ని కలుసుకుంటాను. గ్రామాల వారీగా, మండలాల వారీగా, పట్నాల వారీగా టీములు క్రమశిక్షణతో ముందుకు సాగాలి. మీకు అన్ని వసతులను ఏర్పాటు చేస్తాం. కంటికి రెప్పలా చూసుకునేందుకు మన పార్టీ సీనియర్ నాయకులు మిమ్మల్ని పర్యవేక్షిస్తారని అన్నారు.

# మైనింగ్ ఆఫీసు మూసివేత

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 25:** నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ శాఖ కా ర్యాలయానికి అద్దె భవనం దొరకక అవస్థలు తప్పడం లేదు. గత కొద్దికాలంగా ప్రస్తుతం ఉన్న అద్దె భవనంలో కార్యాలయం ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి తేవడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. గత ప్రభుత్వం అన్ని శాఖలకు ఉమ్మడిగా జిల్లా ల్లో కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్మించినప్పటికీ ఆ కార్యాలయంలో మైనింగ్ శాఖకు భవనాన్ని కేటాయించకపోవడంతో చాలాకాలంగా మార్కెట్ యార్డ్ సమీపంలోని అదే భవనంలోనే మైనింగ్ శాఖను కొనసాగించారు. గత కొన్ని నెలలపాటు ఖాళీ చేయా లని ఒత్తిడి తెచ్చినప్పటికీ అధికారులు స్పం దించకపోవడంతో గత రెండు రోజుల క్రితం అద్దె భవనం యజమానులు కార్యాలయానికి ఇంటర్నెట్, విద్యుత్ కనెక్షన్ వంటివి తొలగించారు.కార్యాలయానికి సేవ లు అందుకునే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని ఆయా రెంట్ బిల్డింగ్ కోసం అన్వేషణ జరుగుతున్నప్పటికీ రెంట్ ధర ఎక్కువగా చెబుతుండడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. ప్రభు త్వం నిర్మించిన పాత కలెక్టరేట్ భవనం, ప్రస్తుత కలెక్టరేట్ భవనాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని కార్యాలయాలు నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని విమర్శలు ఉన్నాయి.ప్రస్తుతం అద్దె భవనం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మై నింగ్ శాఖ కార్యాలయానికి కూడా జిల్లా ఉన్నతాధికారులు కార్యాలయాన్ని ఏర్పాటుకు సహకరించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులు.ప్రస్తుతం జిల్లాలో మన ఇసుక వాహనం పథకం అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో వినియోగదారులు సామాన్యులు ఇంటి నిర్మాణం కోసం ఇసుక ఆన్లైన్ దరఖాస్తులను చేసుకుంటున్నారు. దీంతోపాటు ఆయా వినియోగదారులకు రీచ్ నుం చి ఇసుకను తరలించిన అనంతరం వాటి నివేదికలను ఆన్లైన్లో పొందుపరచాల్సి ఉం టుంది ఆ తర్వాతే ఇసుక ట్రాక్టర్ యజమానులకు చెల్లింపులు బ్యాంకు ద్వారా పూర్తి అ వుతాయి. దీంతోపాటు మైనింగ్ శాఖ సం బంధించిన అన్ని సేవలు నిలిచిపోయాయి. దీంతో సామాన్యులు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అద్దె భవనం కోసం జిల్లాలో అక్కడక్కడ అన్వేషణ జరుగుతోంది. ఒక ప్రాంతంలో అద్దె భవనాన్ని పరిశీలించారు. శుక్రవారం లేదా శనివారం రో జు పరిశీలించి మైనింగ్ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం సేవలు ఫోన్ ద్వారా కొనసాగిస్తూనే ఉన్నామంటున్నారు అధికారులు.

# రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి..!

**బరువు తగ్గండి ...!**

**లావుగా ఉండటం**

**తప్పుకాదు. కాని తగ్గటం చాలా అవసరం ...!**



**భద్రాద్రి కొత్తగూడెం:**అందుకని ఉపవాసం ఉండకూడదు. కానీ ఒళ్ళు పెంచే ఆహారం తినకూడదని తెలుసుకోవాలి. శరీరపు బరువు సమతుల్యమై.. శరీరాకృతి పాడవకుండా ఉండాలంటే.. ఆత్మస్థైర్యం ఉండాలి. ఇంకా శరీరపు బరువును పెంచే నెయ్యి, తీపి పదార్థాలు, పెరుగు, మాంసం, వేపుడు కూరలు, నూనె వస్తువులు ముఖ్యంగా వేరుశెనగ నూనె, దుంపకూరలు, మినుముతో చేసే పదార్థాలు తినకండి. మజ్జిగ ఒళ్ళును పెరగనివ్వదు. రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి.అన్నం తినేముందు కనీసం నాలుగు గంటలు రాగి చెంబులో నిల్వ ఉంచిన నీటిని కొంచెం తాగండి. రోజూ పరగడుపున అరగ్లాసు గోరు వెచ్చని నీళ్ళలో చెమ్చాన్నర తేనె కలుపుకుని తాగండి. మధ్యాహ్నం నిద్రపోకండి. రాత్రి అన్నం తిన్నాక కనీసం వంద అడుగులు నడిచి అప్పుడు పడుకోండి.ఇంకా అర గంట సేపు నడవటం, సూర్య నమస్కారాలు చేయడం మంచిది. ఇంకా మిరియాలు, అల్లం, పిప్పలి, ఉసిరికాయ, నిమ్మకాయ, జీలకర్ర, ధనియాలు, వాము.. వీటిని ఆహారంలో చేర్చుకోవాలి. చారు, కూర, పుదీనా చట్నీలో వీటిని చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చునని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

## కాల్పులు ప్రారంభించిన పాకిస్థాన్

సీజ్ ఫైర్ ఎత్తేయడంతో నియంత్రణ రేఖ వెంబడి భారత్పై పాకిస్థాన్ కాల్పులు ప్రారంభించింది. పాక్ సైనికులు కాల్పులు మొదలుపెట్టారని, వారికి సైన్యం సమర్థంగా బదులిస్తోందని భారత సైనిక వర్గాలు తెలిపాయి. కాల్పుల విరమణ అమల్లో లేని కారణంగా సరిహద్దు వెంబడి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగే అవకాశం ఉంది..

## అక్బర్ నగర్ లో ఎంపి వంశికృష్ణ పర్యటన

**పెద్దపల్లి:**రామగుండం అక్బర్ నగర్ లో ఎన్టిపిసి బూడిద పైప్ లైన్ పగిలి ఇండ్లలోకి చేరి దెబ్బతిన్న ఇండ్లను పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. నష్టపోయిన తమను ఆదుకోవాలనీ అయనను కాలనీ వాసులు కోరారు. ఎన్టిపిసి అధికారులను పైప్ లైన్ పగలడానికి గల కారణాలు ఎంపి తెలుసుకున్నారు.వంశీ మాట్లాడుతూ ఫ్లాయాస్ అనేది ఒక విషపూర్తిమైంది... అలాంటి విషయం లో ఎన్టిపిసి యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలి. ఈ యాష్ వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని అన్నారు. బూడిదతో నిండిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. పైప్ లైన్ ప్రమాదంపై ఎన్టిపిసి అధికారులతో చర్చించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు.రామగుండం ప్రజల రక్షణే ఎన్టీపీసీ ప్రథమ బాధ్యత. ఈ నిర్లక్ష్యాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

## పాక్కు వత్తాసు పలికిన అస్సాం ఎమ్మెల్యే అరెస్ట్.. దేశద్రోహం కేసు నమోదు

**గువహటీ:**పహల్గాంలో ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అయితే, అస్సాంలోని మంకాచార్ నియోజకవర్గానికి చెందిన ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమీనుల్ ఇస్లాం.. పహల్గాం ఘటనలో పాకిస్థాన్ను సమర్థిస్తున్నట్లు ఆరోపణలున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ సీరియస్ అయ్యారు. సీఎం ఆదేశాలతో ఎమ్మెల్యేని అరెస్టు చేసి, దేశద్రోహం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# బేగంపేటలో జై భీమ్ జై బాబు జై సంవిధాన్

**కమాన్ పూర్:**రామగిరి మండలంలోని బేగంపేట గ్రామంలో శుక్రవారం జై భీమ్ జై బాపు జై సంహిదాన్ కార్యక్రమాన్ని రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న మరియు రామగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కండే పోశం మరియు బేగంపేట గ్రామ శాఖ ఆధ్వర్యంలో శు క్రవారం నిర్వహించారు.జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ భారీ ర్యాలీలో తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క – కొమరయ్య గౌడ్ పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఫోటోలు, రాజ్యాంగం పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ప్రజలకు రాజ్యాంగం విలువను తెలుపుతూ తాజా మాజీ ఎంపీపీ రేల్లి దేవక్క – కొమరయ్య గౌడ్ గారు ర్యాలీ నిర్వహించారు.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ....**

కేంద్ర బీజేపీ పాలనలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం హక్కులను కాలరాస్తు, మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి సిద్ధాంతాలను విస్మరిస్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని దేశ సమగ్రతను కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన జై బాపు, జై భీమ్,



జై సంవిధాన్ నినాదముతో పెద్ద ఎత్తున ఉద్యమిద్దమని పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అంటే ప్రధాని మోదీకి ఏమాత్రం విలువ లేదని, అందుకే పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ ను కించపర్చే విధంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారని మండిపడ్డారు. భారత రాజ్యాంగం అంటే బీజేపీ దృష్టిలో పుస్తకం మాత్రమేనని, కానీ తమ దృష్టిలో రాజ్యాంగం అంటే పవిత్ర గ్రంథం అని పేర్కొన్నారు. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసమే 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. పేదలంటే మోదీకి పట్టింపే లేదని, ఆయన ధ్యాసంతా దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడంపైనే ఉందని నాయకులు ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కల్వల శంకర్ యూత్ అధ్యక్షులు ఊదరి కుమార్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొరకొప్పుల తులసిరాం గౌడ్ తీగల రాజమల్లు శ్రీరాముల కుమార్ యాదవ్ బొంతల సదానందం కొత్తూరి మోహన్ సుద్దాల కిరణ్ లక్కార్తి మల్లయ్య గుండా శ్రీనివాస్ రేణికుంట్ల కొమురయ్య రేగళ్ళ రాజేశం అనవేణ రాజమల్లు మాతంగి కుమార్ రంగం దశరథం కందుకూరి శ్యామ్ అమ్మ సారయ్య బరుపటి కొమురయ్య ఆరంద రాజు లక్కార్తీ శ్రీను తాళ్లపల్లి అంజయ్య మరియు హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు .

# పీఓకే విలీనమే పరిష్కారమా...

పహల్గామ్ లో ఉగ్రదాడితో అందాల కశ్మీరం... అల్లకల్లోలంగా మారింది. ఉగ్రతూటాకు ఆ ప్రాంతం అల్లాడిపోయింది. ముష్కరుల రాక్షసకాండకు 26 మంది అమాయకులు బలయ్యారు. దీంతో భారత్, పాక్ మధ్య వివాదం మరింత ముదిరింది. భారత్ సరిహద్దుల్లో ఆయుధాలు సిద్ధం చేసుకుంటూనే... పాక్కు వెన్నులో వణుకుపుట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఖరాకండిగా పాక్తో దౌత్య సంబంధాలు తెంచేసుకుంది.పహల్గామ్ ఉగ్రదాడిని అమెరికా, రష్యా, చైనా, శ్రీలంక, ఇటలీ, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, జర్మనీ సహా పలుదేశాలు ఖండించాయి. ఉగ్రవాదుల ఏరివేతకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై పోరాటంలో మద్దతుగా ఉంటామని ప్రకటించాయి. దీంతో ప్రపంచదేశాల సపోర్టుతో పాక్ను భారత్ ఒంటరిని చేసేందుకు ప్లాన్ రెడీ చేస్తోంది.ఇటు జీ20 దేశాల రాయబారులతోనూ భారత విదేశాంగ శాఖ భేటీ అయ్యింది. దౌత్యవేత్తలకు పహల్గామ్ ఉగ్రదాడి గురించి కళ్లకు కట్టినట్లు వివరించారు భారత విదేశాంగ అధికారులు. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న తీరును%ా% భారత్పై పాక్ పదేపదే కవ్వింపులకు దిగుతున్న పరిణామాలను దౌత్యవేత్తలకు తెలియజేశారు. పాక్ కుట్రలను ఇటు అఖిలపక్ష సమావేశంలోనూ వివరించింది కేంద్రం. రాజ్నాథ్సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాక్ తీరుపై అన్నిపార్టీలు కన్నెర్ర చేశాయి. పాక్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా స్వాగతిస్తామంటూ కాంగ్రెస్ అగ్రనేతలు సైతం మద్దతిచ్చారు.పాక్ ఆక్రమిత కశ్మీర్ విలీనం' భారత్లో రాజకీయంగా, భద్రతపరంగా అత్యంత చర్చనీయమైన అంశం. ఈ విషయంపై భారత్లో ప్రభుత్వ విధానాలూ, ప్రజల భావోద్వేగాలూ గట్టి స్థాయిలో ఉన్నాయి.

పహల్గామ్ ఉగ్రదాడితో మరోసారి పీఓకే విలీనంపై జోరుగా చర్చ జరుగుతోంది. జమ్మూ కశ్మీర్లోని పహల్గామ్లో ఉగ్రవాదుల దుశ్చర్యకు 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. అయితే, ఈ దాడిని పాక్ ఆక్రమిత కశ్మీర్ను భారత్ తిరిగి స్వాధీనం చేసుకోడానికి మార్గం సుగమం చేసిందా? పాకిస్థాన్తో పూర్తిస్థాయి యుద్ధం జరిగి త్వరలోనే పీఓకే విలీనం అవుతుందా? దాయాది పాకిస్థాన్ కుట్రలకు అడ్డుకట్ట పడుతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఈ దిశగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేయబోతుందని చెబుతున్నారు.ఇదే సమయంలో తాజాగా, ప్రముఖ జ్యోతిషుడు ఏడాది కిందట చెప్పిన జోస్యం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. పహల్గామ్ దాడి పీఓకేలోని చాలా భూభాగాన్ని భారత సైన్యం స్వాధీనం చేసుకోడానికి కీలక అవకాశం కల్పించిందని, ఈ విషయంలో ఆర్మీ విజయం సాధిస్తుందంటూ రుద్ర కరణ్ ప్రతాప్ అనే జ్యోతిషుడు అంచనా వేశారు. గతంలో ఈయన చెప్పిన జోస్యాలు ఫలించడంతో దీనిపై నమ్మకం పెరిగింది. వాస్తవానికి గతేడాది ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ జ్యోతిషుడు.. ప్రధాని మోదీ, పీఓకే స్వాధీనం గురించి జాతకం చెప్పడం విశేషం.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం కుజ మహాదశలోకి ప్రవేశించారని, మూడోసారి ఆయన పదవిలోకి వచ్చి.. దేశ భూభాగానికి సంబంధించిన వివాదాలపై దృష్టిసారించి సత్ఫలితాలు సాధిస్తారన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఏప్రిల్ 2025 నుంచి సెప్టెంబరు 2025 మధ్య భారత్లో విలీనం అవుతుందని 2024 ఏప్రిల్ 6న ట్వీట్ చేశారు. దీనికి ప్రత్యేక క్రెడిట్ లేదా గుర్తింపు అవసరం లేదంటూ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.తాజాగా, పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం అప్పట్లో తాను పెట్టిన పోస్ట్ను జ్యోతిషుడు రీపోస్ట్ చేస్తూ.. "ఏప్రిల్ 22, 2025 నాటి సంఘటనలు ఒక కీలకమైన క్షణాన్ని సూచిస్తాయి.. పహల్గామ్లో జరిగిన ఒక దారుణమైన, పిరికిపంద ఉగ్రవాద దాడి రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను రేకెత్తిస్తుంది.. ఈ సమయంలో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లోని గణనీయమైన భాగాన్ని భారత సైన్యం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది" అని ట్వీట్ చేశారు.దేశ విభజన అనంతరం 1947లో పాకిస్థాన్ ఆక్రమించుకున్న కశ్మీర్లోకి కొంత భూభాగమే పీఓకే. దీనిని అధికారికంగా తమ భూభాగంగా భారత్ భావిస్తుంది. సంవిధాన పరంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రం మొత్తం భారత్లో భాగమే. పీఓకేను స్వాధీనం తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యమని భారత పార్లమెంటు 1994లో ఏకగ్రీవంగా తీర్మానించింది కూడా.అయితే, విలీనం అంత ఆషామాషీ కాదు. ప్రస్తుతం పాకిస్థాన్ అధీనంలో ఉన్న పీఓకేలో పాక్ సైన్యం ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇటీవల అక్కడ హమాస్ నేతల పర్యటన, ఉగ్రవాద శిబిరాల ఉనికిపై భారత్కు ఆగ్రహాన్ని కలిగించాయి. ఉగ్రదాడుల నేపథ్యంలో %ూశీఖ%పై కేంద్రం మరింత దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి.రాజకీయ–దౌత్యపరంగా: అంతర్జాతీయంగా పాక్పై ఒత్తిడి తెచ్చి, దానిని భారత్కు తిరిగి అప్పగించే మార్గం (కానీ ఇది చాలా కష్టం).రక్షణ చర్య: సైనిక మార్గంలో తిరిగి స్వాధీనం చేసుకోవడం. అయితే, ఇది పూర్తి స్థాయి యుద్ధానికి దారితీయవచ్చు.ప్రజా ఉద్యమాల ద్వారా: పీఓకే లో నివసించే ప్రజలు పాకిస్థాన్ పాలనపై అసంతృప్తిగా ఉండటం, స్వేచ్ఛను కోరడం దీన్ని భారత్ అనుకూలంగా మలచుకోవడం.ఇటీవల కేంద్రంలోని పెద్దలు కొన్ని సందర్భాల్లో పీఓకేను స్వాధీనం చేసుకుంటామని బహిరంగంగా వ్యాఖ్యానించారు.

# ఉగ్రవాదులది దేశ సమైక్యతను దెబ్బతీసే కుట్ర

## టెర్రరిస్టు మూలలను సమూలంగా నిర్మూలించాలి
## ఉగ్రవాద అంతానికి సమైక్యంగా పోరాడుదాం
## జమ్ము-కాశ్మీర్' ముమ్మాటికీ భారత్లో అంతర్భాగమే
## కాశ్మీర్ ప్రజలకు భారత సమాజం అండగా ఉంటుంది
## సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సబీర్ పాషా, ఉర్దూ ఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషి
## ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో మానవహారంతో నిరసన..మృతులకు నివాళి





**కొత్తగూడెం ఏప్రిల్ (25 స్కై న్యూస్ ):** పెహల్గాంలో జరిగిన పాక్ ప్రేరేపిత ఉగ్రదాడి భారతదేశ సమగ్రత, సమైక్యతను, మత సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రని, ఈ కుట్రలను సమిష్టిగా తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఉర్దూ ఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, ఆళ్ల మురళి అన్నారు. పెహల్గాంలో యాత్రికులపై జరుగిన టెర్రరిస్టుల దాడికి నిరసనగా, మృతులకు నివాళులర్పిస్తూ కొత్తగూడెం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వే స్టేషన్ సెంటర్లో మానవహారం నిర్మించి మృతులకు నివాళులర్పించిన అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ జమ్ము-కాశ్మీర్ భారత భూభాగంలో అంతర్భాగమేనని, ఎప్పటికీ దేశం నుంచి వేరుచేయలేరన్నారు. కాశ్మీర్ సమస్యను ఆసరాగా చేసుకుని పాక్ ఉగ్రవాదులు అమాయక ప్రజలపై దాడులకు తెగబడటం దుర్మార్గమన్నారు. పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అత్యంత హేయమని అన్నారు. నాడు బ్రిటిష్ దొరలను దేశంనుంచి వెళ్లగొట్టేందుకు కులమతాలకతీతంగా పోరాటం చేశామని, నేడు ఉగ్రవాదులను తరిమేందుకు పోరాడదామని, దేశ సమైక్యతకు పాటుపడదామని పిలిపునిచ్చారు. ఉగ్రవాదానికి మతం రంగు పులిమి దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే వారి ఆకాంక్షను నెరవేరనివ్వబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ ఉమర్ ఫరూక్, అబ్దుల్ రబ్, ఎండి షరీఫ్, ఎండి అబిద్, అమీర్ ఖాద్రి, జావేద్, ఎండి అయూబ్, అన్వర్, బాబు జానీ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూ కాశ్మీర్ లో ని పహల్గాం లో టూరిస్టుల పై ఉగ్రవాదులు దాడి చాలా బాధాకరం

## జమాతే ఇస్లామి హింద్ రామవరం రుద్రంపూర్ శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్



**చుంచుపల్లి ఏప్రిల్ 25 (స్కై న్యూస్ ):** జమ్మూ కాశ్మీర్ లో ని పహల్గాం లో టూరిస్టుల పై ఉగ్రవాదులు దాడి చాలా బాధాకర%శీ%. ఇలాంటి దారుణానికి కులం మతం తో ఎలాంటి సంబంధం లేదని, ఇలాంటి దుర్మార్గులను కఠినం గా శిక్షించాలి జమాతే ఇస్లామి హింద్ రామవరం రుద్రంపూర్ శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు.చుంచు పల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీ లోని మస్జిద్ ఎ ఖుబా లో శుక్రవారం ప్రత్యేక నమాజ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖురాన్ లో అల్లాహ్ ఒక మనిషి ప్రాణాన్ని తీయడం యావత్ మానవాళి ప్రాణం తీసినట్లు అని, ఒక మనిషి ప్రాణం కాపాడితే యావత్ మానవాళి ప్రాణం కాపాడినట్లు అని హితబోధ చేశాడు. హింస ద్వారా పేరు ధర్మాన్ని అణుచడం అత్యంత హేయమైన చర్య అని కూడా దైవం సెలవిచ్చాడు.తన చేతల ద్వారా, చూపుల ద్వారా ఆలోచన ద్వారా ఎవరికైనా నష్టం కష్టం కలిగిస్తే మీరు విశ్వాసులే కాదు ద్వేషించే వారిని ప్రేమించమని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారు.మంచి చెడు ఒకటి కాదు చెడును అతి శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు, నీ ప్రాణ శత్రువు సైతం నీ ప్రాణ స్నేహితులు అయిపోవడం మీరు గమనిస్తారు అని ఖురాన్ బోధిస్తుంది.అమాయకులను చంపమని ఇస్లాం ఏనాడూ ప్రోత్సాహించదని అన్నారు.ప్రతి మతం మంచిని మానవత్వాన్ని చాటి చెప్పుతుంది.ముక్కు పచ్చలారని నీవు వధువుతో పాటు అమాయకులైన వారిని పొట్టన పెట్టుకున్న దుర్మార్గులను కఠినం గా శిక్షించాలి.ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మేరుగైన వైద్యం అందించాలిస్వార్థ రాజకీయాలకు స్వస్తి పలికి కులమతాల మధ్య శాంతి సామరస్యం కోసం, కృషి చేయాల ఉగ్రవాదానికి మతానికి ఎలాంటి సంబంధం ఉండదు.ఇలాంటి సంఘటనలను మానవతా వాదులందరు ఖండించాలి. అని కోరారు.ఈ కార్యక్రమంలో మస్జిద్ ఇమామ్, షబ్బీర్, రజాక్, సోను బాయ్, అజ్జర్, రఫీ, ఆలం, షమీం తదితరులు పాల్గొన్నారు.

# భయానక అనుభవం.. ఉగ్ర దాడి నుంచి ఆ బృందం ఎలా తప్పించుకుందంటే?

**శ్రీనగర్:** అందాల కశ్మీరంలో పర్యాటకులపై తూటాల వర్షం కురిసింది. వారిపై ఉగ్ర ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్గా పేరొందిన పహల్గాంలోని బైసారన్ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ దారుణానికి 26 మంది పర్యాటకులు బలయ్యారు. 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులున్నారు. వారిలో ఒకరు నేపాలీ కాగా మరొకరిది యూఏఈ. మరో ఇద్దరు స్థానికులు కాగా మిగతావారు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, యూపీ, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందినవారు. వారిలో కేరళ రాష్ట్రానికి చెందిన ఓ బృందం ఉగ్రదాడి నుంచి తృటిలో తప్పించుకుంది. కేరళ నుంచి చిన్నారి సహా దాదాపు 23 మంది కశ్మీర్ పర్యటనకు వచ్చారు. వాళ్లంతా బైసరన్ ప్రాంతంలో ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వెళ్లారు. అయితే, టూరిస్ట్ స్పాట్కు వెళ్లాలంటే గుర్రంపైన వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వారు గుర్రపు స్వారీ ఖరీదు అధికంగా ఉండటంతో వేరే ప్రదేశానికి ట్యాక్సీ మాట్లాడుకుని వెళ్లిపోయారు. దీంతో ఈ దాడి నుంచి తృటిలో ప్రాణాలతో పడ్డారు. వేరే ప్రదేశానికి వెళ్తున్న టైంలో తమకు కొన్ని భారీ శబ్దాలు వినిపించాయని.. దుకాణాలు మూసివేస్తున్నారని.. ప్రజలు కూడా పారిపోతున్నారని ఆ పర్యాటకులు వివరించారు. అక్కడ ఏం జరుగుతోందో తమకు అర్థంకాలేదన్నారు. మేము అందమైన ప్రదేశానికి తీసుకెళ్లమని తమ గైడ్ను అడిగామని.. బతికి ఉండాలనుకుంటున్నారా..? లేదా..? అని. ట్యాక్సీ అతను సరాసరి తామున్న హోటల్ వద్దకు తీసుకెళ్లాడన్నారు. టీవీలో వార్తలు చూసిన తర్వాత అక్కడ ఉగ్రదాడి జరిందని.. గుర్రపు స్వారీకి వెళ్లి ఉంటే తమ పరిస్థితి ఎలా ఉండేదోనంటూ భయంకరమైన అనుభవాన్ని వివరించారు.

## ఇక భారత్ విడిచి వెళ్లాల్సిందే



**న్యూఢిల్లీ :** భారత్లోని పాక్ పౌరులకు కేంద్ర మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. దేశంలో ఉన్న పాక్ దేశస్తులు భారత్ను విడిచి వెళ్లిపోవాలని సూచించింది. జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిని భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. పహల్గాం ఉగ్రదాడి వెనుక పాక్ హస్తం ఉందని, సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశంపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం సమావేశమైన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ తీసుకున్న ఐదు సంచలన నిర్ణయాల అమలుకు భారత్ వడివడిగా అడుగువేస్తోంది. వేగంగా చర్యలు తీసుకునే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం పాక్ పౌరులకు జారీ చేసిన అన్నీ వీసాలను భారత్ రద్దు చేసింది. వాటిలో వైద్య వీసాలు కూడా ఉన్నాయి. పాకిస్తానీలకు వీసా సేవలను నిలిపివేసింది. కొద్ది సేపటిక్రితం విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. పాక్ పౌరులకు చెల్లుబాటయ్యే అన్నీ వీసాలను ఏప్రిల్ 27 రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఆ దేశ పౌరులకు జారీ చేసిన అన్నీ వైద్య వీసాలు ఏప్రిల్ 29 మంగళవారం వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని పేర్కొంది. సవరించిన సమయపాలన ఆధారంగా ప్రస్తుతం భారతదేశంలో ఉన్న అన్ని పాకిస్తానీలు వారి వీసాల గడువు ముగిసేలోపు వెళ్లిపోవాలని పేర్కొంది.

# పాకిస్తాన్ వెన్నులో వణుకు!

## భారత్ సర్జికల్ స్ట్రయిక్స్ చేస్తుందేమోనని మిస్సైల్స్ టెస్ట్‌కు ఆదేశాలు..!




పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌పై భారత్ కఠిన చర్యలకు ఉప్రకమించింది. అయితే, దాడి ఘటన తర్వాత భారత్ ఎలాంటి చర్యలు తీసుకుబోతోందని పాకిస్తాన్ భయాందోళనకు గురవుతున్నది. ఈ క్రమంలో ఈ నెల 24-25 తేదీల్లో జరిగిన ఎకనామిక్ జోన్‌లో కరాచీ తీరంలో ఉపరితలం నుంచి ఉపరితలం వరకు లక్ష్యాలను ఛేదించే క్షిపణులను పరీక్షించేందుకు పాకిస్తాన్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, పరిణామాలన్నింటిని భారతీయ ఏజెన్సీలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. గతంలో ఉగ్రవాదులు దాడులకు ఆత్మాహుతికి పాల్పడడంతో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీరమరణం పొందిన విషయం తెలిసిందే. ఆ ఘటన తర్వాత పాకిస్తాన్‌పై భారత్ సైర్జికల్ స్ట్రయిక్స్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మళ్లీ భారత ఎలాంటి దాడులు చేస్తుందోనని పాకిస్తాన్ ఆందోళనకు గురవుతున్నారు. పహల్గాం దాడి తర్వాత పాకిస్తాన్‌పై భారత్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సింధు జలాల ఒప్పందం రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆ దేశంపై ఆందోళన మరింత పెరిగింది. భారత్ దాడి చేస్తుందని పాకిస్తాన్ భావిస్తున్నది. ఇందులో భాగంగానే మిస్సైల్స్‌ని పరీక్షిస్తుంది. పాకిస్తాన్ వైమానిక దళం, నావికదళానికి నోటీసులు జారీ చేసింది. ఏదైనా దాడి జరిగితే ప్రతిస్పందించాలని సైన్యాన్ని అప్రమత్తం చేసింది. పాకిస్తాన్ నేవీ విన్యాసాలు మొదలుపెట్టిందని భారత్‌లో రక్షణ, భద్రతా సంస్థల వర్గాలు తెలిపాయి. భారత కదలికలను పాక్ పరిశీలిస్తూ వస్తున్నది. పహల్గాం దాడి ఘటనకు పాల్పడిన వారితో పాటు వారి స్పాన్సర్లను జవాబుదారీగా చేస్తామని భారత్ స్పష్టం చేసింది. పాకిస్తాన్‌లో జరుగుతున్న కార్యకలాపాలను భారత ఏజెన్సీలు నిశితంగా గమనిస్తున్నాయి. పాకిస్తాన్ సైన్యం సన్నాహాలను పర్యవేక్షిస్తున్నారు. పహల్గాం దాడి తర్వాత భారతదేశంలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు. పహల్గాం దాడితో పాకిస్తాన్ సంబంధాలపై చర్చించారు. పాకిస్తాన్ సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతును ఉపసంహరించుకునే వరకు.. 1960 నాటి సింధు జల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు కేంద్రం చర్యలు తీసుకున్నది. అయితే, భారత ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తక్షణం ప్రభావం చూపకపోయినా.. దీర్ఘకాలికంగా ఇబ్బందులుపడే అవకాశాలున్నాయి. అలాగే, అట్టారిలోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ కూడా తక్షణమే మూసివేశారు. ఎస్ఏఏఆర్‌సీ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్తాన్ జాతీయులను భారత్‌లో పర్యటించేందుకు అనుమతించరు

## ఇంగ్లీష్‌లోనూ మోదీ హెచ్చరిక



**ఇంటర్నెట్ డెస్క్:** ప్రధాని నరేంద్ర మోదీ సాధారణంగా హిందీలో ప్రసంగిస్తుంటారు. అంతర్జాతీయ వేదికలపైనా ఇదే భాషలో భారత వైఖరిని స్పష్టం చేస్తుంటారు. కానీ, నేడు బిహార్‌లో నిర్వహించిన ఓ సభలో మాత్రం అరుదైన రీతిలో ఒక్కసారిగా తన ప్రసంగాన్ని హిందీ నుంచి ఆంగ్లంలోకి మార్చారు. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ.. ఇంగ్లీష్‌లోనూ హెచ్చరించడం గమనార్హం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన బలమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చేరవేసేందుకు ఆంగ్లంలో ప్రసంగించినట్లు తెలుస్తోంది. 'ఇండియా విల్ ఐడెంటిఫై, ట్రాక్ అండ్ పనిష్ ఎవ్రీ టెర్రరిస్ట్ అండ్ దేర్ బ్యాకర్స్' (ప్రతి ఒక్క ఉగ్రవాదిని, వారికి మద్దతుగా నిలిచేవారిని భారత్ గుర్తించి, వెంటాడి, శిక్షిస్తుంది) అంటూ ప్రధాని మోదీ ఆంగ్లంలో స్పష్టం చేశారు. "ఈ రోజు బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడతాం. ఉగ్రవాదంతో దేశ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా వదిలిపెట్టబోం. బాధితులకు న్యాయం చేకూరేలా అన్ని విధాలా ప్రయత్నిస్తాం. ఈ విషయమై దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది" అంటూ ప్రధాని మోదీ ఇంగ్లీష్‌లో పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి వేళ భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. "మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ఉగ్రవాదులు నరమేధానికి పాల్పడ్డారు. సైనిక దుస్తుల్లో వచ్చి.. పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

## నేనేమీ మాట్లాడలేను.. ఒంటరిగా వదిలేయండి
### హైదరాబాద్ ఐబీ ఆఫీసర్ తండ్రి కన్నీటి వేదన



జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండకు అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతనాగ్ జిల్లా పెహల్గాం పట్టణ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం పర్యాటకులే లక్ష్యంగా చేసిన దాడిలో 26 మంది పర్యాటకులు అసువులు బాసారు. పెహల్గాంలోని బైసరాన్‌కు విహార యాత్రలోభాగంగా , ప్రకృతి అందాలను వీక్షిస్తున్న తరుణంలో ఉగ్రమూకలు వారిపై దాడికి తెగబడ్డారు. దాంతో ఆ ఆనంద క్షణాలు కాస్తా విషాదంగా మారిపోయాయి. ఉగ్రదాడిలో చనిపోయిన వారిలో జార?ండ్ రాష్ట్రానికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ కుమారుడు ఉన్నారు. ఐబీ(ఇంటెలిజెన్సీ బ్యూరో) ఆఫీసర్ గా హైదరాబాద్ లో విధులు నిర్వర్తిస్తున్న మనీష్ రంజాన్.. ఉగ్రమూకల దాడిలో ప్రాణాలు విడిచాడు. రంజాన్ మృతదేహం బుధవారం స్వస్థలానికి చేరుకున్న తరుణంలో ఆయన తండ్రి మంగ్లేస్ మిశ్రా కన్నీటి పర్యంతమయ్యారు. కుమారుడి మృతదేహాన్ని చూస్తూ కృంగిపోయారు. ఈ క్రమంలోనే జాతీయ మీడియా ఆయన్ని పలకరించగా తాను మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నానని, ఒంటరిగా ఉన్నానంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. 'నన్ను ఒంటరిగా వదిలేయండి. నేనే మాట్లాడలేను. కశ్మీర్ కు నవ్వుతూ వెళ్లాడు నా కుమారుడు రంజన్. ప్రతీరోజూ మాకు కాల్ చేసి మా ఆరోగ్యం గురించి అడిగేవాడు.. జాగ్రత్తలు చెప్పేవాడు. తాను అసువులు బాసిన చివరి రోజు కూడా మాకు కాల్ చేశాడు. అంతకుముందే మా కాల్ చేసి మాట్లాడిన నా కుమారుడు ఇలా వస్తాడని అనుకోలేదు' అంటూ కన్నీటి వేదనతో చెప్పారు.

## ఆయుధాలతో శ్రీనగర్‌లోకి విదేశీయులు..
## ఆధారాలు ఉన్నాయన్న పాకిస్థాన్




**న్యూఢిల్లీ:** పెహల్గామ్ దాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పాకిస్థాన్ ప్రతీకార చర్యలకు దిగింది. ఉగ్రదాడిలో పాకిస్థాన్ హస్తం ఉన్నట్లు భారత్ పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ సర్కారు స్పందించింది. పెహల్గామ్ దాడిలో తమ ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు చూపాలని పాకిస్థాన్ కోరింది. ప్రపంచ దేశాలకు ఆ ఆధారాలను వెల్లడించాలని పాకిస్థాన్ డిప్యూటీ ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ తెలిపారు. ఇవాళ ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్, ఇతరులతో కలిసి మాట్లాడారు. శ్రీనగర్‌లోకి కొందరు విదేశీయులు ఆయుధాలతో ప్రవేశించారని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని డిప్యూటీ ప్రధాని దార్ తెలిపారు. భారత ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఆ వ్యక్తులను శ్రీనగర్‌లో దాచినట్లు పాక్ డిప్యూటీ పీఎం ఆరోపించారు. భారతీయ నిఘా సంస్థలు విదేశీయులకు సపోర్టు ఇస్తున్నాయని, ఆ విదేశీయులు భారత్‌కు ఐఈడీలు సరఫరా చేస్తున్నట్లు విదేశాంగ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఒకవేళ భారత్ తమపై ఎలాంటి చర్యలకు దిగినా, దాన్ని ఎదుర్కొనేందుకు పాక్ సైనిక దళాలు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. పెహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మృతిచెందారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137